PRAJASAKTI Regd.No. 15795/68

సిటీ◆

ప్రజాశక్తి

ప్రతి అక్షరం ప్రజల పక్షం

Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu

సంపుటి : 45 సంచిక : 54 | విజయవాడ, బుధవారం 24 సెప్టెంబర్ 2025 | 8 + 8 పేజీలు వెల : 5.50

Vol No | Vijayawada, Wednesday 24 September 2025 | Rs



ఫైనల్ బెర్త్‌పై టీమిండియా గురి

- నేడు బంగ్లాదేశ్‌తో ఢీ
- శ్రీలంక ఔట్

8



మోహన్‌లాల్‌కు దాదాసాహెబ్ ఫాల్కే పురస్కారం అందిస్తున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము

జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవం

- ఫాల్కే పురస్కారం అందుకున్న మోహన్‌లాల్
- 'భగవంత్ కేసరి' తరపున అనిల్ రావిపూడి స్వీకారం

8



ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో బైఠాయించిన మత్స్యకారులు

కదంతొక్కిన మత్స్యకారులు

కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలంటూ పెద్ద ఎత్తున ఆందోళన

మా ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టడం లేదంటూ ఆగ్రహం

హామీని డిప్యూటీ సిఎం నిలబెట్టుకోవాలని డిమాండ్

ప్రజాశక్తి- యు.కొత్తపల్లి (కాకినాడ జిల్లా)

సముద్ర తీరప్రాంతంలో ఏర్పాటు చేసిన కాలుష్య కారక పరిశ్రమలను మూసివేయాలని కోరుతూ మత్స్యకారులు మంగళవారం పెద్ద ఎత్తున కదంతొక్కారు. కాకినాడ జిల్లా యు.కొత్తపల్లి మండలం ఉప్పాడ రింగ్ రోడ్డు సెంటర్లో ధర్నా చేశారు. దివీస్, అరవింద ఫార్మా పరిశ్రమల, రొయ్యలు, హెచరీస్ పరిశ్రమల కలుషిత జలాలను సముద్రంలోకి నేరుగా వదిలేయడంతో మత్స్య సంపద అంతరించిపోతోందని, దీనివల్ల చేపల వేటసాగక తమ జీవనోపాధి ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. తమ ఆకలి కేకలు ప్రభుత్వానికి పట్టడం లేదని, కాలుష్యంపైనా, తమ పరిస్థితిపైనా అధికారులకు పలు దఫాలు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సమస్యను పరిష్కరిస్తానని డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ గతంలో ఇచ్చిన హామీ అమలుకు నోచుకోలేదని గుర్తు చేశారు. హామీని నిలబెట్టుకోవాలని డిమాండ్ చేశారు. మత్స్య వేట తప్ప వేరే పనిరాని తమను ఆదుకోవాలని కోరుతూ రోడ్డుపై బైఠాయించారు. సమస్యలను పరిష్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని, ఇక్కడి నుంచి కదిలేదిలేదని తేల్చి చెప్పారు. ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీ, జాన్, గంటా విజయ్ కుమార్, నక్క మణికంఠ, సురాడ రాజు తదితర మత్స్యకార నాయకులు, భారీగా మత్స్యకారులు పాల్గొన్నారు.

మత్స్యకార పెద్దలతో కమిటీ..

మత్స్యకారుల ఆందోళన నేపథ్యంలో రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి వారితో చర్చలు జరిపారు. మత్స్యకార పెద్దలతో కమిటీ వేసి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కాకినాడ జిల్లా జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఆర్‌డిఒ మల్లిబాబు, అధికారులు పోలీస్ అధికారులు హామీ ఇచ్చారు. దీంతో ఆందోళన విరమించారు.

జీవనోపాధికి గండి కొట్టొద్దు : సిపిఎం

మత్స్యకారుల జీవనోపాధికి గండికొట్టొద్దని సిపిఎం యు.కొత్తపల్లి మండల నాయకులు గురాల అప్పారెడ్డి, కాళ్ల నాగేశ్వరరావు, గుర్రాల వెంకటసుబ్బరెడ్డి డిమాండ్ చేశారు. మత్స్యకారుల ధర్నాకు వారు మద్దతు తెలియజేస్తూ మాట్లాడారు. పరిశ్రమ పెడతామంటూ 2004లో భూములను ఒఎన్‌జిసి సేకరించిందన్నారు. అయితే, ఇక్కడ కాలుష్య కారక ఫార్మా, రొయ్యల పరిశ్రమలు పెట్టారని తెలిపారు. వీటి కాలుష్య జలాలను శుద్ధి చేయకుండా నేరుగా సముద్రంలోకి వదిలేస్తుండడంతో మత్స్యసంపద నాశనం అవుతోందన్నారు. దీనివల్ల ఉపాధి కరువై మత్స్యకారులు వలసపోతున్నారని తెలిపారు. వీరి జీవనోపాధిని కాపాడాలని, కాలుష్య కారక పరిశ్రమలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కలవరపెడుతున్న కలరా!

- గుంటూరులో మరో నలుగురికి నిర్ధారణ

ప్రజాశక్తి- గుంటూరు

కలరా కేసులు కలవరం పెట్టిస్తున్నాయి. ఇప్పటికే గుంటూరు జిల్లా తెనాలికి చెందిన మహిళ ఈ వ్యాధి బారినపడగా, తాజాగా మరో నాలుగు కేసులు వెలుగులోకి వచ్చాయి. దీంతో, కలరా కేసులు ఐదుకు చేరాయి. అతిసార కేసులూ పెరుగుతున్నాయి. దీంతో, తీవ్ర ఆందోళన వ్యక్తమవుతోంది. కలరా అనుమానిత లక్షణాలతో గుంటూరు జిల్లా మంగళగిరిలోని ఎయిమ్స్‌లో ఏడుగురు చేశారు. వారిలో తవ్వా నాగలక్ష్మి (పొన్నూరు మండలం ఇటికంపాడు), దగ్గు శారద (తాడేపల్లి మండలం పెనుమాక), డాక్టర్ బి.గీతాంజలి (మంగళగిరి), అబ్దుల్ వహాబ్ (తాడేపల్లి)లకు కలరా నిర్ధారణ అయ్యింది. ఎ.లోకేష్ (మంగళగిరి మండలం నవలూరు), షేక్ ఆసిన్ (విజయవాడ), షేక్ సైదా (పాత గుంటూరు) వైద్యనివేదికలు రావాల్సి ఉంది. గుంటూరు ప్రభుత్వ సమగ్ర వైద్యశాల (జిజిహెచ్)లో మంగళవారం నాటికి 92 మంది అతిసార రోగులు చికిత్స పొందుతున్నట్లు అధికారులు తెలిపారు. సోమవారం ఈ సంఖ్య 84గా ఉంది. అతిసార ప్రభావిత ప్రాంతాలైన గుంటూరులోని ప్రగతి నగర్, వర్కర్స్ కాలనీ, రామిరెడ్డితోట, సీతానగర్, నెహ్రూ నగర్‌లో జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా, నగర కమిషనర్ పి.శ్రీనివాసులు, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ పర్యటించారు. తాగునీరు, పారిశుధ్యం, వైద్య సేవలను తనిఖీ చేశారు. జిజిహెచ్‌లో చికిత్స పొంది డిశ్చార్జి అయిన సుద్దపల్లి డొంక వర్కర్స్ కాలనీకి చెందిన వెంకాయమ్మను, కాకాని రోడ్డులోని సీతానగర్‌కు చెందిన షేక్ కరీమున్నీసాను ఇంటికి వెళ్లి వారు పరామర్శించారు. కలరా, డయేరియా వ్యాప్తి చెందిన ప్రాంతాల్లో అధికారులు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు.



శాసన మండలిలో బొత్స, లోకేష్ వాగ్వాదం

మండలిలో ఉక్కు సెగలు

పోటాపోటీగా తీర్మానాలు ...ఆమోదం

మోడీకి అభినందనలు తెలుపుతూ ప్రభుత్వం

పెట్టుబడుల ఉపసంహరణను రద్దు చేయాలంటూ వైసిపి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో పరిశ్రమల స్థాపన, పెట్టుబడుల సాధన, విశాఖ ఉక్కు పరిశ్రమ మనుగడపై శాసన మండలిలో మంగళవారం వాడీవేడిగా చర్చ జరిగింది. దాదాపు మూడున్నర గంటల పాటు ఈ అంశంపై టిడిపి, వైసిపి మధ్య మాటల యుద్ధం కొనసాగింది. ఒక దశలో మంత్రి నారా లోకేష్ ఐదేళ్లు మీరు ఏం పీకారని అనడంతో గందరగోళం నెలకొంది. వైసిపి సభ్యులు పోడియం ను ముట్టడించారు. ఈ వాదనల మధ్యే విశాఖ ఉక్కుకు కేంద్రం రూ.11,440 కోట్ల రూపాయలు సాయం చేసినందుకు గానూ ప్రధాని మోడీకి, ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు, ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి అభినందనలు తెలుపుతూ మంత్రి నారా లోకేష్ తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ తీర్మానానికి మద్దతు ఇవ్వాలని వైసిపిని కోరారు. దీనిపై మాట్లాడిన ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ ప్రభుత్వ రంగంలోనే విశాఖ ఉక్కును పరిరక్షించాలని, పెట్టుబడుల ఉపసంహరణ నిర్ణయాన్ని పూర్తిగా వెనక్కి తీసుకోవాలని కోరుతూ తాము కూడా తీర్మానం ప్రవేశ పెడతామనిదానిని కూడా ఆమోదించాలని అన్నారు. ఆ మేరకు రెండు తీర్మానాలను ఇరువురు ప్రతిపాదించారు. రెంటినీ ఆమోదిస్తున్నట్లు ఛైర్మన్ ప్రకటించారు.

ప్రైవేటీకరణ లేదని ప్రకటన చేయించాలి: గోపి మూర్తి

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ చేయడం లేదని కేంద్ర ప్రభుత్వంతో ప్రకటన చేయించాలని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపి మూర్తి కోరారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ఆంధ్రుల సెంటిమెంటల్ ఐకాన్ అని, దానిని ప్రైవేటీకరణ చేయడం తగదన్నారు. ఇప్పటికీ ప్రైవేటీకరణ జరగదని భరోసా లేదన్నారు. ఒక వైపు ఆర్థిక సాయం చేస్తున్నట్లు చెబుతూనే మరో వైపు విభాగాల వారీగా ప్రైవేటీకరణ చేస్తున్నారన్నారు.

ప్రైవేటీకరణ జరగదు : లోకేష్

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ జరగదని మంత్రి లోకేష్ అన్నారు. . గతంలో వైసిపి హయంలో స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగిందని చెప్పిన వారే, ప్రస్తుతం సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రొడక్షన్ కెపాసిటీని దాదాపు 80శాతానికి తీసుకువచ్చామన్నారు. 'దేశ ప్రయోజనాల కోసం మేం ఎన్‌డిఎకు బేషరతుగా మిగతా 7లో

అడవి బిడ్డలపై జులుం

- నేవీ ఆయుధ డిపో వద్దంటూ ర్యాలీ చేపట్టిన గిరిజనులు
- అడుగడుగునా అడ్డగించిన పోలీసులు, పలుచోట్ల నిర్బంధం

3




గిరిజనులపై ప్రభుత్వ నిర్బంధం అన్యాయం : సిపిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఏలూరు జిల్లా, జీలుగుమిల్లి మండలం, వంకావారిగూడెంలో ఆయుధ ఫ్యాక్టరీ ఏర్పాటును వ్యతిరేకిస్తూ గ్రామాల్లో పర్యటిస్తున్న గిరిజనులపై ప్రభుత్వ నిర్బంధం ప్రయోగించడాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు మంగళవారం ప్రకటన విడుదల చేశారు. గ్రామసభ, పీసా కమిటీ రెండు, మూడు దఫాలు తీవ్రంగా వ్యతిరేకించినా ప్రభుత్వం ఆయుధ కర్మాగారం పెట్టి తీరుతామని ప్రయత్నాలు చేయడం దారుణమని పేర్కొన్నారు. మంగళవారం శాంతియుతంగా నిరసన తెలియజేసేందుకు ప్రయత్నించిన గిరిజనులు వారికి అండగా ఉన్న వామపక్ష నాయకులపై పోలీసులు దౌర్జన్యం చేయడం అప్రజాస్వామికమని తెలిపారు. నిరసన తెలిపే అవకాశం లేకుండా సెక్షన్ 144, 30 విధించి నిర్బంధానికి పూనుకోవడం, అరెస్టులకు ప్రయత్నించడం అన్యాయమని పేర్కొన్నారు. భోజనాలు తయారు చేయకుండా వంటలను అడ్డుకోవడం మరీ దుర్మార్గమని వివరించారు. ప్రజల అనుమతి లేకుండా నిర్మాణం చేయబోమని ప్రకటించిన ఎంపి, ఎమ్మెల్యే ఇప్పుడు ప్లేటు ఫిరాయించి గిరిజనులకు అన్యాయం చేసేలా చేస్తున్నారని తెలిపారు. గిరిజన మిగతా 7లో

ప్రతిపక్ష హోదా ఇవ్వండి

- హైకోర్టులో జగన్ పిటిషన్



ప్రజాశక్తి - అమరావతి

శాసనసభలో తనకు ప్రతిపక్ష నేత హోదా ఇచ్చేందుకు స్పీకర్ తిరస్కరిస్తూ ఇచ్చిన రూలింగ్‌ను సవాల్ చేస్తూ వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను బుధవారం హైకోర్టు విచారణ చేయనుంది. పతిపక్ష నేత హోదా ఇచ్చేలా స్పీకర్‌కు ఉత్తర్వులు ఇవ్వాలని ఈ పిటిషన్‌లో కోరారు. దీనిలో అసెంబ్లీ సెక్రటరీ, స్పీకర్ కార్యాలయ కార్యదర్శి, న్యాయ, శాసన వ్యవహారాల శాఖ కార్యదర్శిలతోపాటు స్పీకర్ అయ్యన్న పాత్రుడు, శాసనవ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్‌లను ప్రతివాదులుగా పేర్కొన్నారు. అసెంబ్లీలో సభా నాయకుడి తర్వాత ప్రతిపక్ష నేతతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించే సంప్రదానికి వీడ్కోలు పలికారని, సీఎం, మంత్రులు ప్రమాణం తర్వాత తనకు అవకాశం ఇచ్చారని పిటిషన్‌లో పేర్కొన్నారు. 'ప్రతిపక్ష నేత హోదా ఇవ్వాలని స్పీకర్‌కు లేఖలు రాశాను. స్పీకర్ ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. ఈనేపథ్యంలో మంత్రి పయ్యావుల మీడియా ద్వారా తనకు మిగతా 7లో

పిపిపి తోనే లక్ష్యాల సాధన

- రెండేళ్ళలో మెడికల్ కళాశాలలు పూర్తి చేస్తాం
- శాసనసభలో సిఎం చంద్రబాబు



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

వైద్యారోగ్యరంగంలో మౌళిక సదుపాయలతో పాటు అనుకున్న లక్ష్యాలను వేగవంతంగా సాధించాలంటే పిపిపి మోడ్‌లో ముందుకు వెళ్లడం తప్ప మరో మార్గం లేదని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అన్నారు. శాసనసభలో మంగళవారం వైద్యారోగ్యశాఖపై జరిగిన చర్చలో సిఎం పవన్‌పాయింట్ ప్రజంటేషన్ చేశారు. అనంతరం మాట్లాడుతూ ఈ విధానంలో రాబోయే రెండు సంవత్సరాల్లో మెడికల్ కళాశాలల నిర్మాణాలను పూర్తి చేస్తామన్నారు. పిపిపి అంటే ప్రైవేటీకరణ కాదని చెప్పారు. ఆర్థిక సంస్కరణలో భాగంగా ఈ విధానం ప్రాచుర్యంలోకి వచ్చిందన్నారు. దీనిలో 33 ఏళ్ల తర్వాత తిరిగి ఆయా ప్రాజెక్టులు ప్రభుత్వ చేతుల్లోకి వస్తాయన్నారు. ఐఐటి చెన్నై. ఉదయపూర్, నాగపూర్ వంటి ప్రతిష్మాత్మక సంస్థలు సైతం కొన్ని ప్రాజెక్టులను పిపిపి విధానంలో చేపట్టాయని చెప్పారు. గతంలో పిపిపి విధానంలో చేపట్టిన జేగూరుపాడు విద్యుత్తు ప్రాజెక్టు కాలపరిమితి ముగిశాక నేడు ప్రభుత్వం చేతికి వచ్చిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో 38 మెడికల్ కళాశాలలు ఉండగా అందులో ప్రభుత్వ రంగంలో 18,ప్రైవేట్‌రంగంలో మరో 18 ఉన్నాయని, వీటితో పాటు ఎయిమ్స్‌మెడికల్ కాలేజీ, గీతం యూనివర్శిటీలో మెడికల్ కాలేజీలు ఉన్నాయన్నారు. వైసిపి రాజకీయ లబ్ధి కోసం ఫేక్ న్యూస్ ప్రచారం చేస్తూ మెడికల్ కళాశాలలపై ప్రజలను మభ్య పెడుతోందన్నారు. గత ప్రభుత్వ విధానం ప్రకారం కన్వీనరు కోటాలో ప్రతి కాలేజీలో 64 సీట్లు ఉంటే కూటమి ప్రభుత్వం 75 సీట్లు ఇస్తోందని, మొత్తం మీద ప్రతి కాలేజీలో 11 సీట్లు ఎక్కువగా పేదలకు అందుబాటులోకి తెస్తున్నామన్నారు. గత ప్రభుత్వం రూ.8480 కోట్లతో మెడికల్ కాలేజీలు నిర్మిస్తామని చెప్పి ఐదేళ్లలో కేవలం రూ.1550కోట్లు మాత్రమే ఖర్చు చేసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన 15 నెలల కాలంలోనే రూ.787కోట్లు ఖర్చుపెట్టామన్నారు. వైసిపి పాలన తరహాలో నిర్మాణాలు చేపడితే మరో 15 ఏళ్ల సమయం పడుతుందన్నారు. మెడికల్ కళాశాలల నిర్మాణం పిపిపి విధానంలో చేపట్టినా వైద్యసేవలు ఉచితంగానే ఉంటాయని, ఔట్ పేషెంట్ విభాగం సేవలు, మందులు, ఇతర ఆరోగ్యసేవలు ఉచితంగా లభిస్తాయని చెప్పారు.

ప్రైవేటు ఆస్పత్రుల్లో 90శాతం సిజేరియన్లు

రాష్ట్రంలో జరుగుతున్న సిజేరియన్లలో 90 శాతం ప్రైవేటు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని ముఖ్యమంత్రి చెప్పారు. ఇది మంచిది కాదని, వీటిని తగ్గించాలని ఆయన అన్నారు. మొత్తంమీద రాష్ట్రంలో 98 శాతం ప్రసవాలు ఆస్పత్రుల్లోనే జరుగుతున్నాయని, వీటిలో 42శాతం ప్రభుత్వ ఆస్పత్రుల్లో జరుగుతున్నాయని చెప్పారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మాట్లాడుతూ వైద్య విద్య ప్రమాణాల పెంపునకు కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రైవేటీకరణ, పిపిపి విధానం మధ్య ఉన్న తేడా గురించి తెలియకుండా వైసిపి నేతలు విషప్రచారం చేస్తున్నారని చెప్పారు. ప్రస్తుతం 4 కళాశాలలకు టెండర్లు పిలిచామన్నారు.

ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది

- జీరో అవర్లో సమస్యల వెల్లువ
- నల్లబర్లీ పొగాకు కొనుగోలు నిలిచిపోయింది : పుల్లారావు

2

డిజిటల్ సాధికారత

- ఐటి పార్కులు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక జోన్లు
- ఐటి, ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖ
- ఇ - గవర్నెన్స్ జాతీయ సదస్సు ముగింపులో 'డిక్లరేషన్'

2

బంగారం భగభగ

- 10 గ్రాములు రూ.1.18 లక్షలు



న్యూఢిల్లీ : బంగారం ధర భగ్గుమంటోంది. పేదలే కాదు.. మధ్య తరగతి వాళ్లు కొనలేని స్థాయికి ఎగిసింది. 10 గ్రాముల పసిడి ధర రికార్డ్ స్థాయిలో రూ.1.18 లక్షలకు ఎగిసింది. అమెరికా టారిఫ్‌లు, భౌగోళిక అనిశ్చితులు, యుఎస్ హెచ్1బి వీసా రుసుం భారీగా పెంపు, డాలర్‌తో రూపాయి మారకం విలువ వరుస పతనం బంగారం ధరలకు ఆజ్యం పోస్తోన్నాయి. ఈ నేపథ్యంలోనే మంగళవారం 99.5 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారంపై రూ.2,650 పెరిగి అన్ని పన్నులతో కలిపి ఏకంగా రూ.1,18,300కు చేరింది. ఇంతక్రితం రోజు రూ.1,15,650 వద్ద ముగిసింది.

డాలర్‌తో రూపాయి మారకం విలువ 88 ఎగువకు పడిపోవడానికి తోడు హెచ్1బి వీసా ఛార్జ్‌ను లక్ష డాలర్లకు చేర్చడంతో పసిడి ధర పెరుగుదలకు ప్రధాన కారణమని ఫారెక్స్ ట్రేడర్లు పేర్కొంటున్నారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 10 గ్రాముల బంగారం ధర రూ.39,950 లేదా 50.60 శాతం పెరిగింది. 2024 డిసెంబర్ 31 నాటికి రూ.78,950గా పలికింది. మరోవైపు తాజాగా కిలో వెండిపై ఒకే రోజు రూ.3,220 పెరిగి రూ.1,39,600కు చేరింది. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు కిలో వెండి ధర రూ.49,900 లేదా 55.63 శాతం ఎగిసింది. 2024 డిసెంబర్ 31 నాటికి కిలో వెండి ధర రూ.89,700గా ఉంది. పండగ సీజన్‌లో ఆకాశాన్ని అంటిన బంగారం, వెండి ధరలతో సామాన్యుల కొనుగోళ్ల ఆశలు ఆవిరి కావడంతో పాటు.. అధిక ధరల పట్ల తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తోన్నారు.

కోల్‌కతాలో కుంభవృష్టి

- 24 గంటల్లోపు 251 మీ.మీ వర్షపాతం
- 10 మంది మృతి



కోల్‌కతా : పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. సోమవారం అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి నగరం అంతటా రోడ్లు, నివాస సముదాయాలు జలమయమయ్యాయి. దీంతో మంగళవారం నగరం అంతటా ట్రాఫిక్, ప్రజా రవాణా, రోజువారీ జీవితం స్తంభించిపోయింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా 10 మంది మరణించారు. వీరంతా విద్యుత్‌షాక్‌తో మరణించడం మరింత విషాదం. అలాగే, నగరంలో 24 గంటల కంటే తక్కువ సమయంలో 251.4 మీమీ వర్షపాతం నమోదయింది. 1986 తరువాత (259.5 మీ.మీ) ఇదే అత్యధిక వర్షపాతం. గత 137 ఏళ్లలో ఇది ఆరో అత్యధిక వర్షపాతం. నగరంలోని దక్షిణ, తూర్పు ప్రాంతాలలో వర్ష ప్రభావం ఎక్కువగా ఉందని, గరియా కామదహరిలో కొన్ని గంటల్లోనే 332 మీ.మీ వర్షపాతం, జోధ్‌పూర్ పార్క్‌లో 285 మీ.మీ వర్షపాతం నమోదైందని కోల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (కెఎంసి) తెలిపింది. అలాగే, కాలిఘాట్‌లో 280 మీ.మీ, టాప్సియాలో 275 మీ.మీ, బల్లిగంజ్‌లో 264 మీ.మీ, ఉత్తర కోల్‌కతాలోని తంతానియాలో 195 మీ.మీ వర్షపాతం నమోదైందని తెలిపింది. తెల్లవారుజామున 2,30 గంటల నుంచి 5.30 గంటల మధ్యే ఎక్కువ వర్షపాతం నమోదయిందని పేర్కొంది. వర్షాల కారణంగా బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో దసరా సెలవులు రెండు రోజుల ముందే ప్రారంభమయ్యాయి. ఈ నెల 26 నుంచి దసరా సెలవులను ఇప్పటికే ప్రకటించారు. రైల్వే ట్రాక్‌లు పూర్తిగా నీటితో నిండిపోవడంతో మెట్రో సర్వీస్‌తో పాటు, హౌరా, కోల్‌కతా టెర్మినల్ స్టేషన్లకు రైలు సేవలను నిలిపివేశారు. విమాన ప్రయాణం కూడా తీవ్రంగా ప్రభావితమైంది. కనీసం 30 విమానాలు రద్దు చేశారు. మరో 31 విమానాలు ఆలస్యంగా నడిచాయి. కాగా, సోమవారం ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 25 నాటికి ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

3 బిల్లులకు అసెంబ్లీ ఆమోదం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రాష్ట్ర శాసనసభలో మంగళవారం ప్రభుత్వం మూడు బిల్లులకు ఆమోదం తెలిపింది. ఎపి షెడ్యూల్డ్ క్యాస్ట్ (సబ్ క్లాసిఫికేషన్ బిల్లు-2025)ను సాంఘిక సంక్షేమశాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ప్రవేశపెట్టారు. సభ ఆమోదం తెలిపింది. ఎపి పంచాయతీరాజ్ అమెండ్‌మెంట్ బిల్లు-2025ను డిప్యూటీ సిఎం తరపున పౌరసరఫరాలశాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రవేశపెట్టారు. భారతీయ నాగరిక సురక్షా సంహిత-2023 సవరణ బిల్లును న్యాయశాఖ మంత్రి ఫరూఖ్ శాసనసభలో ప్రవేశపెట్టారు. ఈ మూడు బిల్లులకు సభ ఆమోదం తెలిపింది.

26 నుంచి డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ రెండోదశ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో డిగ్రీ అడ్మిషన్ల కౌన్సెలింగ్ రెండో దశ ఈ నెల 26 నుంచి ప్రారంభం కానుంది. ఈ మేరకు అడ్మిషన్ల కన్వీనర్, ఉన్నత విద్యామండలి జాయింట్ డైరెక్టర్ టివి కృష్ణమూర్తి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. తొలిదశలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులు బుధవారం (24వ తేదీ)లోపు కళాశాలల్లో రిపోర్టు చేయాలని తెలిపారు. రిపోర్టు చేయకుంటే సీటును రద్దు చేస్తామన్నారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడు తున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

బిసిల అభ్యున్నతికి కృషి

- మంత్రి సవిత

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి చేస్తోందని బిసి సంక్షేమశాఖ మంత్రి ఎస్ సవిత తెలిపారు. సచివాలయంలో 'కుల గణన సామాజిక న్యాయం' పుస్తకాన్ని ఆమె మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బలహీన వర్గాలకు రాజ్యాధికారంలోనూ, పాలనలోనూ భాగస్వామ్యం కల్పించేలా చర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. కుల గణనతో బిసిలకు ప్రయోజనం చేకూరుతుందని అభిప్రాయాన్ని మంత్రి వ్యక్తం చేశారు. జనాభాలో అధిక సంఖ్యలో ఉన్న బిసిలకు ఏ విధంగా న్యాయం జరుగుతుందనే విషయాన్ని 'కుల గణన సామాజిక న్యాయం' పుస్తకంలో విపులంగా పేర్కొన్నట్లు చెప్పారు. ఈ పుస్తకావిష్కరణలో రచయిత నెల్లూరు నర్సింహారావు, ప్రచురణ కర్త కోయ చంద్రమోహన్, తోట నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

క్రేన్ కిందపడి స్టీల్‌ప్లాంట్ కార్మికుడు మృతి

ప్రజాశక్తి - ఉక్కునగరం (విశాఖపట్నం)

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుడు ప్రమాదవశాత్తు క్రేన్ కిందపడి మృతి చెందారు. స్టీల్‌ప్లాంట్ పోలీసుల కథనం మేరకు.. డీ బ్రేకింగ్ మిషన్ కాంట్రాక్టర్ రమణ వద్ద స్కీమ్ స్కిల్ కార్మికుడు ముత్యాలు (43) పనిచేస్తున్నారు. సింహాచలం ప్రాంతానికి చెందిన ముత్యాలు ప్రతిరోజూ మెషిన్ మెయింటెనెన్స్ పనులు చూసుకుంటారు. మంగళవారం ఉదయం ప్రమాదవశాత్తు క్రేన్ కిందపడి మరణించారు. విషయం తెలిసిన పోలీసులు అక్కడకు చేరుకుని వివరాలు సేకరించి కేసు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కెజిహెచ్‌కు తరలించారు. ఎస్ఎంఎస్ యాజమాన్యం కాంట్రాక్టర్‌తో మాట్లాడగా ఆయన ఇన్సూరెన్స్ డబ్బులతో పాటు దహన సంస్కారాల ఖర్చులు, అదనంగా రూ.రెండు లక్షలు చెల్లించడానికి అంగీకరించారు. మృతుని కుటుంబానికి అధికారులు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. మృతుని కుటుంబానికి న్యాయం చేయాలని ఉక్కు కార్మిక సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్లాంట్‌లో కార్మికులను తగ్గించడంతో ఉన్న వారిపై పని భారం పడుతోందని, వారికి భద్రత కరువైందని స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి రామస్వామి తెలిపారు.

గిద్దలూరులో అమానవీయ ఘటన

- బకెట్‌లో నవజాత శిశువును వదిలి వెళ్లిన వైనం

ప్రజాశక్తి - గిద్దలూరు (ప్రకాశం జిల్లా)

ప్రకాశం జిల్లా గిద్దలూరులో అమానవీయ ఘటన చోటుచేసుకుంది. అప్పుడే పుట్టిన శిశువును ఓ బకెట్‌లో పెట్టి బాలింత వెళ్లిపోయారు. పోలీసులు, ఆస్పత్రి సిబ్బంది తెలిపిన వివరాల మేరకు.. సోమవారం అర్ధరాత్రి సమయంలో పట్టణంలోని ఓ ప్రయివేటు వైద్యశాలకు డెలవరీ కోసం గర్భిణి వచ్చారు. వైద్యులు అందుబాటులో లేకపోవడంతో ఆస్పత్రి వాష్‌రూమ్ వద్దే ఆమె డెలివరీ అయ్యారు. ఆ తర్వాత అక్కడే ఉన్న ఓ బకెట్‌లో మగశిశువును వదిలి అక్కడి నుంచి బాలింత వెళ్లిపోయారు. శిశువు ఏడుపు వినిపించడంతో ఆస్పత్రి సిబ్బంది వాష్‌రూమ్ వద్దకు వెళ్లి చూడగా బకెట్‌లో శిశువు ఉండడాన్ని గమనించారు. వెంటనే సిబ్బంది ఆ శిశువును మరో ప్రయివేటు ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సిసి పుటేజీ ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

ఆశాలు, అంగన్‌వాడీలకు తల్లికి వందనంపై చర్చిస్తాం

- మంత్రి లోకేష్



ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలకు తల్లికి వందనం పథకం అమలు చేసే అంశంపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామని విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ తెలిపారు. తల్లికి వందనం పథకం లబ్ధిదారుల వివరాలు చెప్పాలని వైసిపి సభ్యులు వై శివరామరెడ్డి, రమేష్ యాదవ్, బొమ్మి ఇజ్రాయేల్ శాసనమండలి ప్రశ్నోత్తరాల సమయంలో మంగళవారం కోరారు. ఈ సందర్భంగా సభ్యులు మాట్లాడుతూ ఈ పథకం అమల్లో కోతలు పెట్టారని, చాలా మందికి ఇంకా డబ్బులు పడలేదని విమర్శించారు. మంత్రి లోకేష్ మాట్లాడుతూ ఒకటో తరగతి విద్యార్థులకు అపార్ ఐడీ మంజూరు చేసిన తర్వాత అమలు చేస్తామన్నారు. ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో చేరిన తర్వాత పరిశీలించి నిధులు విడుదల చేస్తామన్నారు.

ఎస్సి విద్యార్థులకు రాష్ట్రప్రభుత్వ వాటా రూ.9వేలే పడ్డాయని, కేంద్రప్రభుత్వం వాటా నిధులు రాగానే జమచేస్తామని చెప్పారు. ఈ సందర్భంగా చైర్మన్ మోషేనురాజు పారిశుద్ధ కార్మికుల ప్రస్తావనను తీసుకొచ్చారు. గత ప్రభుత్వంలో పారిశుద్ధ కార్మికులకు తల్లికి వందనం అమలు చేయాలని ఉత్తర్వులు ఇచ్చినా వారికి అమలు కావడం లేదన్నారు.

గ్రామీణ ప్రాంతంలో వార్షిక ఆదాయం రూ.10వేలు, పట్టణ ప్రాంతంలో రూ.12వేలు లోపు ఉంటేనే పథకానికి అర్హులని మంత్రి లోకేష్ చెప్పారు. అయితే తరువాత పారిశుద్ధ కార్మికులకు పూర్తిగా మినహాయింపు ఉందని తాను తప్పుడు సమాచారం చెప్పానని లోకేష్ అంగీకరించారు. ఇదే సమయంలో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు కూడా తల్లికి వందనం అమలు చేయాలని ప్రభుత్వాని కోరుతున్నారని, దీనిపై మంత్రివర్గ సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.



ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ పథకం అమలు చేసి రెండు నెలలు పూర్తయినా చాలామంది నగదు జమకాలేదనే ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. లబ్ధిదారులు ఎంతమంది, కేంద్రం నుంచి గ్యాప్ ఎంత ఉందనే సమాచారం ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం ఆ సమాచారం తన వద్ద లేదని చెప్పిన లోకేష్ తరువాత అందిస్తానని చెప్పారు.



వంపూరు గంగులయ్యతో ప్రమాణం చేయిస్తున్న మంత్రి దుర్గేష్

సంస్కృతి, కళల పూర్వ వైభవానికి కృషి

- మంత్రి దుర్గేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో జానపద కళలు, సృజనాత్మకతకు పెద్దపీట వేస్తున్నామని పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ తెలిపారు. విజయవాడ పున్నమి ఘాట్‌లోని హరిత రిసార్ట్ (బెరం పార్క్)లోని కాన్ఫరెన్స్ హాలులో రాష్ట్ర జానపద, సృజనాత్మక అకాడమీ చైర్మన్‌గా వంపూరు గంగులయ్యతో మంత్రి దుర్గేష్ మంగళవారం ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఇటీవలే తాను కేంద్ర మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామాను రాష్ట్రానికి కేటాయించాలని కోరానన్నారు. అందుకు సానుకూల స్పందన వచ్చిందన్నారు. అతి త్వరలోనే రాజమండ్రికి నేషనల్ స్కూల్ ఆఫ్ డ్రామా వస్తుందన్నారు. కేంద్రం సహకారంతో కళాకారుల పెన్షన్‌ను పునరుద్ధరిస్తామన్నారు. త్వరలోనే అనుబంధ శాఖల పోస్టుల నియామకం ఉంటుందన్నారు. గంగులయ్య మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం తనపై ఉంచిన విశ్వాసాన్ని వమ్ము చేయకుండా సమర్థవంతంగా పని చేస్తానన్నారు.

ప్రజల్లో వ్యతిరేకత వస్తోంది

- జీరో అవర్లో సమస్యల వెల్లువ
- నల్లబర్లీ పొగాకు కొనుగోలు నిలిచిపోయింది : పుల్లారావు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఆర్అండ్‌బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, నిధులు వచ్చినా విడుదల చేయడం లేదని, దీనివల్ల ప్రజల్లో తీవ్ర వ్యతిరకత వ్యక్తమవుతోందని అసెంబ్లీలో అధికారపక్ష సభ్యులు తెలిపారు. మంగళవారం శాసనసభ జీరో అవర్లో పలువురు సభ్యులు వివిధ అంశాలపై మాట్లాడారు. రాజానగరం జనసేన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ మాట్లాడుతూ తన నియోజకవర్గంలో రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, కొన్ని చోట్ల పనులు చేసినా డబ్బులు ఇవ్వకపోవడంతో మిగిలిన పనులు చేసేందుకు కాంట్రాక్టర్లు ముందుకు రావడం లేదని తెలిపారు. రోడ్లపై వాహనాలు తిరగాలంటే ఇబ్బందిగా ఉందని, ప్రజల్లో వ్యతిరేకత వస్తోందని చెప్పారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు రోడ్లను వెంటనే బాగు చేయించాలని కోరారు. వెంటనే నిధులు విడుదల చేయించాలని కోరారు. మదనపల్లి ఎమ్మెల్యే షాజహాన్‌బాసా మాట్లాడుతూ తన నియోజకవర్గంలో తాగునీరు సమస్య ఉందని అన్నారు. ట్రాఫిక్ సమస్య కూడా ఎక్కువగా ఉందనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ ఉత్తర బిజెపి ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ ఆంధ్రా యూనివర్శిటీ పరిధిలో 18 పోస్టులు తాత్కాలికంగా నియమించారని, వారిని పర్మినెంటు చేయాలని కోరితే లోకేష్ కార్యాలయం చెబితేనే చేస్తామంటున్నారని అన్నారు. దీనిపై విద్యాశాఖ మంత్రి లోకేష్ స్పందించి వారి నియామకాలు పూర్తి చేయాలని కోరారు. చిలకలూరిపేట ఎమ్మెల్యే పత్తిపాటి పుల్లారావు మాట్లాడుతూ నల్లబర్లీ పొగాకు 2,200 టన్నులు కొనుగోలు చేశారని, ఇంకా రైతుల వద్ద పెండింగ్‌లో ఉందని తెలిపారు. కొనుగోలు విషయంలో ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంతో 20 క్వింటాళ్లకుపైబడి పొగాకు పండించిన రైతుల వద్ద పత్తి నిలిచిపోయిందని తెలిపారు. . పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మాట్లాడుతూ తన నియోజకవర్గంలోని ఎల్లన్నపేట మండల పరిధిలో ఇప్పటికీ పోలీసుస్టేషన్ లేదని, నియోజకవర్గంలో ఫైర్ స్టేషన్‌లేదని తెలిపారు. అగ్ని ప్రమాదం జరిగితే ఒరిస్సా ఫైరింజర్లు వస్తున్నాయని తెలిపారు. జక్కంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మాట్లాడుతూ పంచాయతీరాజ్ కార్మికులకు జీతాలు పెంచకుండా వారి శ్రమను దోచుకుంటున్నామని అన్నారు. శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రఖ్యాతిగాంచిన కాళహస్తి దేవాలయం పరిధిలో ఆస్పత్రి లేదని, అక్కడ ఉన్న ప్రభుత్వ ఆస్పత్రిని దేవాలయానికి అనుబంధం చేయాలని తెలిపారు. బొబ్బిలి ఎమ్మెల్యే ఎర్‌విఎస్‌కె రంగారావు మాట్లాడుతూ గతంలో అసెంబ్లీలకు నియోజకవర్గ అభివృద్ధి ఫండ్ ఉండేదని, దాన్ని పునరుద్ధరించాలని కోరారు. దీనికి పలువురు సభ్యులు బల్లలు చరిచి తమ మద్దతు ప్రకటించారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ తన అభిప్రాయం కూడా అదేనని, గతంలో నిధులు ఇచ్చారని తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యేలందరూ ముఖ్యమంత్రిని కలిసి దీనిపై ఒప్పించుకుని నిధులు రాబట్టుకోవాలని కోరారు. పెనమలూరు ఎమ్మెల్యే బోడే ప్రసాదు మాట్లాడుతూ గతంలో ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలు మునిగిపోతున్నాయని, వాటిని మెరక చేయించాలని, గృహ నిర్మాణశాఖ మంత్రిని కోరారు.కావలి ఎమ్మెల్యే దుగమాటి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ తన నియోజకవర్గ పరిధిలో కాలువలు సరిగాలేక పొలాలు నీటమునుగు తున్నాయని, పంటలు దెబ్బతింటున్నాయని తెలిపారు.. పాలకొండ ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ, తణుకు ఎమ్మెల్యే ఆరిమిల్లి రాధాకృష్ణ, గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు, కొవ్వూరు ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, గుంతకల్లు ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కూడా మాట్లాడారు.

పెట్టుబడుల కోసం శ్రమిస్తున్నాం

- మంత్రి లోకేష్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెట్టుబడుల కోసం అహర్నిశలూ శ్రమిస్తున్నామని మంత్రి నారా లోకేష్ తెలిపారు. మండలిలో పరిశ్రమలపై జరిగిన చర్చలో ఆయన ప్రసంగించారు. విశాఖలో ఉర్సా కంపెనీకి రూపాయికే ఎకరం భూమి కట్టబెట్టారని నిరూపిస్తే మంత్రి పదవికి రాజీనామా చేస్తానని సవాల్ విసిరారు. టిసిఎస్, కాగ్నిజెంట్ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఒక్కో కంపెనీ 25 వేల ఉద్యోగాలు కల్పిస్తుందన్నారు. రూ.15 వేలకోట్ల ఎకనామిక్ యాక్టివిటీ క్రియేట్ అవుతుందన్నారు. ఈ రెండు కంపెనీలకు మాత్రమే రూపాయికి భూములిచ్చామని, ఇక ఏ కంపెనీకి ఇవ్వలేదని తెలిపారు. ఈ రెండు కంపెనీలకు భూములు ఇవ్వొచ్చా, ఇవ్వకూడదా? బొత్స సత్యనారాయణ క్లారిటీ ఇవ్వాలన్నారు. అధికారంలోకి వస్తే కూటమి ప్రభుత్వం పరిశ్రమలకు కేటాయించిన భూములను రద్దు చేస్తామంటూ వైసిపి బెదిరిస్తోందని, ఈ విషయాన్ని టిసిఎస్ అడుగుతోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. తాము కష్టపడి ఇప్పటికి రూ.10.4 లక్షల కోట్ల పెట్టుబడులకు 340 ఎంఒయు కుదుర్చుకున్నామని తెలిపారు.

పరిశ్రమలకు విలువైన భూములు ధారాదత్తం చేస్తున్నారంటూ మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. 2023లో తాము విశాఖలో నిర్వహించిన సమ్మిట్‌లో రూ.13 లక్షల కోట్లు పెట్టుబడులకు ఎంఒయులు కుదిరాయన్నారు. ఏ సమ్మిట్‌కు రాని ముఖేష్ అంబాని, అదాని, నవీన్ జిందాల్ వంటి వారు కూడా వచ్చారని తెలిపారు. వైఎస్ జగన్‌పై నమ్మకంతోనే పెద్ద పారిశ్రామిక వేత్తలు వచ్చారని గుర్తు చేశారు. విశాఖలో 2005 నుంచి ఇప్పటి వరకు అనేక కంపెనీలు ఏర్పాటయ్యాయని తెలిపారు. అదాని డేటా సెంటర్ తమ హయాంలోనే వచ్చిందన్నారు. లూలూ కంపెనీని తాము తరిమేయలేదని, వారు మలేషియాలో అనేక కంపెనీలు, మాల్స్‌లు బోర్డు తిప్పేశారని గుర్తుచేశారు. అలాంటి వారికి ప్రభుత్వ స్థలాలు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు.

'ఫీజు రీయింబర్స్‌మెంట్'పై వైసిపి వాయిదా తీర్మానం

- తిరస్కరించిన ఛైర్మన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై చర్చించాలని శాసనమండలిలో వైసిపి వాయిదా తీర్మానం అందించింది. సమావేశం ప్రారంభం కాగానే ఈ అంశంపై చర్చించాలని డిమాండ్ చేస్తూ సభ్యులు పి చంద్రశేఖర్ రెడ్డి, వరుదు కళ్యాణి, కల్పలతా రెడ్డి వాయిదా తీర్మానం అందించారు. దీనిని తిరస్కరిస్తున్నట్లు ప్రకటించిన ఛైర్మన్ ప్రకటించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. బిఎసి ఎజెండాలో పొందుపరచాలని ఎందుకు ప్రస్తావించలేదని ప్రశ్నించారు. గత ప్రభుత్వం పెట్టిన బకాయిల్లో రూ.1,200 కోట్లు చెల్లించామని, పెండింగ్‌లో ఉన్న రూ.1,400 కోట్లు రానున్న మూడు నెలల్లో విడుదల చేస్తామని చెప్పారు. ఈ అంశంపై తాము చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. మంత్రి లోకేష్ బకాయిలపై వాస్తవ విరుద్ధ మాటలు చెప్పి సభను తప్పుదోవ పట్టిస్తున్నారని అన్నారు. ఈ అంశంపై చర్చకు అనుమతినివ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమయంలో ఛైర్మన్ జోక్యం చేసుకొని వాయిదా తీర్మానాన్ని తిరస్కరించానని, ప్రభుత్వం సిద్ధంగా ఉంటే బుధవారం చర్చకు అనుమతి ఇస్తానని చెప్పారు. ఈ సమయంలో మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. బిఎసి ఎజెండాపై చర్చ అవసరం లేదా? అని అడిగారు. ఛైర్మన్ మాట్లాడుతూ.. వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన తరువాత ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన అవసరం లేదన్నారు. ఈ సమయంలో మంత్రులు, ప్రతిపక్ష నేత మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది.

న్యాయవాదుల సమస్యలు పరిష్కరించండి

- ఐలు కరపత్రాల పంపిణీ

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

న్యాయవాదుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఆలిండియా లాయర్స్ యూనియన్ ఆధ్వర్యాన మంగళవారం కోర్టు ప్రాంగణాల్లో కరపత్రాల పంపిణీ చేపట్టినట్లు యూనియన్ కృష్ణా జిల్లా కార్యదర్శి సంపర దుర్గా శ్రీనివాసరావు తెలిపారు. కూటమి నేతలు గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రూ.100 కోట్లతో న్యాయవాదుల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేయాలని, న్యాయవాదుల డెత్ బెనిఫిట్స్‌ను రూ.10 లక్షలకు పెంచి గతంలో చనిపోయిన 1,173 మంది న్యాయవాదుల కుటుంబాలకు తక్షణం చెల్లించాలని డిమాండ్ చేశారు. జూనియర్ న్యాయవాదులకు న్యాయమిత్ర పథకం కింద ఇచ్చే రూ.5 వేల స్టైఫండ్‌ను రూ.10 వేలకు పెంచాలన్నారు. జూనియర్ న్యాయవాదులకు ల్యాప్‌టాప్, ప్రింటర్లను వడ్డీలేని రుణాలతో అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఐలు జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షులు, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కృష్ణానదిపై అక్రమ ప్రాజెక్టులు

- ఆలోచనా పరుల వేదిక

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

కృష్ణానదిపై కర్ణాటక, తెలంగాణ అక్రమంగా ప్రాజెక్టులు కడుతున్నాయని, రాష్ట్రంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం వాటిని వ్యతిరేకిస్తూ శాసనసభలో తీర్మానం చేసి కేంద్రానికి పంపాలని ఆలోచనా పరుల వేదిక కోరింది. మంగళవారం గాంధీనగర్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆలోచనా పరుల వేదిక నాయకులు ఎబి వెంకటేశ్వరరావు, అక్కినేని భవానీప్రసాద్, తుంగా లక్ష్మీనారాయణ మాట్లాడారు. కర్ణాటక, తెలంగాణ తీసుకున్న నిర్ణయాలు ఆంధ్రప్రదేశ్ నీటి హక్కులకు శరాఘాతంగా మారాయని తెలిపారు. అమల్లో ఉన్న బచావత్ ట్రిబ్యునల్ తీర్పును ఉల్లంఘించి కృష్ణా జలాలను వాడుకునేందుకు దూకుడుగా వ్యవహరిస్తున్నాయని పేర్కొన్నారు. దీనివల్ల రాష్ట్రానికి శాశ్వతంగా కోలుకోలేని దెబ్బ తగులుతుందన్నారు. ఆల్మట్టి డ్యామ్ నుండి కర్ణాటక 173 టిఎంసిల నికర జలాలు వినియోగించుకునే హక్కును బచావత్ ట్రిబ్యునల్ కల్పించిందన్నారు. దీనికి 519.60 మీటర్ల ఎత్తుతో ఆల్మట్టి డ్యామ్‌కు అనుమతి కూడా ఇచ్చిందని వివరించారు. అయితే 524.25 మీటర్ల ఎత్తుతో నిర్మించారని, ఇప్పుడు గరిష్టస్థాయిలో నీటిని నిల్వచేసి 303 టిఎంసిలు వాడుకునేందుకు వీలుగా రూ.70 వేలకోట్లతో భూసేకరణ, కాలువల నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టడానికి కర్ణాటక మంత్రివర్గం ఈ నెల 16న ప్రత్యేకంగా సమావేశమై నిర్ణయించిందని వివరించారు. 372 టిఎంసిల వినియోగ సామర్థ్యంతో 16 ప్రాజెక్టుల నిర్మాణానికి సమగ్ర అధ్యయన నివేదికలను వెంటనే రూపొందించాలని తెలంగాణ ప్రభుత్వం జిఓ కూడా ఇచ్చిందని వివరించారు. పూర్వపు మహబూబ్‌నగర్, నల్గొండ, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో 11.30 లక్షల ఎకరాల ఆయకట్టును స్థిరీకరించాలన్న లక్ష్యాన్ని పెట్టుకున్నారని తెలిపారు. మరో 12.3 టిఎంసిలను జూరాల నుండి గండీడ్ లిఫ్టుకు తరలించాలని నిర్ణయించారన్నారు. ఇవన్నీ అమలైతే రాష్ట్రానికి నీరు అందడం కష్టమవుతుందని పేర్కొన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించి వెంటనే నిర్ణయం తీసుకోవాలని కోరారు.

మా బతుకులు బుగ్గిపాలు చేయొద్దు

బల్క్ డ్రగ్ పార్కుకు వ్యతిరేకంగా అర్ధనగ్న ప్రదర్శన

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)

తమ జీవన విధానాన్ని, ఉపాధిని దెబ్బతీసే బల్క్‌డ్రగ్ పార్క్‌ను నిలుపుదల చేసే వరకు పోరాటం ఆగదని మత్స్యకారులు హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలంలోని మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు మంగళవారానికి పదో రోజుకు చేరుకున్నాయి. ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన మత్స్యకారులు కూడా గ్రామానికి చేరుకుని ఆందోళనలో పాల్గొన్నారు. బల్క్‌డ్రగ్ పార్క్ ఏర్పాటును నిరసిస్తూ అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ.. బల్క్‌డ్రగ్ పార్కు ఏర్పాటు చేసి తమ బతుకులను బుగ్గిపాలు చేయొద్దన్నారు. సముద్రమే తమ జీవనాధారమని, చేపల వేట తప్ప, మరో వృత్తి తమకు తెలియదని, సముద్రాన్ని తమ నుండి దూరం చేయొద్దన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలుపుతున్న మత్స్యకారులు

తమ నెత్తిన బల్క్ డ్రగ్ కుంపటి ఏర్పాటుచేసి జీవితాలను నాశనం చేయాలనుకోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. అభివృద్ధి పేరిట కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ జీవితాలను నాశనం చేయాలని చూస్తే తీవ్రంగా ప్రతిఘటిస్తామని హెచ్చరించారు. ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా తమ జీవితాలు నాశనమయ్యాయని వాపోయారు. కార్యక్రమంలో ఎంపిటిసి సభ్యులు పిక్కి సత్తియ్య, మత్స్యకార నాయకులు మైలపల్లి మహేష్‌బాబు, బి.బాబ్జీ, పి.తాతీలు, ఎరిపిల్లి నాగేష్, బి.శ్రీను, బి.బాబ్జీ తదితరులు పాల్గొన్నారు.



వైజాగ్ డిక్లరేషన్‌ను ఆవిష్కరిస్తున్న ఉన్నతాధికారులు

డిజిటల్ సాధికారత

- ఐటి పార్కులు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక జోన్లు
- ఐటి, ఇన్నోవేషన్ హబ్‌గా విశాఖ
- ఇ - గవర్నెన్స్ జాతీయ సదస్సు ముగింపులో 'డిక్లరేషన్'

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

డిజిటల్ టెక్నాలజీతో సాధికారత ఏర్పడి దేశ ప్రగతి, రాష్ట్రాల పురోగతి సాధ్యపడుతుందని విశాఖలో తలపెట్టిన 28వ జాతీయ ఇ - గవర్నెన్స్ సదస్సు ఉద్ఘాటించింది. రెండు రోజులపాటు సాగిన ఈ సదస్సు మంగళవారంతో ముగిసింది. రెండో రోజు వైజాగ్ డిక్లరేషన్‌ను వేదికపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు విడుదల చేశారు. 'వికసిత్ భారత్-2047' జాతీయ దృష్టిని ఆకర్షించడమే కాకుండా 'కనీస ప్రభుత్వం-గరిష్ట పాలన' అనే మార్గదర్శక సూత్రాన్ని నొక్కిచెబుతోందని ఈ సదస్సు పేర్కొంది. విశాఖలోని నోవాటల్ హోటల్‌లో ఈ రెండు రోజుల పాటు ఆరు ప్రత్యేక సెషన్‌లో వివిధ అంశాలపై ప్లీనరీలు జరిగాయి. పరిపాలనా సంస్కరణలు, ప్రజా ఫిర్యాదుల విభాగం (డిఎపిఆర్‌జి), ప్రజా ఫిర్యాదులు, పెన్షన్ల మంత్రిత్వ శాఖ, ఎలక్ట్రానిక్స్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఎంఇఐటివై) ఆధ్వర్యాన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో ఈ సదస్సు సాగింది. విశాఖపట్నాన్ని ఐటి, ఇన్నోవేషన్ హబ్‌గా మార్చే దిశగా డిజిటల్ మౌలిక సదుపాయాలతో పెట్టుబడులు పెట్టడం, డిజిటల్ నైపుణ్యాలను మెరుగుపరచడం దిశగా ఐటి పార్కులు, స్టార్టప్‌ల కోసం ప్రత్యేక జోన్‌లు ఏర్పాటు కావాల్సిన అవసరాన్ని డిక్లరేషన్ పేర్కొంది.

పౌరసేవల్లో కీలక పాత్ర

పౌరసేవల విషయంలో డిజిటల్ టెక్నాలజీ విస్తరణ కీలకపాత్ర పోషిస్తోందని డిక్లరేషన్‌లో ప్రభుత్వ పెద్దలు పేర్కొన్నారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ), బ్లాక్ చెయిన్ టెక్నాలజీ, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఒటి), డేటా అనలిటిక్స్, రోబోస్ వంటి సాంకేతికత ప్రపంచంలో అభివృద్ధి చెందుతున్నాయన్నారు. సైబర్ టెక్నాలజీలో సార్వభౌమత్వం సాధించే దిశగా సేవల వినియోగంపై డిక్లరేషన్‌లో వివరించారు. సమాజంలో త్వరితగతిన పౌర సదుపాయాల కల్పనకు డిజిటల్ సాధికారత సాధించాలని పేర్కొన్నారు. దేశంలో గామీణ ప్రాంతాల్లో ఇ-సేవల విస్తరణ పలుచోట్ల జరుగుతున్నట్లు డిక్లరేషన్‌లో వివరించారు. పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పౌరసమాజం మధ్య సహకారం బలోపేతానికి డిజిటల్ ఎంపవర్‌మెంట్ తోడ్పడుతుందన్నారు. వైజాగ్ డిక్లరేషన్ విడుదల చేసిన వారిలో ఉన్నతాధికారులు కాటమనేని భాస్కర్, ఎస్ఎన్.త్రిపాఠి, వి.శ్రీనివాస్, పునీత్ యాదవ్, సరితా చౌహాన్, తదితరులు ఉన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేయాలి

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఉన్నత విద్య అభ్యసిస్తున్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని పిడిఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపిమూర్తి కోరారు. శాసనమండలిలో ప్రత్యేక ప్రస్తావన ద్వారా ఛైర్మన్ మోషేనురాజు దృష్టికి మంగళవారం తీసుకొచ్చారు. సకాలంలో ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదలకాకపోవడంతో విద్యార్థులు చాలా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కళాశాలల యాజమాన్యాలు కూడా కళాశాలలను నిర్వహించడం కష్టమవుతున్న పరిస్థితులు ఉన్నాయని వివరించారు. కొన్నేళ్లుగా నిధులు విడుదల కావడం లేదని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, కళాశాలల నిర్వహణను దృష్టిలో పెట్టుకుని నిధులను వెంటనే విడుదల చేయాలని కోరారు.

ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ చట్టం

- ఎపిఎజిఎస్ డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఆదివాసీలకు 100 శాతం రిజర్వేషన్ చట్టం అమలు చేయాలని, ఇందుకు సంబంధించి అసెంబ్లీలో తీర్మానం చేయాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 25న 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎపి ఆదివాసీ గిరిజన సంఘం (ఎపిఎజిఎస్) రాష్ట్ర కమిటీ తెలిపింది. ఏజెన్సీ ప్రాంతాలకు ప్రత్యేక డిఎస్‌సిని ప్రకటించాలని, మెగా డిఎస్‌సిలో ఏజెన్సీ పోస్టులను మినహాయించాలని సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎ అశోక్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 5వ షెడ్యూల్డ్‌లో ఉన్న ఏజెన్సీ ప్రాంతం హక్కుల పరిరక్షణ కోసం ప్రభుత్వం అసెంబ్లీలో చర్చించాలన్నారు.



మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను నిరసిస్తూ ర్యాలీ ప్రారంభం సందర్భంగా నినదిస్తున్న ప్రజాసంఘాలు, సిపిఎం నేతలు

పిపిపి విధానానికి వ్యతిరేకంగా బైక్ ర్యాలీ

ప్రజాశక్తి - భీమవరం (పశ్చిమగోదావరి జిల్లా)

పేద విద్యార్థులకు వైద్య రంగాన్ని మరింత ఖరీదుగా మార్చే పిపిపి విధానాన్ని తక్షణం విరమించుకోవాలని వామపక్ష ప్రజాసంఘాల నేతలు డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీలను ప్రయివేటీకరించడాన్ని వ్యతిరేకిస్తూ మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా భీమవరంలోని అంబేద్కర్ చౌక్ నుండి పాలకొల్లు మండలం దగ్గులూరులో నిర్మాణ దశలో ఉన్న మెడికల్ కాలేజీ వరకూ ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన కార్యక్రమానికి సిపిఎం జిల్లా కార్యదర్శి జెఎన్‌వి గోపాలన్ అధ్యక్షత వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న పిపిపి విధానాన్ని తక్షణం విరమించుకోకపోతే ఉద్యమిస్తామని హెచ్చరించారు. సిపిఐ జిల్లా నేత చెల్లబోయిన రంగారావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు పి రామ్మోహన్‌రావు , ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర నాయకులు లంకా కృష్ణమూర్తి, ఎంసిపిఐ (యు) నాయకులు కె.మహంకాళి, దళిత ఐక్యవేదిక రాష్ట్ర అధ్యక్షులు గంటా సుందర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి శ్రీవారి బ్రహ్మోత్సవాలు

ప్రజాశక్తి - తిరుమల :
శ్రీవారి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ చేశారు. అక్టోబరు 2 వరకు ఈ ఉత్సవాలు నిర్వహించనున్నారు. తిరుమలను సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. బ్రహ్మోత్సవాల ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నెల 24న పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ప్రివిలేజ్ (వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, వికలాంగులు) దర్శనాలను టిటిడి రద్దు చేసింది. 29 రాష్ట్రాల నుంచి 229 కళాబృందాలు సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వనున్నాయి. కొండపైన ప్రతి నాలుగు నిమిషాలకు ఒక ప్రభుత్వ బస్సు ఉంటుంది. మూడు వేల సిసి కెమెరాలతో నిఘా, రెండువేల మంది సెక్యూరిటీ, 4,700 మంది పోలీసులు, 450 మంది సీనియర్ అధికారులతో భద్రతను ఏర్పాటు చేశారు. పారిశుధ్య నిర్వహణకు ప్రత్యేక యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చారు.

భార్యాభర్తల అనుమానాస్పద మృతి

ప్రజాశక్తి - తాడిపత్రి రూరల్
భార్యాభర్తలు అనుమానాస్పదంగా మృతి చెందిన సంఘటన అనంతపురం జిల్లాలో చోటుచేసుకుంది. రూరల్ పోలీసుల కథనం ప్రకారం... తాడిపత్రి మండల పరిధిలోని సజ్జలదిన్నె గ్రామానికి చెందిన రామాంజనేయులు (34)కు నార్పల మండలం కేసేపల్లి గ్రామానికి చెందిన జ్యోత్స్న (29)కు 2015లో వివాహమైంది. రామాంజనేయులు గతంలో తాడిపత్రి పట్టణంలో ఓ ఎరువుల దుకాణంలో పని చేస్తూ ఉండేవారు. ప్రస్తుతం ట్రాక్టర్ డ్రైవర్‌గా వెళ్తూ వ్యవసాయ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఆయన తల్లిదండ్రులు అదే గ్రామంలో వేరే ఇంట్లో నివసిస్తున్నారు. దసరా సెలవులు కావడంతో రామాంజనేయులు దంపతులిద్దరూ పిల్లల్ని తీసుకుని భార్య పుట్టినిల్లు కేసేపల్లికి రెండు రోజుల క్రితం వెళ్లారు. పిల్లల్ని అక్కడే వదలి దంపతులిద్దరూ సోమవారం స్వగ్రామానికి వచ్చారు. మంగళవారం ఉదయం అమ్మవారి ఇంట్లో ఉన్న పిల్లలిద్దరూ ఇంటికి వచ్చారు. తలుపులు మూసి ఉండడంతో చుట్టుపక్కల వారి సాయంతో లోపలికి చూశారు. అప్పటికే రామాంజనేయులు ఉరికి వేలాడుతూ కన్పించారు. అదే ఇంట్లో ఓ మంచంపై జ్యోష్ణ విగతజీవిగా పడి ఉన్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి వివరాలు సేకరించారు. కొంతకాలం నుంచి భార్యాభర్తల నడుమ మనస్పర్థలున్నాయని, ఈ క్రమంలో సోమవారం రాత్రి ఒకరి తర్వాత ఒకరు ఆత్మహత్య చేసుకుని ఉండొచ్చని పోలీసులు ప్రాథమికంగా అంచనాకు వచ్చారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది. రామాంజనేయులు కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అడవి బిడ్డలపై జులుం

- నేవీ ఆయుధ డిపో వద్దంటూ గిరిజనులు చేపట్టిన ర్యాలీని అడ్డుకున్న పోలీసులు, తీవ్ర ఉద్రిక్తత
- అక్కడే బైఠాయించి ఆదివాసుల నిరసన
- కమీషన్ల కోసం ఎంపి, ఎంఎల్ఎ మమ్మల్ని తాకట్టు పెడుతున్నారంటూ ఆగ్రహం


ర్యాలీగా వెళ్తున్న గిరిజనులను అడ్డుకుంటున్న పోలీసులు

ప్రజాశక్తి- ఏలూరు ప్రతినిధి, జీలుగుమిల్లి
'నేవీ ఆయుధ డిపో మాకొద్దు' అంటూ కదంతొక్కిన గిరిజనులపై పోలీసులు విరుచుకుపడడంతో ఏలూరు జిల్లా జీలుగుమిల్లి మండలం మడకంవారిగూడెంలో మంగళవారం తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. మడకంవారిగూడెం నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకూ శాంతియుతంగా గిరిజనులు చేపట్టిన ర్యాలీని పెద్ద ఎత్తున మోహరించిన పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. గిరిజన మహిళలను, సిపిఎం, ప్రజాసంఘాల నాయకులను పోలీసులు బలవంతంగా మెడలు పట్టుకుని పక్కకు తోసేశారు. అయినా, పోలీసుల వలయాన్ని ఛేదించుకుని గిరిజనులు ముందుకుసాగారు. వారిని గ్రామశివార్లలో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, వందల సంఖ్యలో గ్రామస్తులు అక్కడే బైఠాయించి నేవీ ఆయుధ డిపోకు వ్యతిరేకంగా నినదించారు. కమీషన్ల కోసం ఎంపి, ఎంఎల్ఎ మమ్మల్ని తాకట్టు పెడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జీలుగుమిల్లి మండలం వంకావారిగూడెం పంచాయతీ పరిధిలోని మడకంవారిగూడెం, దాట్లవారిగూడెం, వంకావారిగూడెం, రమణక్కపేట, కొత్తసీమలవారిగూడెం గ్రామాల పరిధిలో నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు ప్రభుత్వం పూనుకుంది. 1,166 ఎకరాలు సేకరించడంతోపాటు ఆయా గ్రామాలను ఖాళీ చేయించేందుకు సిద్ధమైంది. గతంలో మూడుసార్లు గ్రామసభలో వ్యతిరేకంగా తీర్మానించినా మళ్లీ నేవీ ఆయుధ డిపో ఏర్పాటుకు సిద్ధం కావడాన్ని ఆయా గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. దీంతో, ఈ ఐదు గ్రామాల ప్రజలు మడకంవారిగూడెం నుంచి తహశీల్దార్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు వినతిపత్రం ఇచ్చేందుకు శాంతియుత ర్యాలీకి పిలుపునిచ్చారు. వారికి సిపిఎం, ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు. పోలీసులు 30 యాక్ట్ అమలు చేసి తీవ్ర నిర్బంధం ప్రయోగించారు. పోలీసుల కంటపడకుండా వందలాది మంది గిరిజనులు మడకంవారిగూడెం చేరుకున్నారు. అక్కడి నుంచి వారంతా ర్యాలీగా బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో, గిరిజనులకు, పోలీసులకు మధ్య పెద్ద ఎత్తున తోపులాట చోటుచేసుకుంది. గిరిజనులకు మద్దతుగా నిలిచిన సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవిని పోలీసులు చుట్టుముట్టి పక్కకు తోసేశారు. గిరిజన నాయకులు తెల్లం రామకృష్ణ, ధర్మాల రమేష్, తెల్లం దుర్గారావు, మడకం వెంకటేశ్వరరావు, ఎపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పిల్లి రామకృష్ణతోపాటు పెద్ద ఎత్తున ర్యాలీలో పాల్గొన్న గిరిజన మహిళలపై పోలీసులు విరుచుకుపడి ముందుకు సాగకుండా అడ్డుకున్నారు. దీంతో, వారంతా అక్కడే రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఎ.రవి మాట్లాడుతూ నేవీ ఆయుధ డిపో ఏర్పాటైతే ఏజెన్సీ ప్రాంతం కనుమరుగవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్ట్ పేరుతో పలు గిరిజన గ్రామాలను ఇప్పటికే ఖాళీ చేయించారన్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు ఇప్పటికీ న్యాయం జరగలేదని తెలిపారు. ఆయుధ డిపో పెట్టుకోవాలంటే ఎంఎల్ఎ క్యాంపు కార్యాలయం పక్కన చాలా భూమి ఖాళీగా ఉందని, అక్కడ పెట్టుకోవచ్చని సూచించారు. ఆయుధ డిపోపై వెనక్కి తగ్గకపోతే ఉద్యమం ఆగదని, త్వరలో భారీ బహిరంగ సభ నిర్వహించడంతోపాటు ఏజెన్సీలోని అన్ని మండలాలకూ ఉద్యమాన్ని విస్తరిస్తామని హెచ్చరించారు.

శ్రీశైలం జలాశయానికి వరద ఉధృతి

- 10 గేట్ల ద్వారా నీటి విడుదల

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు
శ్రీశైలం జలాశయానికి ఎగువ ప్రాంతాల నుండి నీటి ప్రవాహం వరద ఉధృతి కొనసాగుతోంది. మంగళవారం సాయంత్రం ఆరుగంటల సమయానికి పది గేట్లను 14 అడుగుల మేర ఎత్తి దిగువ నాగార్జున సాగర్‌కు 3,49,620 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ జూరాల ద్వారా 3,40,271 క్యూసెక్కులు, సుంకేసుల నుండి 17,784 క్యూసెక్కులు, హంద్రీ ద్వారా 250 క్యూసెక్కులతో 3,58,305 క్యూసెక్కుల నీరు చేరుతోంది. అదే సమయానికి జలాశయ నీటిమట్టం 882.90 అడుగులుగా ఉంది. నీటి నిల్వ సామర్థ్యం 203.8907 టిఎంసిలుగా నమోదయింది. శ్రీశైలం బ్యాక్ వాటర్ నుండి పోతిరెడ్డిపాడుకు 5,000, మహాత్మా గాంధీ కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్‌కు 1,600, హంద్రీనీవా సుజల స్రవంతికి 2,418 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. గడిచిన 24 గంటల్లో తెలంగాణ పరిధిలోని ఎడమ గట్టు భూగర్భ జల విద్యుత్ కేంద్రంలో 16.706 మిలియన్ యూనిట్ల విద్యుత్ కోసం 39,280 క్యూసెక్కుల నీటిని వినియోగించారు. కుడిగట్టు జల విద్యుత్ కేంద్రంలో 15.163 మిలియన్ యూనిట్ల విద్యుత్ చేస్తూ నాగార్జున సాగర్‌కు 65,482 క్యూసెక్కులతో పాటు మొత్తం జలాశయం నుంచి 4,15,102 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు.

గుండెపోటుతో కండక్టర్ మృతి

ప్రజాశక్తి-శృంగవరపుకోట (విజయనగరం జిల్లా)
విధి నిర్వహణలో ఉండగా గుండెపోటుతో ఆర్‌టిసి కండక్టర్ మృతి చెందిన ఘటన విశాఖ జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. కండక్టర్ కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. విజయనగరం జిల్లా శృంగవరపుకోట ఆర్‌టిసి డిపోకు చెందిన కండక్టర్ కాశి ఈశ్వరరావు (52) పట్టణంలోని శ్రీనివాస కాలనీలో కుటుంబంతో నివాసముంటున్నారు. మంగళవారం విశాఖపట్నం నుండి కంచమండ వెళుతున్న ఆర్‌టిసి బస్సులో ఆయన విధులు నిర్వహిస్తున్నారు. విశాఖ సరిపల్లి వద్దకు వచ్చేసరికి ఈశ్వరరావుకు గుండెపోటు వచ్చి కండక్టర్ సీటులోనే కుప్పకూలిపోయారు. అప్రమత్తమైన డ్రైవర్ అదే బస్సులో పెందుర్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అప్పటికే ఈశ్వరరావు మృతి చెందినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు.

13 గంటల పని విధానం అన్యాయం

- శాసనసభ, మండలి తీర్మానాలపై సిపిఎం ఖండన
- బిల్లులను వెంటనే ఉపసంహరించాలి
- వైసిపి కూడా వ్యతిరేకంగా ఓటు వేయలేదు

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో
కార్మికుల పని గంటలను 8 నుంచి 13కు పెంచుతూ ప్రవేశపెట్టిన బిల్లుకు శాసనసభ, మండలి ఆమోదించడంపై సిపిఎం రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈ మేరకు రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బిల్లును తక్షణమే ఉపసంహరించాలని కోరారు. గత 13 ఏళ్లుగా కనీస వేతనాలను ప్రభుత్వం సవరించలేదని, వెంటనే వేతనాలను ప్రస్తుత ధరలకు అనుగుణంగా సవరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఎన్‌డిఎ ప్రభుత్వం పెట్టుబడిదారులకు అనుకూలంగా పనిచేస్తూ కార్మికుల శ్రమను దోచేందుకు పని గంటలు పెంచిందని తెలిపారు. స్ప్రెడ్ ఓవర్‌టైం పెంపు పేరుతో 13 గంటల పని విధానానికి జూన్ 4న ఎన్‌డిఎ ప్రభుత్వ మంత్రివర్గం ఆమోదించిందని తెలిపారు. కార్మికులకు నష్టదాయకంగా పని గంటలను, పని విస్తృతిని పెంచడం, ఓవర్‌టైం కాలాన్ని రెట్టింపు చేయడం, మహిళలతో రాత్రిపూట పని వంటివి పెట్టుబడిదారులకు ప్రయోజనం కలిగించేవని తెలిపారు. మహిళలకు కల్పించాల్సిన సౌకర్యాలను, రక్షణను యాజమాన్యం కల్పించలేదని పేర్కొన్నారు. వారిపై ప్రభుత్వం ఎటువంటి చర్యలూ తీసుకోవడం లేదని, ఇప్పుడు మహిళలతో రాత్రి పూట కూడా పనిచేయించడం అంటే యాజమాన్య దోపిడీకి రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించడమేనని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పని గంటల పెంపు నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. వైసిపి సభ్యులు అసెంబ్లీకి హాజరుకావడం లేదని, ప్రతిపక్ష పాత్ర నిర్వహించి ఇలాంటి చట్టాలను వ్యతిరేకించకుండా పాలక పార్టీకి పరోక్షంగా సహకరించడం సరైంది కాదని తెలిపారు. కౌన్సిల్లో కూడా వైసిపి వ్యతిరేకిస్తూనే వాకౌట్ చేసిందని, పని గంటల పెంపును వ్యతిరేకిస్తూ ఓటు వేయలేదని తెలిపారు. పిడిఎఫ్ ఎమ్మెల్సీ గోపిమూర్తి ఒక్కరే దీనికి వ్యతిరేకంగా నిలబడ్డారన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

గుంటూరులో రేపు యుటిఎఫ్ రణభేరి సభ

ప్రజాశక్తి-గుంటూరు
ఉపాధ్యాయుల సమస్యలపై గుంటూరు వెంకటేశ్వరా విజ్ఞాన మందిరం ప్రాంగణంలో గురువారం జరిగే రణభేరి సభను జయప్రదం చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎన్ వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్ ప్రసాద్ పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్‌ను మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావుతో కలిసి వారు మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వ ఏడాదిన్నర పాలనలో ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. బదిలీల సమయంలో ఒక్కసారి తప్ప ఉపాధ్యాయ సంఘాలతో మంత్రి సమావేశం నిర్వహించడంలేదని, గత ప్రభుత్వ విధానాలనే ఈ ప్రభుత్వం అనుసరిస్తోందని పేర్కొన్నారు. ముఖ్యంగా బోధనేతర కార్యక్రమాల నుండి ఉపాధ్యాయులను పూర్తిగా మినహాయించాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వం పెట్టిన 17 రకాల యాప్‌లు రద్దు చేస్తామని నేటి ప్రభుత్వం హామీ ఇచ్చి... ఇప్పుడు వాటన్నింటినీ ఒకే యాప్ ద్వారా అమలు చేస్తోందని తెలిపారు. ఈ విద్యా సంవత్సరంలో యోగాంధ్ర, మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లు తదితర కార్యక్రమాలను ఫొటోలు, సమాచారం అప్‌లోడ్‌కు ప్రాధాన్యమిస్తూ నిర్వహించడం వల్ల ఉపాధ్యాయులు బోధనకు దూరమవుతున్నారని చెప్పారు. ఉపాధ్యాయులను బోధనేతర పనుల నుండి తక్షణమే పూర్తిగా మినహాయించాలని, పిఆర్‌సి బకాయిలు, డిఎ బకాయిలు విడుదల చేయాలని, తక్షణమే 12వ పిఆర్‌సి కమిషన్‌ను నియమించాలని తదితర డిమాండ్లతో జరిగే సభలో ఉపాధ్యాయులు వేలాదిగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో యుటిఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం హనుమంతరావు, రాష్ట్ర ఆడిట్ కమిటీ కన్వీనర్ మల్లేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు రాజశేఖర్‌రావు, ఎం కళాధర్ పాల్గొన్నారు.

నిర్వాసితులకు న్యాయం చేయండి

- మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌పై ప్రజాభిప్రాయ సేకరణ తగదు
- వాస్తవాలకు దూరంగా ఇఐఎ రిపోర్టు : సిపిఎం


జాయింట్ చీఫ్ ఇంజనీర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి - నక్కపల్లి (అనకాపల్లి)
నిర్వాసితులకు పూర్తి పరిహారం, పునరావాసం, జీవనోపాధికి హామీ ఇవ్వకుండా ఆర్సెలార్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ ఏర్పాటు కోసం ఈ నెల 27న నక్కపల్లి మండలం పాటిమీద సమీపంలో తలపెట్టిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణను రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు విశాఖపట్నంలో ప్రాంతీయ కాలుష్య నియంత్రణ మండలి కార్యాలయంలో కాలుష్య నియంత్రణ మండలి జాయింట్ చీఫ్ ఇంజనీర్ సుదర్శన్‌కు సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎం అప్పలరాజు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... నక్కపల్లి మండలంలో బుచ్చిరాజుపేట, చందనాడ, డిఎల్.పురం, రాజయ్యపేట, వేంపాడు రెవెన్యూ గ్రామాల్లో చేపట్టిన భూసేకరణలో భూములు, ఇళ్లు కోల్పోయిన రైతులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదారులు, పేదలకు ఇప్పటికీ పూర్తిస్థాయిలో పరిహారం చెల్లించలేదని తెలిపారు. డి.పట్టా భూముల్లోని చెట్లకు, సాగు భూములకు, అందులోని చెట్లకు పరిహారం ఇంకా జమకాలేదన్నారు. బాధితులకు నష్టపరిహారం ఇవ్వకుండా మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు 2020 ఎకరాలు కేటాయించి, పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. నిర్వాసితుల ఉపాధికి భరోసా ఇవ్వకుండా జీవనోపాధిని దెబ్బతీయడం అంటే బతికే హక్కును హరించడమే అవుతుందన్నారు. మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌ను రెండు దశలలో ఏర్పాటు చేసి, 17.8 మిలియన్ టన్నుల ఇంటిగ్రేటెడ్ స్టీల్‌ప్లాంట్ ఆపరేషన్ దశలో అతి తక్కువగా 800 మందికి మాత్రమే ఉపాధి కల్పిస్తామని ఇఐఎ నివేదికలో పేర్కొన్నారని, అందులోనూ నిర్వాసితులు, స్థానికుల్లో ఎంతమందికి ఉపాధి కల్పిస్తారనేది చెప్పలేదన్నారు. ఆ స్టీల్‌ప్లాంట్‌లో ఉపాధి పొందే వారికంటే నిర్వాసితులు, బతుకుదెరువు కోల్పోయిన వారే ఇక్కడ వేల సంఖ్యలో ఉన్నారని గుర్తుచేశారు. స్టీల్ ఉత్పత్తి ప్రక్రియలో విడుదలయ్యే రసాయన వ్యర్థాలు, గాలి కాలుష్యం పరిమాణం వంటి అంశాలేవీ పేర్కొనలేదని, పర్యావరణ పరిరక్షణకు తీసుకోబోయే నిర్దిష్ట ప్రమాణాలు వంటివి తెలపలేదని, ఇఐఎ రిపోర్టులో పేర్కొన్న అంశాలన్నీ వాస్తవికతకు దూరంగా, తప్పుల తడకగా ఉన్నాయని స్పష్టం చేశారు. పర్యావరణ అనుమతులకు సంబంధించిన విషయాలపై గ్రామ సభలు నిర్వహించకుండా, సంప్రదింపుల కమిటీలు ఏర్పాటు చేయకుండా ఏకపక్షంగా వ్యవహరించడం, 2013 భూ సేకరణ చట్టాన్ని తుంగలోకి తొక్కడమే అవుతుందన్నారు. మిట్టల్ క్యాపిటివ్ పోర్టుకు 2.9 కిలోమీటర్ల మేర తీరంలో భూములు కేటాయించడం దేశ భద్రతరీత్యా ప్రమాదకరమన్నారు. క్యాపిటివ్ పోర్టుకు సమీపంలోని ఎన్ఎఒబిలో దేశ భద్రతకు సంబంధించిన కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిపారు. ఇంకా అనేక కాలుష్యకర పరిశ్రమలు వస్తున్నట్లు కూడా ప్రకటనలు వస్తున్నాయని, అటువంటి సున్నిత, రక్షణ ప్రాంతాలను ప్రయివేటు సంస్థలకు కేటాయించడం చట్టరీత్యా విరుద్ధమన్నారు.


కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న నిర్వాసితులు

న్యాయం చేయాల్సిందే

- పోలవరం ఎడమ కాలువ నిర్వాసితుల ధర్నా

ప్రజాశక్తి - కాకినాడ
పోలవరం ఎడమ కాలువ నిర్మాణంలో ఇళ్లు కోల్పోయిన తమకు న్యాయం చేయాలని కోరుతూ కాకినాడ కలెక్టరేట్ వద్ద నిర్వాసితులు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ పోలవరం ఎడమ కాల్వ వల్ల తుని మండలం కుమ్మరిలోవ కాలనీలో సుమారు 300 మందికి పైగా నిర్వాసితులుగా మారారని తెలిపారు. వీరిలో సుమారు 22 కుటుంబాలకు నేటికీ నష్టపరిహారం అందలేదన్నారు. ఈ విషయంపై పలుమార్లు కలెక్టర్ కార్యాలయంలో అర్జీలు అందించినా న్యాయం చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం అందించే నష్టపరిహారాన్ని తక్షణమే ఇప్పించాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో కుమ్మరిలోవ నిర్వాసితులు కర్రి వెంకటేశ్వరరావు, దుంగల నాగేశ్వరరావు, గేదెల కృష్ణమూర్తి, సింగంపల్లి వెంకయ్యనాయుడు, తమరాన పైడినాయుడు, పైలా హేమని, అరుగుల సుధారాణి, రంభ అనంతలక్ష్మి పాల్గొన్నారు.

బంగాళాఖాతంలో అల్పపీడనం

- రేపు మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ఉత్తర ఒడిశా, వాయువ్య బంగాళాఖాతంలో అల్పపీడనం కేంద్రీకృతమై ఉందని, దీని అనుబంధంగా ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ తెలిపారు. ఉపరితల ఆవర్తనం నుంచి మరో ద్రోణి విస్తరించి ఉందని వెల్లడించారు. గురువారం నాటికి ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇది పశ్చిమ-వాయువ్య దిశగా కదులుతూ శుక్రవారం నాటికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాల్లో వాయువ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఇది శనివారం నాటికి దక్షిణ ఒడిశా, ఉత్తరాంధ్ర తీరాలను దాటే అవకాశం ఉందన్నారు. వీటి ప్రభావంతో ఆదివారం వరకూ అక్కడక్కడ పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. శుక్ర, శనివారాల్లో కోస్తాలో పలుచోట్ల అతి భారీ వర్షాలు, రాయలసీమలో అక్కడక్కడ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని తెలిపారు. ఇప్పటి నుంచే రైతులు వ్యవసాయ పనుల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. గురువారం నుంచి ఆదివారం వరకూ మత్స్యకారులు సముద్రంలో వేటకు వెళ్లరాదన్నారు. బుధవారం నాడు శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో కొన్నిచోట్ల పిడుగులతో కూడిన మోస్తరు నుంచి భారీ వర్షాలు, మిగతా జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు పడే అవకాశం ఉందన్నారు.

ప్రభుత్వ సంస్థలు ప్రైవేటు పరం

- అందుకే ఆర్‌టిసిలో విద్యుత్ బస్సుల పాలసీ
- సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నరసింగరావు


విజయవాడలో ధర్నా చేస్తున్న ఆర్‌టిసి కార్మికులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో
ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ఈజ్ ఆఫ్ డూయింగ్ పేరుతో ప్రైవేటు పరం చేయాలని ప్రభుత్వం ప్రయత్నిస్తోందని సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిహెచ్ నరసింగరావు పేర్కొన్నారు. ఆర్‌టిసిలో విద్యుత్ బస్సుల పథకం ఈ క్రమంలో తీసుకొచ్చిందేనని చెప్పారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యాన విజయవాడలోని ధర్నా చౌక్‌లో మంగళవారం నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింగరావు మాట్లాడుతూ.. రాష్ట్రానికి తల మానికమైన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అప్పనంగా ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం సిగ్గు చేటన్నారు. ప్రభుత్వ ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలకు ఐక్య ఉద్యమంతోనే అడ్డుకట్ట వేయగలమని తెలిపారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం అయ్యప రెడ్డి మాట్లాడుతూ.. ఆర్‌టిసి యాజమాన్యం ఉద్యోగ భద్రతకు తోడ్పడే సర్క్యులర్ 1ని అమలుపై అధికారులకు స్పష్టత ఇవ్వని కారణంగా దారుణమైన పనిష్మెంట్లు, అనవసర ఇంక్రిమెంట్లలో కోతలు విధిస్తున్నారని తెలిపారు. వీటివల్ల అనేక మందికి రావాల్సిన ఉద్యోగోన్నతులు నిలిచిపోతున్నాయని పేర్కొన్నారు. సర్క్యులర్ 1 (2019)పై అధికారులకు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. కొత్త బస్సులు, నిధులు, సిబ్బంది నియామకాలు లేకుండా స్త్రీ శక్తి పథకం ప్రారంభించారని, దీంతో ఈ పథకం ప్రారంభమైన నెలరోజుల్లోనే కండక్టర్లు, డ్రైవర్లపై వేధింపులు, కేసులు అధికమయ్యాయని తెలిపారు. 60 మందికిపైగా సస్పెన్షన్లు చోటు చేసుకున్నాయని చెప్పారు. తక్షణం సిబ్బంది నియామకాలు చేపట్టాలని, స్త్రీ శక్తి టిక్కెట్లకు ఆర్‌టిసి భరిస్తున్న ఖర్చును ప్రభుత్వం ఆర్‌టిసికి తిరిగి చెల్లించాలని కోరారు. అదే విధంగా పిఆర్‌సి వెంటనే వేయాలని, 30 శాతం ఐఆర్‌ను ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ సుందరయ్య మాట్లాడుతూ.. 4 విడతల డిఎను ప్రకటించాలని, పేరుకుపోయిన లీవ్ ఎన్‌క్యాష్మెంట్, 11వ పిఆర్‌సి బకాయిలను చెల్లించాలని కోరారు. ఆర్‌టిసి ఉద్యోగ కార్మికులు 2021 పేస్కేల్ కోల్పోయారని చెప్పారు. పెరిగిన ఖర్చుల దామాషాలో వేతనాలు పెరగనందున కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన విద్యుత్ బస్సుల పాలసీని మార్చు చేయాలన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా మాట్లాడుతూ.. విద్యుత్ బస్సుల సాకుతో ఆర్‌టిసిని మూసివేయాలనే పథకాన్ని ప్రభుత్వం రూపొందించిందని, 2029 నాటికి మొత్తం ఆర్‌టిసి బస్సులను ప్రైవేటు విద్యుత్ బస్సులుగా మారుస్తామని విధాన పత్రంలో పేర్కొందని తెలిపారు. ఈ క్రమంలో తొలిదశలో నగరాల్లోని 12 డిపోలను, రెండవ దశలో 19 డిపోలను ప్రైవేటు విద్యుత్ బస్సు ఆపరేటర్లకు అప్పచెప్పేలా సన్నాహాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.

ఆర్‌టిసి కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం తులసీరామ్ మాట్లాడుతూ.. ఆన్‌కాల్ డ్రైవర్లను డిపోల్లో రిక్రూట్ చేస్తున్నారని, వీరికి ఎటువంటి కార్మిక చట్టాలను వర్తింపజేయడం లేదన్నారు. పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యాలు లేవని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యుఎఫ్ ప్రచార కార్యదర్శి టిపిఆర్ దొర, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మాటర్ నుంచి 'ఎరా' ఇవి బైకు విడుదల

- సింగిల్ ఛార్జింగ్‌తో 172 కిలోమీటర్లు

ప్రజాశక్తి - హైదరాబాద్
విద్యుత్ బైకుల తయారీ కంపెనీ మాటర్ తన ఆరేళ్ల శ్రమ తర్వాత తొలి బైకు 'ఎరా'ను విడుదల చేసింది. నాలుగు గేర్లు కలిగిన ఈ బైకు సింగిల్ ఛార్జింగ్‌తో 172 కిలోమీటర్లు ప్రయాణిస్తుందని ఆ కంపెనీ తెలిపింది. మంగళవారం హైదరాబాద్‌లో మాటర్ ఫౌండర్, సిటిఒ కుమార్ ప్రసాద్ తెలికెపల్లి ఎరాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ద్విచక్ర వాహన విభాగంలో 65 శాతం మోటార్ సైకిళ్లు వాటా కలిగి ఉన్నారని.. దేశంలో కేవలం 49 శాతం మంది మాత్రమే



వాహనాలను కలిగి ఉన్నారని.. ఈ రంగంలో విస్తృత అవకాశాలున్నాయన్నారు. అందులోనూ విద్యుత్ ద్విచక్ర వాహనాలకు మంచి భవిష్యత్తు ఉందన్నారు. తమ ఎరా బైక్‌తో కేవలం 25 పైసలతో ఒక్క కిలోమీటర్ ప్రయాణించవచ్చన్నారు. తెలంగాణలో హైదరాబాద్, ఖమ్మంలో షోరూంలను తెరిచామని.. ఆంధ్రప్రదేశ్‌లోనే త్వరలోనే విస్తరించనున్నామని చెప్పారు. దేశంలో 15 డీలర్‌షిప్‌లను కలిగి ఉన్నామని చెప్పారు. త్వరలోనే వీటిని మూడంకెల స్థాయికి చేర్చనున్నామని తెలిపారు. తమ సంస్థ ఇప్పటికే రూ.1790 కోట్ల నిధులను సమీకరించిందని.. వచ్చే ఏడాది మరో 200 మిలియన్ డాలర్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.

జిఎస్‌టిని తగ్గించని ఇ-కామర్స్ సంస్థలు..!

- 30లోగా సమీక్షిస్తామన్న కేంద్రం

న్యూఢిల్లీ : ఇ-కామర్స్ వేదికలు జిఎస్‌టి నూతన శ్లాబులను అమలు చేయడం లేదంటూ వస్తోన్న ఫిర్యాదులపై కేంద్ర ఆర్థిక శాఖ వర్గాలు స్పందించాయి. ఈ ఫిర్యాదులపై ఆరా తీస్తున్నట్లు తెలిపాయి. ధరల మార్పును పర్యవేక్షిస్తున్నామని.. ఫిర్యాదులపై ఇప్పుడే స్పందించలేమని.. సెప్టెంబర్ 30లోగా క్షేత్రస్థాయిలో జిఎస్‌టి అమలుపై నివేదిక అందనుందని వెల్లడించాయి. సెప్టెంబర్ 22 నుంచి జిఎస్‌టి శ్లాబులను 5 శాతం, 18 శాతానికి పరిమితం చేసిన విషయం తెలిసిందే. అయితే పలు ఇ- కామర్స్ వేదికలు పాత జిఎస్‌టి రేట్లను వేస్తున్నాయని రిపోర్టులు రావడంతో కేంద్రం స్పందించింది. జిఎస్‌టి కొత్త శ్లాబుల అమలు సహా మార్కెట్ల తీరును కేంద్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు గమనిస్తోందని తెలిపాయి.

సంపాదకీయం

కంటి తుడుపేనా...

ఏళ్ల తరబడి ప్రజలను పీల్చి పిప్పి చేసిన అనంతరం వస్తు సేవల పన్ను విధానం (గూడ్స్ సర్వీస్ ట్యాక్స్-జిఎస్‌టి)లో కేంద్ర ప్రభుత్వం అట్టహాసంగా తీసుకువచ్చిన మార్పుల తీరు వాత పెట్టినవాడే వెన్న పూసినట్టుగా ఉంది. ఈ చర్యతో భారీ మొత్తంలో పన్నులు తగ్గాయని, సామాన్యులు పండగ చేసుకోవచ్చని పాలకులు చెబుతున్నప్పటికీ వాటి ఫలితాలు సామాన్యులకు అందడంపై సందేహాలు నెలకొన్నాయి. ఈ నెల 22వ తేదీ నుండి నూతన జిఎస్‌టి విధానం అమలులోకి రాగా, ఒక రోజు ముందు దేశ ప్రజలనుద్దేశించి మాట్లాడిన ప్రధానమంత్రి నరేంద్రమోడీ దసరా, దీపావళి పండగ సీజన్‌ను 'జిఎస్‌టి సేవింగ్స్ ఫెస్టివల్'గా అభివర్ణించారు. ఎన్‌డిఎ కూటమిలో భాగస్వామిగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వం ప్రధానమంత్రి నరేంద్రమోడీని అభినందిస్తూ అసెంబ్లీ ఉభయ సభల్లోనూ తీర్మానాలు చేసింది. శాసనసభలో జిఎస్‌టి 2.0 వల్ల కలిగే ప్రయోజనాలపై ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సుదీర్ఘ ప్రసంగం చేశారు. అయితే, ప్రధాని నరేంద్రమోడీగానీ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు గానీ ఇన్ని సంవత్సరాల పాటు ప్రజలపై మోపిన భారాన్ని గురించి ఒక్క మాట కూడా మాట్లాడకపోవడం గమనార్హం. అలాగే ఒక కుటుంబానికి కలిగే ప్రయోజనం ఎంతో కూడా వారు చెప్పలేదు. నిజానికి, ఏ వస్తువుపై ఎంత ధర తగ్గుతుందన్న నిర్దిష్టమైన వివరాలను కూడా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెల్లడించలేదు.

బహుళ, పరోక్ష పన్నుల విధానం స్థానంలో ఏకీకృత పన్ను అని చెబుతూ కార్పొరేట్ల ప్రయోజనాల కోసం జిఎస్‌టిని 2017లో దేశంపై రుద్దింది నరేంద్రమోడీ నేతృత్వంలోని బిజెపి ప్రభుత్వమే కావడం గమనార్హం! కొన్ని దశాబ్దాలుగా అనుసరించిన ఉదారవాద ఆర్థిక విధానాల ఫలితంగా సామాన్యుడి కొనుగోలు శక్తి గణనీంగా తగ్గింది. జిఎస్‌టిలో ఉన్న సంక్లిష్టత, అపరిమిత శ్లాబుల కారణంగా నిత్యావసర ధరలు భారీగా పెరిగి దేశ వ్యాప్తంగా గగ్గోలు రేగింది. ప్రతిపక్షాలు దీనిని గబ్బర్‌సింగ్ ట్యాక్స్‌గా అభివర్ణించాయి. మరోవైపు చిన్న, మధ్య తరగతి పరిశ్రమలు మూతపడి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు భారీగా తగ్గాయి. అదే సమయంలో ట్రంప్ టారిఫ్‌ల ప్రభావమూ పడింది. దీంతో ప్రజల ప్రయోజనాలు ఎలా ఉన్నప్పటికీ కార్పొరేట్ల కోసమైనా దేశీయ మార్కెట్‌ను పెంచడం కోసం జిఎస్‌టిని తగ్గించక తప్పనిస్థితి ఏర్పడింది. పోనీ, ఈ పేరుతోనైనా జిఎస్‌టి ప్రయోజనాలను పూర్తిగా పేదలకు అందిస్తున్నారా అంటే అదీ లేదు. ప్రభుత్వ లెక్కల ప్రకారమే 55 లక్షల కోట్ల రూపాయలను గత ఏడు సంవత్సరాల్లో జిఎస్‌టి ద్వారా ప్రజల మూలుగలు పిండి మోడీ సర్కారు వసూలు చేసింది. అప్పుడే పుట్టిన శిశువు నుండి, తుది శ్వాస విడిచిన వారి వరకు ఏవరినీ వదలని స్థితి! ఇప్పుడు తాజా సంస్కరణల కారణంగా జరిగే తగ్గింపు విలువ గరిష్టంగా 2.25 లక్షల కోట్ల రూపాయలు ఉంటుందని అంచనా! అంటే సామాన్యుడి నుండి పిండినదెంత? ఇప్పుడు తగ్గిస్తున్నదెంత? ఇడ్లీ, దోశలను పట్టించుకోని కేంద్ర పాలకులు చపాతీ, పరోటాలపై మాత్రం జిఎస్‌టి ని తగ్గించారు. దీని వెనుక బీహార్ ఎన్నికల ప్రయోజనాలు ఉన్నాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. జమోటా, స్విగ్గీ వంటి ఫుడ్ డెలివరీ సంస్థల సేవలను 18 శాతం పన్నుల శ్లాబులో చేర్చారు. దేశంలో కోట్లాది మందికి ఉపాధి కల్పించే చేనేత రంగానికి అవసరమయ్యే ముడి సరుకులను అదే శ్లాబులో ఉంచారు. కొన్ని రకాల ఔషధాలను జీరో శ్లాబులో ఉంచినట్లు చెబుతున్నప్పటికి, వాటి తయారీకవసరమైన ముడి పదార్థాలపై పన్ను విధించారు. జిఎస్‌టి అమలులోకి వచ్చిన 24 గంటల తరువాత కూడా పాలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు తగ్గలేదు. పాత స్టాక్‌కు తగ్గింపు వర్తించదని అంటున్నారు. పలు సంస్థలు తమ ఉత్పత్తుల ధరలను కొద్దిరోజుల కిందటే పెంచాయి. వీటిపై జిఎస్‌టిని తగ్గించినా, పెద్దగా ఫలితం లేదు.

సామాన్యుడికి ప్రయోజనం కలిగించాలన్న చిత్తశుద్ధి ప్రభుత్వానికి ఏమాత్రం ఉన్నా జిఎస్‌టి రేట్ల తగ్గింపు వివరాలను నిర్దిష్టంగా సరుకుల వారీగా ప్రకటించాలి. జిఎస్‌టి తగ్గక ముందు ఉన్న ధర, తగ్గిన తరువాత ఉన్న ధరల వివరాలను నిర్దిష్టంగా వెల్లడించాలి. అలాగే జిఎస్‌టి తగ్గింపు ఒక్కటే చాలదు. ప్రజల కొనుగోలు శక్తిని పెంచడానికి అవసరమైన ఇతర చర్యలు నిజ వేతనాల పెంపు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కల్పన వంటి చర్యలను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలి. అప్పుడే దేశీయ ఉత్పత్తులకు, ఎంఎస్‌ఎంఇలకు ఊతం లభిస్తుంది. స్వావలంబన దిశలో అడుగులు పడతాయి.

నివాళి

నేడు కొరటాల జయంతి



భూస్వామ్య కుటుంబంలో పుట్టి విద్యార్థి దశలోనే ఉద్యమాలు నడిపిన నేత కొరటాల సత్యనారాయణ. గుంటూరు జిల్లాలో రైతాంగ ఉద్యమ నాయకుడిగా పేద రైతుల సమస్యలపై అనేక పోరాటాలు చేశారు. నాగార్జున సాగర్ నిర్మాణానికై అనేక పోరాటాలు చేశారు. 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' ఉద్యమాన్ని ఉధృతం చేయడంలో గణనీయమైన కృషి చేశారు. చేనేత కార్మికులు కొరటాలను తమ వాడిగా చెప్పుకున్నారంటే వారి సమస్యలపై ఆయన చేసిన కృషి నిరుపమానమైనది. సమస్యలను అధ్యయనం చేయడంలో ఆయన శైలి ప్రత్యేకమైనది.

జననం: 24.9.1923
మరణం: 1.7.2006

రైతుల్ని ఆదుకునే విధానం ఇదేనా?

విశ్లేషణ



వి. శ్రీనివాసరావు

తమది రైతు ప్రభుత్వమని, వారి ఆదాయాన్ని రెట్టింపు చేయడమే లక్ష్యమని పదే పదే ప్రకటిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, వారి కూటమి ప్రభుత్వం ఆచరణలో వీసమెత్తు మేలు చేయకపోగా సిండికేట్‌గా మారి, రైతుల మూలుగలను పీలుస్తూ బడా వ్యాపారస్తుల కొమ్ము కాస్తున్నది. రైతుల అకౌంట్‌లో నేరుగా డబ్బులు వేస్తున్నామంటూ ఊరూరా మైకులు పెట్టి డప్పు వాయిస్తున్న కూటమి చర్యలు పరోక్షంగా వ్యాపారులకే ఉపయోగపడుతున్నాయి. ఈ సంవత్సరం ప్రారంభం నుండి రాష్ట్రంలో జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టంగా అర్థమవుతుంది.

2024 నవంబర్ నుండి గుంటూరు మిర్చి మార్కెట్ యార్డులో ధరల పతనం ప్రారంభమైంది. అంతకు ముందు సంవత్సరం క్వింటాలు రూ.26 వేలకు అమ్ముకున్న రైతులు ఆ తరువాత అప్పుల బారి నుండి బయటపడవచ్చన్న విశ్వాసంతో మిర్చి విస్తీర్ణాన్ని పెంచారు. దీన్నే అదునుగా తీసుకున్న వ్యాపారులు సిండికేట్ అయ్యి సీజన్ ప్రారంభం నుండే క్వింటా రూ.13 వేలకు తగ్గించేశారు. రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నా ప్రభుత్వం సకాలంలో జోక్యం చేసుకోలేదు. చివరకు అది రూ.9 వేలకు పడిపోయింది. రైతులు రోడ్డెక్కి ఆందోళనలు ప్రారంభించాకే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆగమేఘాలమీద ఆదుకుంటున్నట్లు ప్రకటనల మీద ప్రకటనలు గుమ్మరించారు. రూ.11,781కు తక్కువగా అమ్ముకుంటే ఆ పైమొత్తాన్ని రొక్కంగా ఇస్తామని ఊరించారు. ఉత్సవాలు కూడా జరిపారు. వారి పార్టీ అనుయాయుల చేత పాలాభిషేకాలు చేయించారు. కానీ రైతుల మొఖాల్లో ఆనందం లేదు. ఆ తేడా మొత్తాన్ని రైతుల ఖాతాల్లో వేస్తామన్న ప్రభుత్వ మాటలు నీటిమూటలుగానే మిగిలిపోయాయి. ఒక్క రైతు ఖాతాలో ఒక్క పైసా కూడా వేయలేదు. పడిపోయిన ధరతో మిర్చి రైతులు దివాళా ఎత్తారు. ఒక సంవత్సరం లాభం వస్తే ఆ ఆశ చూపి మూడేళ్ళు ధరలు కోసి పిండుకోవడం మార్కెట్‌లో ఒక వ్యూహంగా మారింది.

ఈ సంవత్సరం మార్చి నుండి నల్ల బర్లీ పొగాకు కొనుగోలు లేక రైతులు సంక్షోభంలో పడ్డారు. ముందు నుండి ప్రోత్సహించి నల్ల బర్లీ పొగాకు వేయించిన ఐటిసి, అలయన్, డెక్కన్ జిపిఐ వంటి కంపెనీలు మొఖం చాటేశాయి. మీరు మాకు చెప్పి వేశారా? అంటూ మంత్రులు రైతులపై ఆగ్రహించారు. నల్ల బర్లీకి డిమాండ్ లేదన్న కంపెనీలు తెల్ల బర్లీకి సైతం ధర ఇవ్వలేదు. సగానికి మించి కొనలేదు. వర్జీనియా పొగాకు రైతులకు అంతకు ముందు సంవత్సరం మీద సగం ధరే గిట్టుబాటయ్యింది. ఏప్రిల్, మే మాసాల్లో రైతులు వివిధ రూపాల్లో రోడ్డెక్కి ఆందోళనలు చేశాకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి కొంత వరకు కొనడం వల్ల ఆ మేరకైనా తెల్ల బర్లీ రైతులకు ఊరట లభించింది. ఇప్పటికీ 30 శాతం పొగాకు రైతుల వద్దే ఉండిపోయింది. వర్జీనియా మాడు (తక్కువ నాణ్యత) అమ్ముడు పోలేదు.



ఉల్లి పంటకు ధర లేకపోవడంతో కర్నూలు జిల్లా కోసిగి గ్రామానికి చెందిన రైతులు తమ పంటను ఊరి బయట పడేస్తున్న దృశ్యం

> **ఈ సంవత్సరం మార్చి నుండి నల్ల బర్లీ పొగాకు కొనుగోలు లేక రైతులు సంక్షోభంలో పడ్డారు. ముందు నుండి ప్రోత్సహించి నల్ల బర్లీ పొగాకు వేయించిన ఐటిసి, అలయన్, డెక్కన్ జిపిఐ వంటి కంపెనీలు మొఖం చాటేశాయి. మీరు మాకు చెప్పి వేశారా? అంటూ మంత్రులు రైతులపై ఆగ్రహించారు. నల్ల బర్లీకి డిమాండ్ లేదన్న కంపెనీలు తెల్ల బర్లీకి సైతం ధర ఇవ్వలేదు. సగానికి మించి కొనలేదు. వర్జీనియా పొగాకు రైతులకు అంతకు ముందు సంవత్సరం మీద సగం ధరే గిట్టుబాటయ్యింది. ఏప్రిల్, మే మాసాల్లో రైతులు వివిధ రూపాల్లో రోడ్డెక్కి ఆందోళనలు చేశాకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు తెరిచి కొంత వరకు కొనడం వల్ల ఆ మేరకైనా తెల్ల బర్లీ రైతులకు ఊరట లభించింది. ఇప్పటికీ 30 శాతం పొగాకు రైతుల వద్దే ఉండిపోయింది.**

గత ఖరీఫ్, రబీ సీజన్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాలే పనిచేయలేదు. పేరుకు కేంద్రాలు పెట్టి, బ్యానర్లు తగిలించారు తప్ప మిల్లర్ల దయాదాక్షిణ్యానికి ధాన్యం రైతులను బలిచేశారు. ప్రభుత్వం ప్రకటించిన గిట్టుబాటు ధర క్వింటాలుకు రూ.2,320 ఉండగా, మిల్లర్లు రూ.2 వేలకు మించి ఎక్కడా కొనలేదు. తడిచిందని, తేమ ఎక్కువ ఉందని, ముక్క విరిగిపోతుందని రకరకాల సాకులు పెట్టి మిల్లర్లు రేట్లు దిగ్గోసేశారు. పేరుకు రైతు సేవా కేంద్రాలున్నా అవి మార్కెట్‌లోకి దిగలేదు. రేషన్ బియ్యం దారి తప్పి విదేశాలకు స్మగుల్ అవుతుందని హడావుడి చేసిన పౌర సరఫరాల శాఖా మాత్యులు అక్రమాలకు పాల్పడ్డ మిల్లర్లపై ఎలాంటి చర్యా తీసుకోలేదు. 'సీజ్ ద షిప్' అంటూ రంకెలు వేసిన పవన్ కల్యాణ్ ఆ తరువాత పత్తా లేరు. షిప్పుల దారిన షిప్పులు దొంగ సరుకు తీసుకొని వెళ్ళిపోయాయి. పైగా బియ్యం బదులు డబ్బు ఇస్తామంటూ రేషన్ కార్డు హోల్డర్లకు ఆశ చూపుతున్నారు. రైతులనుండి సేకరించిన సన్న బియ్యాన్ని రేషన్ షాపులకు ఇవ్వకుండా మిల్లర్లకు అవకాశం కల్పించింది ఈ ప్రభుత్వం. అదే మిల్లర్లు రైతులకు గిట్టుబాటు ధర ఇవ్వకుంటే మిన్నకుండి పోయింది.

తాజాగా కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులు రోడ్డెక్కారు. కర్నూలు ఉల్లి మార్కెట్ అతి పెద్దది. ఈ జిల్లాలో 45 వేల ఎకరాల్లో ఉల్లి సాగవుతున్నది. ఉత్పత్తి ఖర్చు లక్ష నుండి లక్ష 20 వేల వరకు అవుతుంది. కౌలుకు తీసుకుంటే మరో పాతిక వేలు డబ్బు ముందుగానే చెల్లించాలి. గత సంవత్సరం క్వింటాలుకు రూ.6 వేల వరకు అమ్ముడైన ఉల్లి ఈ సంవత్సరం రూ.300 నుండి 500 లకే అమ్ముకోవాల్సిన దుర్గతి పట్టింది. ఉల్లిని రోడ్డుపై పోసి రైతులు పెద్ద ఎత్తున నిరసన తెలియజేయడంతో ప్రభుత్వం మార్కెట్‌లో జోక్యం చేసుకొని రూ.1200కు కొంటామని వాగ్దానం చేసింది. నాలుగు రోజులు కొని చేతులెత్తేసింది. కొన్న సరుకును సైతం మార్కెట్ యార్డుల్లో బహిరంగంగా కుళ్ళబెడుతున్నది. 100 రూపాయలకు 45 కేజీల బస్తాను కర్నూలు మార్కెట్‌లో ఒక్కరోజు కలెక్టరే ప్రత్యక్షంగా అమ్మకాలు సాగించారు. ఇప్పుడు హెక్టారుకు రూ.50 వేలు (ఎకరాకు రూ.20 వేలు) ఇస్తామంటూ ఆర్భాటంగా ప్రకటన చేశారు. ఇదే విషయాన్ని రైతులకు చెప్పగా 2017లో ఇదే ప్రభుత్వం ఉల్లి రైతులకు రూ.300 అదనంగా ఖాతాల్లో వేస్తామని చెప్పి ఇంత వరకూ అమలు చేయలేదన్నారు. రైతులకు రూ.5 కోట్లు బకాయి పడింది. ఈ విధానంలో పూర్తిగా నష్టపోయేది కౌలురైతులు. ఇప్పుడు ఈ వాగ్దానం కూడా మిర్చి రైతులకు ఇచ్చిన వాగ్దానం లాంటిదే అవుతుందని రైతులు సహేతుకంగానే సందేహిస్తున్నారు. ప్రభుత్వం ఉల్లి కొనుగోలు చేయకుండా మార్కెట్ నుండే ఉపసంహరించుకొని రైతుల ఖాతాల్లో డబ్బులు వేస్తామని చెప్పడం ద్వారా ఎవరికి మేలు జరిగింది? మార్కెట్‌లో ప్రభుత్వం రూ.1200 చొప్పున కొనుగోలు చేస్తే ఒక ఎకరాకు సగటున 70 క్వింటాళ్ళు అయితే 70X1200 చొప్పున రూ.84 వేలు రైతుకు వస్తుంది. ఇప్పుడు ఎకరాకి రూ.20 వేలు అంటే క్వింటాలుకు రూ.285 మాత్రమే వస్తుంది. ఇది వ్యాపారుస్తులు కొనే రేటుకన్నా తక్కువ. ప్రభుత్వం డబ్బులు ఇస్తానంటున్నది కాబట్టి ఆ మేరకు ధరలు కోత పెట్టి వ్యాపారులు ముంచేస్తున్నారు.

పత్తికొండ, ఆదోని, మదనపల్లి తదితర ప్రాంతాల్లో టమాటా ఆరు వేల ఎకరాల్లో పండిస్తున్నారు. రైతుల పరిస్థితి చాలా ఘోరంగా ఉంది. నేను (రచయిత) 22వ తేదీన పత్తికొండ మార్కెట్‌లో కార్యదర్శిని విచారించినప్పుడు కిలో రూ.11 నుండి 13 రూపాయలకు అమ్ముడు పోతున్నట్లు చెప్పారు. కానీ వాస్తవంలో రైతులు 5 రూపాయలు లోపే అమ్ముకుంటున్నారు. ప్రభుత్వం గరిష్ట ధర చెప్పి ప్రజలను తప్పు దారి పట్టిస్తున్నది. ఈ మార్కెట్ నుండే హైదరాబాద్ లాంటి నగరాలకు టమాటా ఎగుమతి అవుతున్నది. అదే రోజు హైదరాబాద్‌లో రిటైల్ మార్కెట్‌లో కిలో రూ.50కు వినియోగదారులు కొన్నారు. ఈ తేడాను గమనిస్తే రైతులు ఎంత దారుణంగా దోపిడీకి గురవుతున్నారో అర్థమవుతున్నది.

> **మార్కెట్‌లో జోక్యం చేసుకోకుండా స్వేచ్ఛా వాణిజ్యానికి సహకరించాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానం. దీనికి బదులుగా డి.బి.టి (నగదు బదిలీ)ని ప్రవేశపెట్టారు. దాని దుష్పరిణామమే నేటి రైతు దుర్గతి. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో వ్యాపారుల లాభాపేక్షకు గ్యారెంటీ చేయడానికి మార్కెట్‌లో జోక్యం చేసుకోకుండా రైతుల్ని బలిచేస్తున్నది. "మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్"ను చెత్తబుట్టలో పడేసింది. మోడీ ప్రభుత్వం నెల క్రితం పైసా పన్ను లేకుండా పత్తి దిగుమతి చేసుకోవడానికి అనుమతినిచ్చినా చంద్రబాబు కనీసం ఖండించలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ నోరెత్తలేదు. ట్రంప్ టారిఫ్ టెర్రరిజంతో మన దేశం తల్లడిల్లిపోతున్నది. ఇప్పటి వరకు ట్రంప్‌కు తందానా అన్న మోడీ విదేశాలపై ఆధారపడటమే అతి పెద్ద శత్రువు అంటూ ప్రకటన చేశారు. 'ఆత్మ నిర్భర్' పేరుతో మరోసారి మోసగిస్తున్నారు. విదేశీ పెట్టుబడుల కోసం దేశ దేశాలు తిరిగి వస్తున్న మన ముఖ్యమంత్రి... ప్రధాని మాటలకు ఉబ్బితబ్బిబ్బై భేష్ అంటున్నారు.**

ఈ ప్రాంతంలో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ పెడతామంటూ గత రెండు దశాబ్దాలుగా పాలకులు ఊరిస్తున్నారు. తాజాగా కూటమి మంత్రి భూమి పూజ చేశారు. ఇదే విషయం ఒక మహిళా రైతు దగ్గర నేను ప్రస్తావించగా ఈమాట నా చిన్నప్పటి నుండి వింటూనే ఉన్నానంటూ చప్పరించేసింది. ఆమె గత ఎన్నికల్లో తెలుగుదేశం కూటమికే ఓటేసినట్లు చెప్పింది. పార్టీలతో నిమిత్తం లేకుండా టమాటా రైతులు నష్టపోతున్నారు. కానీ ఇక్కడ 7,8 మంది వ్యాపారస్తులు రిజిస్టర్ చేసుకుంటే వాస్తవంలో మూడు, నాలుగు కంపెనీలు మాత్రమే కొనుగోలు చేస్తున్నాయి. ఇతర రాష్ట్రాల నుండి వ్యాపారస్తులను అనుమతించడం లేదు. మార్కెట్ యార్డు కార్యదర్శి కారణాలు చెప్పడానికి కూడా సందేహించారు. వ్యాపారుస్తుల సిండికేట్‌కు ప్రభుత్వం పరోక్షంగా సహకరిస్తున్నది.

ప్రభుత్వమే నేరుగా కనీసం 20 శాతం అంటే 6 వేల టన్నులు ఉల్లి కొంటే 12 కోట్లు పెట్టుబడి పెడితే సరిపోతుంది. మిగతా సరుకును వ్యాపారులు ధర పెంచి కొనాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది. మార్కెట్‌లో పోటీ వాతావరణాన్ని, సృష్టించాల్సిన ప్రభుత్వం ఏకపక్షంగా సిండికేట్‌కు దోపిడీ దారి సుగుమం చేసింది. దసరా, మొహరం, దీపావళి సందర్భంగా రేషన్ షాపుల ద్వారా కిలో 5 రూపాయలకు ఉల్లి, 10 రూపాయలకు టమాటా అమ్మినా నష్టం రాదు. అటు ప్రజలకు, ఇటు రైతులకు మేలు జరుగుతుంది. ప్రభుత్వానికి భారం ఉండదు.

మార్కెట్‌లో జోక్యం చేసుకోకుండా స్వేచ్ఛా వాణిజ్యానికి సహకరించాలన్నది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానం. దీనికి బదులుగా డి.బి.టి (నగదు బదిలీ)ని ప్రవేశపెట్టారు. దాని దుష్పరిణామం వల్లే రైతుకి నేడు ఈ గతి పట్టింది. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో వ్యాపారుల లాభాపేక్షకు గ్యారెంటీ చేయడానికి మార్కెట్‌లో జోక్యం చేసుకోకుండా రైతుల్ని బలిచేస్తున్నది. "మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్"ను చెత్తబుట్టలో పడేసింది. మోడీ ప్రభుత్వం నెల క్రితం పైసా పన్ను లేకుండా పత్తి దిగుమతి చేసుకోవడానికి అనుమతినిచ్చినా చంద్రబాబు కనీసం ఖండించలేదు. వైఎస్సార్ కాంగ్రెస్ నోరెత్తలేదు. ట్రంప్ టారిఫ్ టెర్రరిజంతో మన దేశం తల్లడిల్లిపోతున్నది. ఇప్పటి వరకు ట్రంప్‌కు తందానా అన్న మోడీ విదేశాలపై ఆధారపడటమే అతి పెద్ద శత్రువు అంటూ ప్రకటన చేశారు. 'ఆత్మ నిర్భర్' పేరుతో మరోసారి మోసగిస్తున్నారు. విదేశీ పెట్టుబడుల కోసం దేశ దేశాలు తిరిగి వస్తున్న మన ముఖ్యమంత్రి...ప్రధాని మాటలకు ఉబ్బితబ్బిబ్బై భేష్ అంటున్నారు. అమెరికా ఒత్తిడికి లొంగి దొడ్డి దారిన ఒప్పందాలు చేసుకుంటూ 'ఆత్మ నిర్భర్' అంటూ నినాదాలివ్వడం దేశ ప్రజలను మోసగించడమే.

/ వ్యాసకర్త సిపిఎం రాష్ట్ర కార్యదర్శి /


సమీక్ష

'ఓ సోషలిస్టు ఆచరణ పథం'

తప్పక చదవాల్సిన పుస్తకం

వి. ఆర్

> **పుస్తకంలోని చివరి వ్యాసం చాలా ప్రాధాన్యతను కూడుకున్నది. 'పెట్టుబడిదారీ వ్యవస్థ:పరిమితులు - సోషలిజం ప్రత్యామ్నాయం' అనే ఈ వ్యాసంలో మార్క్సిజాన్ని యాంత్రికంగా అన్వయించకూడదని, అమలు పరచకూడదని లెనిన్ చేసిన హెచ్చరికను గుర్తు చేస్తూ 'విప్లవ పోరాటాలను నిర్మించే సరైన నాయకత్వం ఏదైనా వాస్తవ పరిస్థితుల ఆధారంగానే పనిచేయాలని' పిలుపునిస్తారు. సీతారాం ఎక్కడ ఉపన్యాసం చేసినా 'నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అన్వయింపే మార్క్సిజం' అని చెప్పడం వెనుక లెనిన్ బోధనల సారం ఎంత బలంగా ఆయనలో వుందో ఈ వ్యాసం తెలుపుతుంది. నేటి వర్తమాన పరిస్థితుల అవగాహనకు కీలకమైన సైద్ధాంతిక, నిర్మాణ అంశాలతో పాటు... మన దేశ సంస్కృతి, వామపక్షాల కృషి, సోషలిస్టు ప్రాధాన్యతలను సరిగా అర్థం చేసుకోవడానికి...సీతారాం ఏచూరి 'ఓ సోషలిస్టు ఆచరణ పథం' పుస్తకాన్ని కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వామపక్ష శ్రేయోభిలాషులు, ప్రజాతంత్ర వాదులు తప్పక చదవాలి.**



సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా ప్రజాశక్తి బుక్‌హౌస్, నవ తెలంగాణ పబ్లింగ్ హౌస్ సంయుక్తంగా ప్రచురించిన 'ఓ సోషలిస్టు ఆచరణ పథం' కమ్యూనిస్టులు మాత్రమే కాదు, భారతీయతను అభిమానించే ప్రతి ఒక్కరు తప్పక చదవాల్సిన పుస్తకం. ఇందులో మార్క్సిజం, భారత రాజకీయాలు, సోషలిజం నిర్మాణం అనే మూడు భాగాలు వున్నాయి. ఇందుకోసం సీతారాం ఏచూరి రాసిన 805 వ్యాసాలను, 85 ప్రసంగ పాఠాలను, 17 నోట్సులను పరిశీలించినట్లు పుస్తక సంపాదకులు పేర్కొన్నారు. ఇంత విస్తారమైన శోధనతో ప్రచురించబడిన 200 పేజీల ఈ పుస్తకం మార్క్సిస్టు సైద్ధాంతికతతో పాటు, భారతీయ భావనను సరిగా అర్థం చేసుకోవడానికి బాగా తోడ్పడుతుంది. పెట్టుబడిదారీ వ్యవస్థ స్థానంలో సోషలిజం నిర్మాణం అవసరాన్ని, ప్రస్తుతం వున్న అవకాశాలను సీతారాం వివరించిన తీరు పాఠకులను ఆకట్టుకుంటుంది. అత్యంత సులభశైలిలో తెలుగు పాఠకులకు ఈ పుస్తకాన్ని అందించిన అనువాదకులు అభినందనీయులు.

మొదటి భాగంలో కారల్ మార్క్స్, ఫ్రెడరిక్ ఎంగెల్స్, మావో జెడాంగ్ జయంతుల సందర్భంగా రాసిన వ్యాసాలు, చేసిన ఉపన్యాసాల నోట్స్ నుండి మార్క్సిజం యొక్క శాస్త్రీయతను వివరిస్తాయి. 'ఈ సిద్ధాంతానికి ఎవరూ ప్రతిఘటించలేనంత శక్తి ఉంది, కారణం అత్యున్నత స్థాయి శాస్త్రీయతతో మానవ సమాజం అభివృద్ధికి సంబంధించిన నియమాలు అందులో వుండడమే' అని దాని శాస్త్రీయ గొప్పతనాన్ని సీతారాం చెప్పారు. మనిషి బతికి వుండాలంటే కనీస అవసరాలు తీరాలి. అందుకోసం ఉత్పత్తి చేయాలి, ఈ క్రమంలో మనుషుల మధ్య అనివార్యంగా (ఇష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండా) సంబంధాలు ఏర్పడతాయి. అవే ఆ సమాజపు ఆర్థిక నిర్మాణం అవుతుంది. అందువల్ల జీవితాన్ని చైతన్యం నిర్ణయించదు, అందుకు భిన్నంగా జీవితమే చైతన్యాన్ని నిర్ణయిస్తుందనే మార్క్సిస్టు మౌలిక అవగాహనను ఆయన లోతైన అధ్యయనంతో సులభంగా వివరించారు. సామూహిక జీవితాల నుండే ప్రజా సంస్కృతి ఏర్పడుతుందని, కళాత్మక, సృజనాత్మక ప్రజా జీవితం ఏర్పడుతుందని మార్క్స్, ఎంగెల్స్ రచనల నుండి అనేక భాగాలను వివరించారు.

మార్క్సిస్టు రాజకీయ అర్థశాస్త్రాన్ని ప్రాథమికంగా అర్థం చేసుకోవడానికి సీతారాం ఏచూరి రచించిన ఈ పుస్తకం చాలా ఉపయోగపడుతుంది. ఉత్పత్తిలో కీలకమైన మానవ శ్రమ, అది ఉపయోగించే పరికరాల అభివృద్ధి నిరంతరాయంగా కొనసాగుతుంది. వీటిని వినియోగించే స్థితిలో ప్రజల మధ్య సంబంధాలు వుంటే సమాజం పురోగమిస్తుంది. అయితే వర్గ సమాజం ఈ పురోగతికి ఆటంకంగా మారి సంక్షోభానికి దారితీస్తుంది. సంక్షోభం ఏర్పడిన అన్ని సందర్భాలూ తప్పకుండా విప్లవానికే దారి తీస్తాయని అనుకోరాదని, అప్పటి వర్గ పోరాటపు తీవ్రత మీద ఆధారపడి వుంటుందని సీతారాం చెప్పారు. పెట్టుబడిదారీ వ్యవస్థ పుట్టుక, పరిణామం, పతనం గురించి అవగాహనను పాఠకుల్లో కలిగిస్తుంది. సరుకు విలువలో శ్రమ పాత్ర గురించి క్లుప్తంగా సూటిగా ఆయన చెబుతారు. కార్మికులు ఎందుకు శ్రమను అమ్ముకుంటారు, యజమాని ఇచ్చే వేతనం లేదా కూలి చేసిన శ్రమకు కాకుండా శ్రమశక్తి మాత్రమే ఎందుకు ఇస్తారో చెప్పి దీని నుండి ఏర్పడే అదనపు మిగులు ఈ వ్యవస్థలోని అన్ని రుగ్మతలకు మూలమంటారు. కొద్దిమంది దగ్గర సంపద పోగు పడుతుంటే అత్యధిక మంది పేదరికంలో మగ్గడానికి మూల కారణం ఇదేనని కారల్ మార్క్స్ ప్రఖ్యాత గ్రంథం 'కాపిటల్' నుండి అనేక వివరణలు ఈ పుస్తకంలో వివరించారు. రెండు ప్రపంచ యుద్ధాలకు, నేటి ప్రపంచీకరణ-నయా ఉదారవాద విధానాలకు పెట్టుబడిదారీ వ్యవస్థ లాభం అనే ధనదాహమే కారణమంటారు.

మావో జెడాంగ్ గురించి రాసిన వ్యాసంలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణ ప్రాధాన్యత గురించి తెలిపారు. 'కమ్యూనిస్టు పార్టీ పని తీరు సజీవంగా ఉండాలంటే కమిటీల పని తీరు సవ్యంగా ఉండాలని, కమ్యూనిస్టులు నిరాడంబరంగా, వివేకవంతంగా, అతి సాధారణ జీవితం గడుపుతూ, ఎప్పటికప్పుడు బూర్జువా సిద్ధాంత ప్రభావం తన మీద పడకుండా కాచుకోవాలంటారు'. స్వీయ మానసిక ధోరణి ప్రమాదం గురించి ప్రత్యేకంగా ఒక వ్యాసం వుంది. 'ప్రజల నుండి నేర్చుకోవడం' గురించి లీషావ్‌చి చెప్పిన విషయాలను ఇందులో గుర్తు చేసి పార్టీలో దిద్దుబాటు ఉద్యమం నిరంతరం కొనసాగాల్సిన అవసరాన్ని వివరిస్తారు. శ్రీలంక కమ్యూనిస్టు పార్టీ నాయకుడు పి. కందయ్య స్మారక సభలో చేసిన 'ప్రపంచీకరణ శకంలో సోషలిజం' ప్రసంగం నేటి వర్తమాన పరిస్థితులను వివరిస్తుంది. 'ప్రపంచీకరణ అంటే మెజారిటీ ప్రజానీకం మరింత దోపిడీకి గురికావడం తప్ప మరొకటి కాదు' ఆయన నిర్ధారించారు. నిర్దిష్ట పరిస్థితులలో సోషలిజం నిర్మాణం గురించి లెనిన్, డెంగ్ జియావో పింగ్ చేసిన ప్రయోగాలు, వాటి పట్ల మార్క్సిస్టు పార్టీ వైఖరి గురించి ఆయన ఈ వ్యాసంలో వివరించారు. మతం పట్ల మార్క్సిజం యొక్క అవగాహనను 'మార్క్సిజం, మతం' అనే వ్యాసంలో చెప్పారు. మతానికి, మతతత్వానికి వున్న తేడాను ఇందులో వివరించి మత విశ్వాసకుల నుండి మతోన్మాదులను వేరు చేయాల్సిన ప్రాధాన్యతను చెబుతారు.

రెండవ భాగంలో 'నయా ఉదారవాదం, లౌకికతత్వం: భారతదేశంలో వామపక్షాల భవిష్యత్తు' అనే వ్యాసం 2009 పార్లమెంట్ ఎన్నికల్లో వామపక్షాలు తీవ్రమైన ఎదురుదెబ్బలు ఎదుర్కొన్న సందర్భంలో రాసినది. దేశంలో వామపక్షాల భవిష్యత్తు భారత దేశ భవిష్యత్తుతో విడదీయలేనిదని నిర్ధారించారు. 1949 నవంబర్ 25న రాజ్యాంగ రూపకర్త డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ చెప్పిన 'రాజకీయాల్లో మనకు సమానత్వం ఉంటుంది, ఆర్థిక జీవనంలో అసమానతలు ఉంటాయి' అనే భాగాన్ని వివరిస్తూ ఈ అసమానతలకు వ్యతిరేకంగా చేయాల్సిన కృషిని గురించి, దేశంలో కుల సమస్య, మార్క్సిస్టుల అవగాహనను గురించి చెబుతారు. భూ సంస్కరణల ప్రాధాన్యతను వాటిని అమలు చేయాలంటున్న కమ్యూనిస్టులపై పాలకవర్గాల కుట్రలను పశ్చిమ బెంగాల్-సింగూర్, నందిగ్రామ్ అనుభవం నుండి వివరించాడు. 'భారతదేశ భావన' అనే వ్యాసంలో వాస్తవ భారత జాతీయతకు హిందూత్వ శక్తులు చెబుతున్న జాతీయత పూర్తి భిన్నమైనదన్నారు. ప్రజల్లో భారతదేశ భావన రూపొందిన క్రమంలో వామపక్షాల కృషి ఎంత కీలకమైందో చారిత్రక ఆధారాలతో సీతారాం వివరించారు. మతతత్వం పెరిగిపోతున్న దశలో ప్రజా సంస్కృతిని పరిరక్షించుకోవలసిన అవసరాన్ని, అందుకు అనుసరించాల్సిన పద్ధతులను 'ప్రపంచీకరణ, వాణిజ్యీకరణ, మతతత్వ దశలో సంస్కృతి' అనే వ్యాసంలో ప్రజల సమస్యలను ప్రధాన ఎజెండాగా మార్చాలని బోధించారు.

మూడో భాగంలో సోషలిజం నిర్మాణం గురించిన వ్యాసాలు వున్నాయి. రష్యా విప్లవం మన దేశంపై చూపించిన ప్రభావం గురించి విశ్వకవి రవీంద్రనాథ్ టాగూర్ చివరి రోజుల్లో ఉటంకించిన 'ఏ మాత్రం వెనకడుగు వేయకుండా, నిరంతర శ్రమతో రష్యా తన దేశం నుంచి అనారోగ్యం, నిరక్షరాస్యతలను తరిమి కొట్టింది' అనే వాక్యాలను చెబుతూ మన జాతీయోద్యమ నాయకులను, కవులను, రచయితలను, కళాకారులను, అభ్యుదయ శక్తులను ఆ విప్లవం ఎంతగా ప్రభావితం చేసిందో వివరిస్తారు. పుస్తకంలోని చివరి వ్యాసం చాలా ప్రాధాన్యతను కూడుకున్నది. 'పెట్టుబడిదారీ వ్యవస్థ: పరిమితులు-సోషలిజం ప్రత్యామ్నాయం' అనే ఈ వ్యాసంలో మార్క్సిజాన్ని యాంత్రికంగా అన్వయించకూడదని, అమలు పరచకూడదని లెనిన్ చేసిన హెచ్చరికను గుర్తు చేస్తూ 'విప్లవ పోరాటాలను నిర్మించే సరైన నాయకత్వం ఏదైనా వాస్తవ పరిస్థితుల ఆధారంగానే పనిచేయాలని' పిలుపునిస్తారు. సీతారాం ఎక్కడ ఉపన్యాసం చేసినా 'నిర్దిష్ట పరిస్థితుల నిర్దిష్ట అన్వయింపే మార్క్సిజం' అని చెప్పడం వెనుక లెనిన్ బోధనల సారం ఎంత బలంగా ఆయనలో వుందో ఈ వ్యాసం తెలుపుతుంది.

నేటి వర్తమాన పరిస్థితుల అవగాహనకు కీలకమైన సైద్ధాంతిక, నిర్మాణ అంశాలతో పాటు... మన దేశ సంస్కృతి, వామపక్షాల కృషి, సోషలిస్టు ప్రాధాన్యతలను సరిగా అర్థం చేసుకోవడానికి...సీతారాం ఏచూరి 'ఓ సోషలిస్టు ఆచరణ పథం' పుస్తకాన్ని కమ్యూనిస్టు పార్టీ నాయకులు, కార్యకర్తలు, వామపక్ష శ్రేయోభిలాషులు, ప్రజాతంత్ర వాదులు తప్పక చదవాలి. ★



'మోసం'

పని గంటలు
పెంచడం అంటే...!
అదనపు శ్రమను
ఆరగించడం
సాంఘిక జీవితాన్ని
కుదించడం
కుటుంబ జీవితాన్ని
హరించడం
అన్యాయాన్ని ఎదిరించే
అవకాశాన్ని లాక్కోవడం
హక్కుల కోసం నిలబడే
ఆలోచనని గుంజుకోవడం
దోపిడీని ప్రశ్నించే...
చైతన్యాన్ని చిదిమేయడం
ఓట్లు, సీట్ల కోసం
సంక్షేమం సన్నాయి నొక్కులు
కార్పొరేట్ల లాభాల కోసం
నికృష్ట వికృత చేష్టలు
మేక తోలు కప్పుకున్న
తోడేళ్ళను
మతం రంగు పులుముకున్న
రాజకీయుల్ని
గుర్తించనంత కాలం
మోసపోక తప్పదు
కార్మిక జనం.

- వి. రాజగోపాల్,
విజయనగరం.
సెల్ : 9133084262

మీ వ్యాసాలను పంపాల్సిన మెయిల్ :
editpageps @gmail.com

ఏనుగుల దాడిలో పంటలు ధ్వంసం


ఏజెన్సీలో సంచరిస్తున్న ఏనుగులు

ప్రజాశక్తి- కురుపాం (పార్వతీపురం మన్యం)

పార్వతీపురం మన్యం జిల్లా కురుపాం మండలం తిత్తిరి పంచాయతీలో గిరి శిఖర గ్రామాలైన తులసి, సిడిగూడ, పులిపుట్టి, టోంపలపాడు పరిసర గ్రామాల్లో మంగళవారం నాలుగు ఏనుగుల గుంపు సంచరించింది. గిరిజన రైతులు సాగు చేస్తోన్న మొక్కజొన్న, వరి, అరటి పంటలను ధ్వంసం చేసింది. దీంతో, బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం కుంకీ ఏనుగులను తీసుకొచ్చి ఈ ఏనుగులను దూర ప్రాంతాలకు తరలిస్తామని ఇచ్చిన హామీని తక్షణమే నెరవేర్చి తమ పంటలకు, ప్రాణాలకు రక్షణ కల్పించాలని కోరారు.

డప్పులతో దద్దరిల్లిన కర్నూలు కలెక్టరేట్

- కళాకారులకు రూ.ఏడు వేల పింఛను ఇవ్వాలి : ఆనంద్ బాబు

ప్రజాశక్తి - కర్నూలు కలెక్టరేట్

తమ సమస్యలు పరిష్కరించాలని డప్పు కళాకారులు డప్పులు వాయించడంతో కర్నూలు కలెక్టరేట్ దద్దరిల్లింది. మంగళవారం ఆంధ్రప్రదేశ్ డప్పు కళాకారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా చేపట్టారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.భాస్కర్ అధ్యక్షత వహించారు. ఎపిడికెఎస్ రాష్ట్ర అధ్యక్షులు ఎమ్‌డి.ఆనంద్ బాబు, జిల్లా కార్యదర్శి బి.కరుణాకర్ మాట్లాడారు. పింఛను నమోదు వయస్సును 45 ఏళ్లకు తగ్గించాలన్నారు. తరతరాలుగా అంటరానితనాన్ని, అవమానాన్ని భరిస్తూ సమాజానికి ఉపయోగపడే సాంప్రదాయ కళ డప్పు కళ అని పేర్కొన్నారు. పింఛను రూ.ఏడు వేలకు పెంచాలని కోరారు. మూడు సెంట్ల ఇంటి స్థలమిచ్చి ఇంటి నిర్మాణం చేపట్టాలన్నారు. డప్పు కళాకారునికి డప్పు, గజ్జలు, డ్రస్సు ప్రభుత్వమే ఇవ్వాలని కోరారు. అనంతరం డిఆర్‌ఒ వెంకటనారాయణమ్మకు వినతిపత్రం అందజేశారు. కెవిపిఎస్ నాయకులు విజయమ్మ, ఏసురాజు, ఆనంద్, దస్తగిరి, కౌతాళం మండల నాయకులు తాయప్ప, గోనెగండ్ల మండల అధ్యక్షులు మాణిక్యం, నందవరం మండల కార్యదర్శి చిన్నరాజు, మంత్రాలయం మండల కార్యదర్శి మారెప్ప, జిల్లా నాయకులు అంజి, సురేష్, కోసిగి మండల కార్యదర్శి హనుమంతు, పెద్ద హనుమంతు, కర్నూలు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఏసన్న, వెంకటేశ్వర్లు, ఓర్వకల్లు మండల కార్యదర్శి రామకృష్ణ, క్రిష్ణగిరి మండల నాయకులు మాదన్న, కల్లూరు మండల కార్యదర్శి గోపాల్ పాల్గొన్నారు.

మొక్కజొన్న రైతు అతలాకుతలం

- వర్షాలతో అష్టకష్టాలు
- కొనుగోలు కేంద్రాల్లేక దిగాలు
- ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన దుస్థితి


ఆరబెట్టిన మొక్కజొన్న వర్షానికి తడవకుండా టార్పన్లు కప్పుతున్న రైతులు

ప్రజాశక్తి- పార్వతీపురం

పార్వతీపురం మన్యం జిల్లాలో మొక్కజొన్న రైతులు అతలాకుతలమవుతున్నారు. అకాల వర్షాలతో అష్టకష్టాలు పడుతున్నారు. కొనుగోలు కేంద్రాల్లేక దిగాలు చెందుతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ప్రయివేటు వ్యాపారులకే అమ్ముకోవాల్సిన దుస్థితి ఏర్పడింది. క్వింటాలుపై రూ.500 వరకు నష్టానికి విక్రయించాల్సి వస్తోంది. జిల్లాలో వేలాది ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోంది. ఏడాదికి మూడు పంటల చొప్పున రైతులు సాగు చేస్తున్నారు. దిగుబడైన మొక్కజొన్న గింజలను బాగా ఆరబెట్టి అమ్మాల్సిన పరిస్థితి ఉండడంతో రైతులు పడుకులు, రోడ్ల పక్కన ఆరబెడుతున్నారు. వర్షాలు పడుతుండడంతో ఆరబెట్టిన జొన్న గింజలు తడిసిపోయే పరిస్థితి నెలకొంది. జిల్లాలోని 15 మండలాల్లోనూ మొక్కజొన్న సాగు విస్తారంగా జరుగుతోంది. మెట్ట భూముల్లో ఎక్కువగా ఈ పంటనే పండిస్తున్నారు. దిగుబడులు ఆశాజనకంగా ఉండడంతో రైతులు దీనివైపు మొగ్గు చూపుతున్నారు. సాలూరు, పాచిపెంట, మక్కువ మండలాల్లో విస్తారంగా సాగు చేస్తున్నారు. ఇప్పటికే మొక్కజొన్న దిగుబడి వచ్చింది. అమ్మకానికి రైతులు సిద్ధం చేస్తున్నారు. పండిన పంటను ఇళ్లల్లో నిల్వ చేసుకోలేక రైతులు ఆరుబయట ప్రదేశాల్లో టార్పాలిన్లు కప్పి దాచుకోవాల్సి వస్తోంది. ఆకస్మిక వర్షాలకు జొన్నలు తడిసిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. గత కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆరుబయట ఎండబెట్టిన జొన్నలు కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు.

ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాకు రూ.2,400 ఉన్నప్పటికీ కొనుగోలు చేసే నాధుడు లేరు. దీంతో, రైతులు తక్కువ ధరకు ప్రయివేటు వ్యాపారులకు విక్రయించాల్సి వస్తోంది. నాణ్యత, తేమ శాతం వంటి కారణాలను సాకుగా చూపి వ్యాపారులు వారికి నచ్చిన వరకు కొనుగోలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం పంట దిగుబడి ఎక్కువగా ఉండడంతో వ్యాపారులు క్వింటాలు జొన్నలు సుమారు రూ.2 వేలకే కొనుగోలు చేస్తున్నారు. నిల్వ చేసుకునే సామర్థ్యం లేకపోవడంతో రైతులు నష్టానికైనా వ్యాపారులకే అమ్ముతున్నారు.

కొనుగోలు కేంద్రాలేవీ?

జిల్లాలో విస్తారంగా మొక్కజొన్న సాగు జరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. జిల్లాలో వరి తర్వాత ఎక్కువగా పండించే పంట మొక్కజొన్న అయినప్పటికీ మార్కెటింగ్ శాఖ అధికారులు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడం లేదు. ఆరుగాలం శ్రమించి పండించిన పంటకు గిట్టుబాటు ధర లభించక రైతులు నష్టపోతున్నారు. ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని మొక్కజొన్న రైతులు కోరుతున్నారు.

బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారు

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్టు

శ్రీశైలంలో దసరా మహోత్సవాలు రెండోరోజుకు చేరుకున్నాయి. మంగళవారం శ్రీ భ్రమరాంబ దేవి బ్రహ్మచారిణి అలంకారంలో అమ్మవారిని అలంకరించారు. ఉత్సవాలలో స్వామి అమ్మవార్లకు నిర్వహిస్తున్న వాహన సేవలలో భాగంగా సాయంత్రం మయూరవాహన సేవను నిర్వహించారు. గ్రామోత్సవంలో పలు జానపద కళాకారుల ప్రదర్శనలు అలరించాయి. అలాగే ఆలయ దక్షిణ మాఢవీధిలో నిత్య కళారాధన వేదిక వద్ద యాత్రికుల కోసం పలు ధార్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.



సత్యేంద్ర జైన్‌కు షాక్

- మరో రూ.7.44 కోట్ల ఆస్తులను జప్తు చేసిన ఇడి

న్యూఢిల్లీ : ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు సత్యేంద్ర జైన్‌తో సంబంధం ఉన్న కంపెనీల ఆస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) మనీలాండరింగ్ చట్టం కింద జప్తు చేసింది. తాజాగా అటాచ్ చేసిన ఆస్తుల మొత్తం విలువ సుమారు రూ.7.44 కోట్లు ఉంటుందని అంచనా. సత్యేంద్ర జైన్, ఆయన సతీమణి పూనమ్ జైన్‌తో సహా ఇతరులుపై ఆదాయానికి మించి ఆస్తులు కేసును ఇడి విచారిస్తోంది. 2018లో సత్యేందర్ జైన్ యాజమాన్యంలోని, నియంత్రణలో ఉన్న కంపెనీలకు చెందిన రూ.4.81 కోట్ల విలువైన స్థిరాస్తులను ఇడి తాత్కాలికంగా జప్తు చేసింది. ఈ కేసులో సమాచారాన్ని ఇడి సిబిఐతో పంచుకుంది. ఈ సమాచారం ఆధారంగా సిబిఐ కేసును మరింత దర్యాప్తు చేసింది. ఢిల్లీ మంత్రిగా ఉన్న కాలంలో సత్యేంద్ర జైన్ సంపాదించిన ఆస్తులను వివరిస్తూ అనుబంధ ఛార్జ్ షీట్ దాఖలు చేసింది. ఆ అనుబంధ ఛార్జ్ షీట్ తర్వాత ఇడి రూ.7.44 కోట్ల విలువైన స్థిరాస్తులను గుర్తించి అటాచ్ చేసింది. ఈ కేసులో ఇప్పటివరకు ఇడి మొత్తం రూ.12.25 కోట్లు అటాచ్ చేసింది. ఈ కేసులో ఇడి త్వరలోనే అనుబంధ ప్రాసిక్యూషన్ ఫిర్యాదు దాఖలు చేయనున్నది.

శాంతి, సహకారాలకే పెద్ద పీట !

- ఎలాంటి ప్రపంచాన్ని నిర్మించుకుందామో నిర్ణయించుకోవాలి
- యుఎన్‌జిఎ సమావేశాలను ప్రారంభిస్తూ గుటెరస్ పిలుపు



న్యూయార్క్ : శాంతి, సహకారాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ పిలుపిచ్చారు. చరిత్రలో నిర్ణయాత్మక పరిస్థితులు తలెత్తినపుడు స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుందని ఆయన నేతలను కోరారు. మంగళవారం యుఎన్‌జిఎ 80 వార్షిక సమావేశాలను ప్రారంభిస్తూ ఆయన ప్రసంగించారు. గందరగోళ పరిస్థితుల సమయంలో సహకారం, అరాచకం నెలకొన్నపుడు చట్టం, ఘర్షణలపుడు శాంతికి ప్రాధాన్యతనివ్వాలని భావిస్తూ వ్యవస్థాపక సూత్రాలుగా వాటిని పేర్కొంటూ 80ఏళ్ళ నాడు ఐక్యరాజ్య సమితి ఏర్పడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాటి నిబద్ధతకు 'హృదయ స్పందన'వంటిది ఈనాటి అసెంబ్లీ అని ఆయన వ్యాఖ్యానించారు. నైతికతకు దిక్సూచి,అంతర్జాతీయ చట్టాలకు సంరక్షకురాలు, సుస్థిర అభివృద్ధికి ఉత్ప్రేరకం వంటిది ఐక్యరాజ్య సమితి అని నేతలకు గుర్తు చేశారు. ఎనిమిది దశాబ్దాలు గడిచిపోయాయి, కానీ మనందరం కలిసి నిర్మించుకోవడానికి ఎటువంటి ప్రపంచాన్ని ఎంచుకుందాం? అని ఆయన ప్రశ్నించారు. సరైన ఎంపికలు, నిర్ణయాలు తీసుకుంటే సరిపోదని, వాటిని ఆచరణలో పెట్టడానికి నేతలు ధైర్య సాహసాలు కూడగట్టుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జనరల్ అసెంబ్లీ సమావేశాల్లో సాధారణ చర్చ ప్రారంభమైంది. పలు దేశాల అధ్యక్షులు ప్రసంగించనున్నారు. సాంప్రదాయానుసారం తొలుత బ్రెజిల్ అధ్యక్షుడు ప్రసంగిస్తారు. ఆ తర్వాత ఈ సమావేశాలకు ఆతిథ్యమిస్తున్న దేశం అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రసంగిస్తారు. మొత్తంగా ప్రపంచనేతలు పెద్ద సంఖ్యలో కొలువుదీరి వుండడంతో ఐక్యరాజ్య సమితి కేంపస్ లోపల, బయటా భద్రతను కట్టుదిట్టం చేశారు.

మా ముందే హాజరుపర్చండి : పోలీసులకు ఆదేశం

ప్రజాశక్తి - అమరావతి

వైసిపి వాలంటీర్ విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచాల సౌందరరెడ్డి అలియాస్ సవీంద్రరెడ్డిని నిర్బంధం కేసులో పోలీసుల తీరును హైకోర్టు తప్పుపట్టింది. బుధవారం తమ ముందు హాజరు పరచాల్సిందేనని గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల పోలీసులను ఆదేశించింది. వేరే కేసులో అరెస్ట్ చేశామని చెప్పి కింది కోర్టు లో హాజరు పర్చడానికి వీల్లేదని చెప్పింది. ఇలాంటి పరిస్థితులే ఉంటే తమ వద్దనే హాజరు పర్చాలంది. గుంటూరు జిల్లా, తాడేపల్లి పోలీసులు తన భర్తను అక్రమంగా నిర్బంధించారంటూ సౌందరరెడ్డి భార్య లక్ష్మీ ప్రసన్న మంగళవారం అత్యవసర పిటిషన్ దాఖలు చేశారు. దీనిని జస్టిస్ రఘునందన్‌రావు విచారించి పైవిధంగా ఉత్తర్వులను జారీ చేశారు.

ఏచూరి ఆశయ సాధనకు కృషి

- సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం

ప్రజాశక్తి - పాలకొల్లు

కమ్యూనిస్టు యోధుడు సీతారాం ఏచూరి ఆశయ సాధనకుకృషి చేయాలని, అదే ఆయనకు నిజమైన నివాళి అని సిపిఎం రాష్ట్ర నేత మంతెన సీతారాం అన్నారు. మంగళవారం స్థానిక మహిళా భవనంలో ఏచూరి ప్రథమ వర్థంతి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా మంతెన సీతారాం మాట్లాడుతూ... అంతరాలు లేని సమాజం కోసం ఏచూరి ఎంతో కృషి చేశారన్నారు. ఉత్తమ పార్లమెంటేరియన్‌గా తన సేవలు అందించారని, ఇతర దేశాల్లో కమ్యూనిస్ట్ పార్టీలో తలెత్తే సంక్షోభాల నివారణకు చర్చల ద్వారా పరిష్కారం కోసం కృషి చేశారన్నారు. విద్యార్థి దశలోనే ప్రధానిని సైతం ఘెరావ్ చేసి సమస్యలపై పని చేశారన్నారు.

పరకామణిలో దోపిడీపై చర్యలు తీసుకోవాలి

- వర్ల రామయ్య

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

టిటిడిలోని పరకామణిలో జరిగిన దోపిడీపై సిఎం చంద్రబాబు వెంటనే చర్యలు తీసుకోవాలని టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు వర్ల రామయ్య కోరారు. టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై వెంటనే ఒక టీమ్ ఏర్పాటు చేసి దర్యాప్తు జరిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రైవేట్ డిగ్రీ కళాశాలల బంద్ వెనుక వైసిపి కుట్ర దాగి ఉందని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి నాదెండ్ల బ్రహ్మం చౌదరి విమర్శించారు. వైసిపి ప్రేరేపిత బంద్‌లో పాల్గొని ప్రభుత్వంపై విమర్శలు చేసిన కరస్పాండెంట్లపై సంబంధిత అనుబంధ విశ్వవిద్యాలయాల ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ఉచిత సలహాలొద్దు.. యూరియా ఇవ్వండి

- ఎపిసిసి అధ్యక్షులు షర్మిల

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రైతులకు ఉచిత సలహాలను కట్టిపెట్టి, యూరియా సరఫరా చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఎపిసిసి అధ్యక్షులు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. యూరియా సకాలంలో ఇవ్వడం చేతకాక, రోగాల పేరుతో రైతులను నింధించడం తగదని మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూరియా కొరతపై కూటమి ప్రభుత్వం చెప్పేవన్నీ కుంటి సాకులు, అవాస్తవాలని తెలిపారు. యూరియా ఎక్కువ వాడుతున్నారని, కేన్సర్‌కు కారణం అవుతున్నారని సిఎం చంద్రబాబు చెప్పడాన్ని తప్పుపట్టారు. అసెంబ్లీ వేదికగా రైతులకు ఉచిత సలహాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. రాష్ట్రానికి రావాల్సిన 6.65 లక్షల టన్నుల కోటాలో ఇంకా లక్ష టన్నులు ఇవ్వకుండా కేంద్రం చోద్యం చూస్తుంటే, ప్రధాని మోడీని నిలదీసే సత్తా లేక రైతులను తప్పుపట్టడం బాధాకరమని పేర్కొన్నారు.

నాసిరకం యూరియా

- గడ్డలు కట్టిన బస్తాలు
- లబోదిబోమంటున్న రైతులు

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

అనంతపురం జిల్లాలో యూరియా కోసం రైతుల అవస్థలు కొనసాగుతూనే ఉన్నాయి. 'పంట ఎండిపోతోంది ఒక్క బస్తా యూరియా అయినా ఇప్పించండి సారూ' అంటూ అన్నదాతలు వేడుకుంటున్నారు. రైతులు రోజుల తరబడి ఎదురు చూస్తే ఒకటి, రెండు బస్తాల యూరియా ఇస్తున్నారు. ఆర్‌ఎస్‌కెల్లో ఇచ్చిన యూరియా కూడా నాసిరకంగా ఉండడంతో రైతులు లబోదిబోమంటున్నారు. ఇచ్చేందే అరకొర అదీ నాసిరకమేనా అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కళ్యాణదుర్గం వ్యవసాయడివిజన్‌లో ఆర్‌ఎస్‌కెల ద్వారా రైతులకు నాణ్యతలేని యూరియాను అంటగట్టినట్లు బాధిత రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం సరఫరా చేస్తున్న రాష్ట్రీయ కెమికల్ ఫర్టిలైజర్స్ (ఆర్‌సికె) పేరుతో అందజేసిన బస్తాలలో ఏమాత్రం నాణ్యతలేన్నట్లు కనిపిస్తోంది. ఆర్‌ఎస్‌కెల్లో ఆర్‌సీకే బస్తాలలో యూరియాను పరిశీలిస్తే ఎర్రగా, నల్లగా, గడ్డలుకట్టి బస్తాను తాకడానికి కూడా వీలులేనంత దారుణంగా ఉంది. ఈ బస్తాలు విప్పిచూసిన రైతులు నాణ్యతలోపాన్ని చూసి విస్తుపోతున్నారు. యూరియా అందిందని సంతోషపడాలో, నాణ్యతలేనిది ఇచ్చినందుకు బాధపడాలో తెలియక రైతులు సతమతం అవుతున్నారు. నాణ్యతలేని యూరియాను ఉపయోగించినా ఫలితం ఉండదని రైతులు చెబుతున్నారు.

యూరియా కోసం రెండు నెలలుగా పడిగాపులు

అనంతపురం జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్‌లలో యూరియా కోసం రెండునెలలుగా రైతులు పడుతున్న అవస్థలు అన్నీఇన్ని కావు. ప్రధానంగా మొక్కజొన్న, వరి, అరటి పంటలు సాగుచేసిన రైతులకు యూరియా వాడకం అత్యంత అవసరం. ఈ నేపథ్యంలో యూరియా కోసం రైతులు ప్రయివేటు ఎరువుల డీలర్లు, వివిధ కంపెనీల దుకాణాల వద్ద పడిగాపులు కాశారు. ఇప్పటికీ అది కొనసాగుతోంది. రైతులు ఆర్‌ఎస్‌కెల్లో యూరియా తీసుకోవాలని వ్యవసాయాధి కారులు, ప్రజాప్రతినిధులు చేస్తున్న ప్రకటనల్లో ఏమాత్రం వాస్తవం లేకుండాపోయింది. కొన్ని ఆర్‌ఎస్‌కెలకు అరకొరగానే యూరియా వచ్చింది. కొరత కారణంగా రెండు బస్తాలు ఇవ్వాలని అధికారులు చెబుతున్నా ఒక్కొబస్తానే పంపిణీచేసి చేతులు దులుపుకున్నారు.



పంపిణీపై పొంతన లేని లెక్కలు

అనంతపురం జిల్లాలోని ఆరు వ్యవసాయ డివిజన్‌లలో 435 రైతుసేవా కేంద్రాలున్నాయి. ఆయా కేంద్రాలకు ఎన్ని బస్తాల యూరియా సరఫరాచేశారు.. ఎంతమంది రైతులకు పంపిణీ జరిగిందనేది వ్యవసాయశాఖ, మార్కెట్ అధికారులు గోప్యంగా ఉంచడంతోపాటు ఎవరైనా సమాధానమడిగితే దాటవేతదోరణి వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

యూరియా బాగోలేదు

రైతుసేవా కేంద్రంలో ఇటీవల తీసుకున్న యూరియా ఏమాత్రం బాగాలేదు. ఎర్రగా, నల్లగా, గడ్డలుకట్టి బస్తాముట్టులేని విధంగా ఉంది. విప్పి చూస్తే యూరియాపై అనుమానం ఉంది. గతంలో కొన్న యూరియాకు, ఇప్పుడు ఇచ్చిన యూరియాకు తేడా ఉంది. ఇది పంటలకు ఉపయోగ పడుతుందో లేదోనని అనుమానం పడుతున్నాం. బస్తాలపై వివరాలుకూడా సరిగాలేవు.

– చాముండమ్మ, మహిళారైతు, బోరంపల్లి.

గాయత్రీ దేవి అలంకారంలో దుర్గమ్మ

- పలువురు మంత్రులు సందర్శన



ఇంద్రకీలాద్రిపై సందర్శకుల రద్దీ

ప్రజాశక్తి - యంత్రాంగం

విజయవాడలో జరుగుతున్న దసరా ఉత్సవాల రెండో రోజైన మంగళవారం దుర్గమ్మను గాయత్రీ దేవి రూపంలో అలంకరించారు. 60,641 మంది యాత్రికులు దుర్గమ్మను దర్శించుకున్నారు. పలు రకాల సేవలు, దర్శన టికెట్ల రూపంలో రూ.25,48,725 ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. దుర్గమ్మను మంత్రులు వంగలపూడి అనిత, గుమ్మిడి సంధ్యారాణి, ఎస్.సవిత, ఎమ్మెల్యేలు పరిటాల సునీత, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, బండారు శ్రావణి శ్రీ, గల్లా మాధవి, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ దర్శించుకున్నారు. వారికి వేద పండితులు వేదాశీర్వచనం చేయగా, ఆలయ ఇఒ శీనా నాయక్ అమ్మవారి చిత్రపటం, తీర్థప్రసాదాలు అందజేశారు. ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ, పోలీసు కమిషనర్ ఎస్.వి. రాజశేఖరబాబు, విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర ఉత్సవాలను పర్యవేక్షిస్తున్నారు. దుర్గమ్మ దర్శనానికి వచ్చే వృద్ధులకు, వికలాంగులకు పోలీసు సేవాదళ్ బృందాలు నిరంతరం సేవలందిస్తున్నాయి. దర్శనం కోసం వచ్చే ప్రోటోకాల్ పరిధిలోకి వచ్చే ప్రజా ప్రతినిధులు, అధికారులు, వివిధ వ్యవస్థలకు చెందిన వారు ప్రతి రోజూ ఉదయం ఏడు నుంచి తొమ్మిది మధ్య, సాయంత్రం మూడు నుంచి ఐదు గంటల మధ్య మాత్రమే రావాలని ఆలయ ఇఒ శీనా నాయక్ స్పష్టం చేశారు. ప్రతి రోజూ సాయంత్రం 6.30 నుండి 7.30 వరకు ఆలయ శుద్ధి, నైవేద్యం, పంచ హారతుల సందర్భంగా బంగారు వాకిలి నుండి దుర్గమ్మ దర్శనానికి అనుమతిలేదన్నారు.

ప్రాణం తీసిన అప్పు

కంతులు కట్టలేక తనువు చాలించిన లారీ డ్రైవర్

ప్రజాశక్తి-గుత్తి

రెక్కలకష్టం చేసుకుని కుటుంబాన్ని పోషించుకోవాలకున్న ఆయన్ను అప్పులు వెంటాడాయి. ఎంత కష్టం చేసినా కనీసం కంతులు చెల్లించేందుకు కూడా డబ్బులు లేక నిత్యం కష్టాలను చవిచూశాడు. ఈనేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది ఆత్మహత్య చేసుకుని తణువు చాలించాడు. ఈ విషాద ఘటన గుత్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ఆర్థిక సమస్యలతో ఉరేసుకుని ఓ డ్రైవర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం గుత్తిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పట్టణంలోని స్టేట్‌బ్యాంక్ కాలనీలో నివాసం ఉండే ఈశ్వరరావు (48) లారీ డ్రైవర్ పని చేస్తూ జీవనం కొనసాగించేవారు. కొన్ని నెలల క్రితం ఓ ప్రయివేట్ ఫైనాన్స్ సంస్థలో రుణం కింద లారీని కొనుగోలు చేశారు. అయితే బాడుగలు లేక ఫైనాన్స్ కంపెనీకి నెలసరి కంతులు కట్టలేకపోయారు. దీంతో ఫైనాన్స్ కంపెనీ ప్రతినిధులు లారీని తీసుకెళ్లారు. దీనికితోడు కుటుంబ పోషణకు అప్పులు చేశారు. చేసిన అప్పులు తీర్చలేక ఉన్న లారీని ఫైనాన్స్ కంపెనీ తీసుకెళ్లడంతో మనస్థాపానికి గురైన ఈశ్వరరావు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పైకప్పుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నారు. ఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతునికి భార్య, పిల్లలు కలరు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



కృష్ణా నదికి వరద ఉధృతి

- మొదటి ప్రమాద హెచ్చరిక జారీ

ప్రజాశక్తి - విజయవాడ సిటీ

ప్రకాశం బ్యారేజీకి మరోసారి వరద పోటెత్తింది. శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల నుంచి వరద నీరు దిగువకు విడుదల చేస్తుండడంతో ప్రకాశం బ్యారేజీ వరద ఉధృతి కొనసాగుతోంది. 4.11 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉండడంతో అధికారులు మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేశారు. బ్యారేజీ 69 గేట్లను పైకి ఎత్తి దిగువకు 4.11 లక్షల క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. ఎపిఎస్‌డిఎంఎ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఎమ్‌డి ప్రఖర్ జైన్ ఎక్స్ (ట్విట్టర్) వేదికగా ఈ విషయాన్ని వెల్లడించారు. నది పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేశారు.

సమిష్టిగా చెలరేగిన బౌలర్లు

- కోన్‌స్టస్‌ను ఔట్ చేసిన సిరాజ్
- ఆస్ట్రేలియా-ఎ 350/9
- రెండో అనధికారిక టెస్ట్



అహ్మదాబాద్: ఆస్ట్రేలియా-'ఎ'తో మంగళవారం నుంచి ప్రారంభమైన రెండో అనధికారిక టెస్టులో ఇండియా-ఎ బౌలర్లు సమిష్టిగా చెలరేగారు. ఈ టెస్టులో టాస్ గెలిచిన ఆతిథ్య భారత్ తొలుత బౌలింగ్ ఎంచుకోగా.. కెప్టెన్ నమ్మకాన్ని భారత బౌలర్లు నిలబెట్టారు. దీంతో తొలిరోజు ఆట నిలిచే సమయానికి ఆస్ట్రేలియా-ఎ జట్టు 9వికెట్లు నష్టపోయి 350 పరుగులు చేసింది. తొలిరోజు 42 ఓవర్ల ఆట ముగిసే సరికి ఆసీస్ రెండు వికెట్ల నష్టానికి 137 పరుగులు చేసింది. సామ్ కొన్‌స్టాస్ (49) ఫర్వాలేదనిపించగా.. కాంప్‌బెల్ కెల్లావే (9) నిరాశపరిచాడు. కెప్టెన్ మెక్‌స్వీనీ అర్ధ శతకం (50), ఓలీవర్ పీక్ 25 పరుగులతో క్రీజులో నిలిచారు. ఓపెనర్ కాంప్‌బెల్ కెల్లావేను తొమ్మిది పరుగులకే పరిమితం చేశాడు. ప్రసిద్ బౌలింగ్‌లో షాట్ ఆడేందుకు ప్రయత్నించిన కెల్లావే సాయి సుదర్శన్‌కు క్యాచ్ ఇచ్చి పెవిలియన్ చేరాడు. అయితే, మరో ఓపెనర్, తొలి టెస్టులో సెంచరీ బాదిన సామ్ కొన్‌స్టాస్ మాత్రం క్రీజులో పాతుకుపోయే ప్రయత్నం చేశాడు. కెప్టెన్ నాథన్ మెక్‌స్వీనీతో కలిసి స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. ఈ క్రమంలో ఇద్దరూ హాఫ్ సెంచరీలకు చేరువైన వేళ.. ఈ జంటను విడదీయడానికి భారత బౌలర్లు ప్రయత్నించారు.

కొన్‌స్టాస్‌ను ఔట్ చేసిన సిరాజ్

ఈ నేపథ్యంలో భోజన విరామ సమయం తర్వాత సిరాజ్ ఈ ప్రయత్నంలో సఫలమయ్యాడు. అర్ధ శతకానికి ఒక పరుగు దూరంలో ఉన్నవేళ కొన్‌స్టాస్‌ను అవుట్ చేశాడు. సిరాజ్ బౌలింగ్‌లో వికెట్ కీపర్ క్యాచ్‌గా కొన్‌స్టాస్ వెనుదిరిగాడు. మొత్తంగా 91 బంతులు ఎదుర్కొన్న ఈ కుడిచేతి వాటం బ్యాటర్ ఏడు ఫోర్ల సాయంతో 49 పరుగులు చేశాడు. భారత కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ జట్టు నుంచి వైదొలగడంతో అతడి స్థానంలో టీమిండియా వికెట్ కీపర్ బ్యాటర్ ధ్రువ్ జురెల్ సారథిగా బాధ్యతలు చేపట్టాడు. వెస్టిండీస్‌తో స్వదేశంలో టెస్టు సిరీస్ నేపథ్యంలో టీమిండియా సీనియర్లు కేఎల్ రాహుల్, మహ్మద్ సిరాజ్ కూడా ఆసీస్-'ఎ'తో మ్యాచ్‌లో బరిలోకి దిగారు. ఇండియా-ఎ బౌలర్లు మానవ్ సుతార్‌కు ఐదు, గుర్నూర్ బార్‌కు రెండు, సిరాజ్, ప్రసిధ్ కృష్ణకు ఒక్కో వికెట్ దక్కాయి.

బెట్టింగ్ యాప్ కేసులో ఇడి కార్యాలయానికి యువరాజ్ సింగ్

న్యూఢిల్లీ: ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌తో లింకున్న మనీ ల్యాండరింగ్ కేసులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) ముందు టీమిండియా మాజీ క్రికెటర్ యువరాజ్ సింగ్ హాజరయ్యాడు. బెట్టింగ్ యాప్1×బెట్ కేసులో దర్యాప్తు కొనసాగుతున్న విషయం తెలిసిందే. 43 ఏళ్ల యువీ తెలుపు రంగు టీషర్ట్, పాంట్‌లో ఇడి ఆఫీసుకు వచ్చాడు. సెంట్రల్ ఢిల్లీలో ఉన్న ఇడి కార్యాలయానికి 12 గంటలకు చేరుకున్నాడు. తన లీగల్ బృందంతో యువీ ఇడి ఆఫీసుకు వెళ్లాడు. మాజీ లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్‌ను ఇడి అధికారులు పలు ప్రశ్నలు సంధించగా.. వాటన్నిటికీ యువరాజ్ సింగ్ సమాధానమిచ్చాడు. ఆయన ఇచ్చిన వాంగ్మూలాన్ని ఇడి అధికారులు రికార్డు చేశారు. పీఎంఎల్‌ఏ కేసులో యువీని ప్రశ్నించారు. ఇదే కేసులో ఇన్‌ఫ్లుయెన్సర్ అన్వేషి జైన్ కూడా మంగళవారం ఇడి ముందు హాజరయ్యాడు.

గ్రామ వ్యవసాయ సహాయకుడి చేతివాటం..!

- రైతులతో డబ్బులు కట్టించుకుని పరార్
- రూ.10,01,320 నగదు స్వాహా చేసినట్లు సమాచారం
- పోలీసులకు బాధిత రైతుల ఫిర్యాదు

ప్రజాశక్తి-బ్రహ్మసముద్రం

బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన ఓ సచివాలయ ఉద్యోగి చేతివాటం ప్రదర్శించారు. విత్తనాలు, ఎరువులు, వ్యవసాయ పరికరాలు అందిస్తానని రైతులకు చెప్పి గ్రామ వ్యవసాయ సహాయకుడు వారితో పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశాడు. రైతులతో తీసుకున్న సొమ్ము ప్రభుత్వానికి జమ చేయకుండా తన సొంతానికి వాడుకుని, ఆపై తప్పించుకుని తిరుగుతున్నాడు. మోసపోయామని గ్రహించిన రైతులు మోసం చేసిన బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి గ్రామ సచివాలయంలో గ్రామ వ్యవసాయ సహాయకుడుగా విధులు నిర్వహిస్తున్న విద్యాసాగర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇందుకు సంబంధిచి బాధిత రైతులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి...

బ్రహ్మసముద్రం మండలం కన్నేపల్లి గ్రామ సచివాలయంలో విద్యాసాగర్ గ్రామ వ్యవసాయ సహాయకుడిగా విధులు నిర్వహిస్తున్నారు. ఈయన కన్నేపల్లి, ముద్దలాపురం, గుడిపల్లి, బుడిమేపల్లి తదితర గ్రామాలకు చెందిన రైతుల వద్ద యూరియా, వేరుశనగ, డ్రిప్ పైపులు, పివిసి పైపులు, వ్యవసాయ యంత్రాలైన ట్రాక్టర్, రోటివేటర్, టిల్లర్లు వివిధ రాయితీ పరికాలు ఇప్పిస్తానని నమ్మబలికి లక్షల్లో డబ్బులు తీసుకున్నాడు. బుడిమేపల్లి గ్రామానికి చెందిన 13 మంది రైతుల నుంచి రూ.4,03,250, గుడిపల్లి గ్రామంలో 23 మంది నుంచి రూ.3,23,070, ముద్దలాపురంలో ఐదుగురు నుంచి రూ.1,25,000, కన్నేపల్లిలో ఐదుగురు నుంచి రూ.1,50,000, ఇలా 46 మంది రైతుల నుంచి సుమారు రూ.10,01,320 నగదును తీసుకున్నారు. సదరు ఉద్యోగి రైతుల నుంచి తీసుకున్న నగదును ఏపీ సీడ్స్‌కు జమ చేయకుండా సొంత ఖర్చులకు వాడినట్లు తెలుస్తోంది. డబ్బులు ఇచ్చిన రైతులు పలుమార్లు ఆయన్ను అడిగినా పొంతలేని సమాధానం ఇస్తూ వచ్చాడు. ప్రస్తుతం ఆయన కన్పించకుండా తప్పించుకుని తిరుగుతున్నాడు. మోసపోయామని తెలుసుకున్న రైతులు మంగళవారం నాడు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆగస్ట్, సెప్టెంబర్ నెలలకు సంబంధించిన సామాజిక భద్రతా పింఛన్ల పంపిణీ చేసి అనంతరం మిగిలిన రూ.80వేలను కూడా ప్రభుత్వ ఖజానాకు జమచేయనట్లు తెలుస్తోంది. దీనిపై కూడా పంచాయతీ కార్యదర్శి యోగేష్ విద్యాసాగర్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

గతంలోనూ స్వాహా పర్వం

గతంలో పడమటి కోడిపల్లి గ్రామ సచివాలయ కేంద్రంలో అప్పట్లో విధులు నిర్వహిస్తున్న వరుణ్ (ప్రస్తుతం బదిలీ) వేరుశనగ విత్తనాల కోసం రైతుల నుంచి రూ.3.69లక్షలు తీసుకుని ప్రభుత్వానికి చెల్లించకుండా సొంతానికి వినియోగించినట్లు ఫిర్యాదులు వచ్చాయి. ఇందులో ఆయన రూ.1.60లక్షలు ప్రభుత్వానికి చెల్లించినట్లు సమాచారం. ఇంకా రూ.2.90 లక్షలు ప్రభుత్వానికి చెల్లించాల్సి ఉంది. బాధ్యతగా విధులు నిర్వహించాల్సిన సచివాలయ సిబ్బంది ఇలా రైతుల డబ్బులను కాజేసి వెళ్లడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. ఉన్నతాధికారులు ఈ ఘటనలపై పూర్తి స్థాయి విచారణ జరిపి అక్రమాలకు పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని రైతులు కోరుతున్నారు.

ఈ విషయంపై వ్యవసాయ అధికారి గోపాల్‌ను ప్రజాశక్తి వివరణ కోరగా బాధిత రైతులు తమ దగ్గరకు వచ్చి ఫిర్యాదు చేయలేదన్నారు. తమ వద్ద ఉన్న సమాచారాన్ని జిల్లా అధికారులకు పంపనున్నట్లు తెలియజేశారు.

జిఎస్‌టి అసిస్టెంట్ కమిషనర్ సుభాష్ సస్పెండ్

ప్రజాశక్తి - అమరావతి : వస్తు, సేవల పన్ను (జిఎస్‌టి) అసిస్టెంట్ కమిషనర్ సుభాష్‌ను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం నాడు కీలక నిర్ణయం తీసుకుంది. 'రాజధాని అమరావతి..మునిగిపోయింది' అని పేర్కొంటూ సామాజిక మాధ్యమాల వేదికగా ఆయన కొన్ని ఫోటోలు చేసిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. సోషల్ మీడియాలో సుభాష్ పోస్టులకు సంబంధించి ప్రభుత్వానికి పలు ఫిర్యాదులు రావడంతో ఆయనను వివరణ కోరగా..ఇది తన వ్యక్తిగత అభిప్రాయమని సుభాష్ బదులు ఇచ్చారు. ఆయన వివరణ సంతృప్తికరంగా లేదని పేర్కొంటూ సస్పెండ్ చేస్తున్నట్లు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

రైల్వేలో నూతన ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థ

న్యూఢిల్లీ : భారత రైల్వే త్వరలో నూతన ఆటోమేటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకునిరానుంది. మన రైల్వే ఇప్పటికే అనేక చోట్ల పాత విధానంలోనే సిగ్నలింగ్ వ్యవస్థను అమలు చేస్తోంది. పాత సిగ్నలింగ్ ప్రకారం ఒక ట్రాక్‌పై రైలు ఒక స్టేషన్ నుంచి బయలుదేరి ఆ తర్వాత స్టేషన్‌ను దాటేవరకు ఆ మార్గంలో మరో రైలును అనుమతించరు. దాంతో రైళ్లరాకపోకలు బాగా ఆలస్యమై ప్రయాణికులు అవస్థలు పడుతుంటారు. దీంతో రైల్వేశాఖ సరికొత్త ఆటోమాటిక్ సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తేబోతోంది. ఈ విషయాన్ని రైల్వే అధికారి నవీన్ కుమార్ వెల్లడించారు. కొత్త సిగ్నలింగ్ వ్యవస్థలో ఒక స్టేషన్ నుంచి మరొక స్టేషన్‌కు క్రమం తప్పకుండా సిగ్నల్స్ చేరుతాయన్నారు. అందువల్ల ఒక రైలు సిగ్నల్‌ను దాటగానే మరో రైలు సిగ్నల్‌ను అందుకొని ట్రాక్‌పైకి వస్తుందని చెప్పారు. గతంలో మొదటి రైలు బ్లాక్ సెక్షన్‌ను దాటే వరకు మరొక రైలును అనుమతించే అవకాశం ఉండేది కాదని నవీన్ కుమార్ అన్నారు. కొత్త సిగ్నలింగ్ వ్యవవస్థతో తక్కువ సమయంలో ప్రయాణికులకు ఎక్కువ రైళ్లను అందుబాటులోకి తీసుకురావచ్చని చెప్పారు. ఇటీవల ప్రయోగపూర్వకంగా తూర్పు కోస్ట్ రైల్వే.. తాల్చేర్-పారదీప్ ఫ్రైట్ కారిడార్‌లోని కటక్-పారదీప్ ప్రాంతాల మధ్య ఈ అత్యాధునిక సిగ్నలింగ్ వ్యవస్థను విజయవంతంగా ప్రారంభించింది.

కేరళను ఒక నమూనాగా మార్చాలి

సిపిఐ జాతీయ మహాసభ పిలుపు



ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నాయకత్వంలో కేరళలో అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను దేశానికే ఒక నమూనాగా మార్చాలని సిపిఐ 25వ జాతీయ మహాసభ పిలుపునిచ్చింది. మహాసభలో భాగంగా మంగళవారం జరిగిన బహిరంగ చర్చలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కేరళలోని వివిధ సంక్షేమ పథకాలను ప్రశంసించారు. కేరళను తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా మార్చడం, ఓనం పండుగ సమయంలో అద్భుతంగా పనిచేసిన ఆ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థను పుదుచ్చేరి ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రశంసించారు. రాజకీయ తీర్మానం, నిర్మాణ, సమీక్ష నివేదికలపై చర్చ మంగళవారం పూర్తి అయింది. బుధవారం ప్రతినిధులు మూడు కమిషన్‌లుగా విభజించి చర్చించనున్నారు. చర్చలో చేసిన సూచనలతో సహా ముసాయిదా రాజకీయ నివేదికకు సవరణలు చేయబడతాయి. జాతీయ కమిటి, కార్యనిర్వాహక, ప్రధాన కార్యదర్శి, సెక్రటేరియట్ ఎన్నిక తరువాత మహాసభ గురువారం ముగుస్తుంది.

కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ఇండియా బ్లాక్ పురోగతి లేదు

సిపిఐ జాతీయ కార్యనిర్వాహక సభ్యుడు, రాజ్యసభ ఎంపి పి. సంతోష్ కుమార్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పురోగతి సాధించడం లేదని అన్నారు. అయితే సమిష్టివాదాన్ని సమర్థించే రాజకీయాలు విఫలమవుతున్నాయని దీని అర్థం కాదని అన్నారు. ఇండియా బ్లాక్ అనేది బిజెపి వ్యతిరేక ఫ్రంట్‌కు ప్రస్తుత పేరని అన్నారు. ఆ సమిష్టిని వదిలివేయడం లేదా సిపిఐ ఒంటరిగా పోటీ చేయడమనేది పరిశీలనలో ఉన్న అంశం కాదని అన్నారు. మన సమాజంలోని అధిక శాతం విశ్వాసులను తప్పుదారి పట్టించే కొన్ని ఉపాయాలు బిజెపికి ఉన్నందున అది కొంతవరకు ముందుకు సాగగలిగిందని విమర్శించారు. దానికి అనుగుణంగానే కేరళ సమాజంలో కూడా కొన్ని జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని అన్నారు. దేశంలో వామపక్షాలు కేరళ నమూనాతో గుర్తింపు పొందాయన్నారు. ఆ నమూనా అన్ని రాష్ట్రాలలో ప్రచారం చేస్తామని తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి దేశ రాజకీయాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రోత్సహించే మతతత్వాన్ని, అదే విధంగా మతతత్వాన్ని ప్రోత్సహించే వారిని సమాన శక్తితో వ్యతిరేకించే నాయకుడని పేర్కొన్నారు. ఆయన లౌకిక వైఖరిపై తమకు ఎటువంటి సందేహం లేదని, అలాంటి సందేహానికి ఎటువంటి సంబంధం లేదని వివరించారు. వివిధ దశలలో రాజకీయంగా సరైనదిగా అనిపించే అభిప్రాయాలను ఆయన వ్యక్తం చేశారని అన్నారు.



చైనాకు సిపిఎం ప్రతినిధి బృందం

న్యూఢిల్లీ : సిపిఎం ప్రధాన కార్యదర్శి ఎం.ఎ.బేబీ నేతృత్వంలో ఆరుగురు సభ్యుల ప్రతినిధి బృందం సోమవారం అర్ధరాత్రి బీజింగ్‌కు బయలుదేరి వెళ్ళింది. ఈ నెల 23 నుండి 30వరకు ఈ బృందం చైనాలో పర్యటిస్తుంది. చైనా కమ్యూనిస్టు పార్టీ అంతర్జాతీయ విభాగం ఆహ్వానం మేరకు వారు చైనాలో పర్యటిస్తున్నారు. ఈ ప్రతినిధి బృందంలో బేబీతో పాటు పొలిట్‌బ్యూరో సభ్యులు మహ్మద్ సలీం, జితేంద్ర చౌదరి, ఆర్.అరుణ్ కుమార్, కేంద్ర కమిటీ సభ్యులు కె.హేమలత, సి.ఎస్.సుజాత వున్నారు. సిపిఎం, సిపిసి మధ్య పరస్పర మార్పిడులు, అవగాహనా కార్యక్రమాల్లో భాగంగానే సిపిఎం ప్రతినిధి బృందం పర్యటిస్తోంది. ఈ పర్యటనలో చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంతో ప్రతినిధి బృందం చర్చలు జరుపుతుంది.

యుపిలో మదరసాలపై దర్యాప్తు బ్రేక్

ఇఓడబ్ల్యూ విచారణపై స్టే విధించిన హైకోర్టు

లక్నో : ఉత్తరప్రదేశ్‌లోని 558 ఎయిడెడ్ మదరసా లపై ఆర్థిక నేరాల విభాగం (ఇఓడబ్ల్యు) చేపట్టిన దర్యాప్తును అలహాబాద్ హైకోర్టు అడ్డుకుంది. ఈ విచారణపై అలహాబాద్ హైకోర్టు స్టే విధించింది. ఆ మదరసాలకు వ్యతిరేకంగా మహ్మద్ తల్హా అన్సారి అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా జాతీయ మానవ హక్కుల కమిషన్ ఇచ్చిన ఆదేశాల మేరకు మానవ హక్కుల ఉల్లంఘన ఆరోపణలపై ఇఓడబ్ల్యు దర్యాప్తు నిర్వహిస్తోంది. అయితే ఎన్‌హెచ్‌ఆర్‌సి ఆదేశాలను అలాగే ప్రస్తుతం సాగుతున్న దర్యాప్తును సవాలు చేస్తూ అలహాబాద్ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 28, జూన్ 11తేదీల్లో ఎన్‌హెచ్‌ఆర్‌సి ఇచ్చిన ఆదేశాలను కొట్టివేయాలని ఆ పిటిషన్ కోరింది. అలాగే విచారణ చేపట్టాల్సిందిగా ఏప్రిల్ 23న ప్రభుత్వం ఇచ్చిన ఆదేశాలను కూడా కొట్టివేయాలం టూ ఆ పిటిషన్ కోరింది. జస్టిస్ సరల్ శ్రీవాత్సవ, జస్టిస్ అమితాబ్ కుమార్ రాయ్‌లతో కూడిన డివిజన్ బెంచ్ సోమవారం ఈ స్టే ఉత్తర్వులు జారీ చేస్తూ, ఎన్‌హెచ్‌ఆర్‌సి కి, అలాగే ఫిర్యాదీదారునికి నోటీసులిచ్చింది. తదుపరి విచారణను నవంబరు 17కి వాయిదా వేసింది. మానవ హక్కుల ఉల్లంఘనలు జరిగాయని చెబుతున్న చర్య ఎప్పుడు జరిగిందో తేదీని ఫిర్యాదులో ప్రస్తావించలేదని, అలాగే పేర్కొన్న అభ్యంతరాలు కూడా చాలా అస్పష్టంగా వున్నాయని పిటిషన్ పేర్కొంది. ఉల్లంఘన జరిగిందని చెబుతున్న ఏడాదిలోగానే ఈ ఫిర్యాదు దాఖలైందా లేదా అనేది కూడా నిర్ధారించడానికి సాధ్యం కావడం లేదని పేర్కొంది.అందువల్ల కమిషన్ చేపట్టిన ఈ మొత్తం కసరత్తు అంతా అధికార పరిధికి వెలుపలనే వుందని పిటిషన్ పేర్కొంది. దీనిపై నాలుగు వారాల్లోగా స్పందించాల్సిందిగా కోరుతూ కోర్టు వారికి నోటీసులు జారీ చేసింది.



విజయవాడలో ధర్నా చౌక్ వద్ద కార్యక్రమంలో మాట్లాడుతున్న కె ఉమామహేశ్వరరావు

12వ పిఆర్‌సి ప్రకటించాలి

- సమ్మెకాలపు ఒప్పందాలు అమలు చేయాలి
- ధర్నాలో ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి
- కె ఉమామహేశ్వరరావు డిమాండ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్రంలో కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులతో సహా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదురుచూస్తున్న 12వ పిఆర్‌సిని కూటమి ప్రభుత్వం వెంటనే ప్రకటించాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు డిమాండ్ చేశారు. వెంటనే జీతాలు పెంచాలని, డిఎ, సరెండర్ లీవ్ బకాయిలు చెల్లించాలన్నారు. విజయవాడలోని ధర్నా చౌక్‌లో ఫెడరేషన్ ఆధ్వర్యాన మంగళవారం నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ మేరకు జులైలో జరిగిన సమ్మె కాలానికి మున్సిపల్ కార్మికులకు వెంటనే జీతం చెల్లించాలన్నారు. 17 రోజుల సమ్మె సందర్భంగా ఒప్పందాలకు జిఓలు జారీ చేయాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన 13 గంటల పని దినాన్ని రద్దు చేయాలని, మహిళలతో రాత్రి షిఫ్టుల్లో పని చేయించే విధానానికి స్వస్తి పలకాలని డిమాండ్ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన, అనారోగ్యం బారిన పడిన, మరణించిన మున్సిపల్ కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు ఇవ్వాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వర్తింపజేయాలని కోరారు. ఎన్‌ఎంఆర్, బదిలీ, కోవిడ్, గార్బేజ్ కార్మికులకు రూ.21 వేలు, క్లాప్ డ్రైవర్లకు రూ.24,500 జీతాలు చెల్లించాలని, పట్టణాల విస్తరణ మేరకు సిబ్బంది సంఖ్యను పెంచాలని తదితర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ వర్కర్ల న్యాయమైన డిమాండ్ల పరిష్కారంలో ప్రభుత్వం నిర్లక్ష్యాన్ని విడనాడాలన్నారు. కార్మికుల సమస్యలపై ఈ శాసనసభ సమావేశాల్లో చర్చించాలని కోరారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికుల సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కరించకుండా తమది మంచి ప్రభుత్వం అని చెప్పుకోవడం సమంజసం కాదన్నారు. ఆప్కాస్‌లో పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన వారికి బెనిఫిట్స్ ఇస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. మున్సిపల్ కార్మికుల డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన ఉధృతం చేస్తామని చెప్పారు. ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు టి నూకరాజు మాట్లాడుతూ.. రోజురోజుకూ పట్టణాలు విస్తరిస్తున్నప్పటికీ సిబ్బంది సంఖ్యను పెంచకుండా ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తూ పని చేస్తున్న కార్మికులపై భారాన్ని మోపుతుందన్నారు. పాలకుల వారసులకు పదవులు కావాలంటున్నారని, మున్సిపల్ కార్మికులకు వారసత్వపు హక్కు చెల్లదంటున్నారని తెలిపారు. మున్సిపల్ కార్మికుల ధర్నాకు సంఘీభావం తెలిపిన కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అండ్ర మాల్యాద్రి మాట్లాడుతూ.. దళితులుగా ఉన్న కార్మికులకు ఉచితంగా అందాల్సిన 200 యూనిట్ల విద్యుత్‌ను ఎక్కడా అమలు చేయడం లేదన్నారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సుందరయ్య మాట్లాడుతూ.. లేబర్ కోడ్స్‌కు వ్యతిరేకంగా కార్మికవర్గం పోరాడాలని, 12వ పిఆర్‌సి కోసం సంయుక్తంగా ఉద్యమిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమానికి ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె సామ్రాజ్యం అధ్యక్షత వహించారు.

యుద్ధాలు ఆపేందుకు ఐరాస ఏం చేసింది ?

- నేను ఏడు మాసాల్లో ఏడు యుద్ధాలను అపాను యుఎన్‌జిఎ సమావేశాల్లో ట్రంప్ ప్రసంగం
- వాతావరణ మార్పులపై పోరు అతిపెద్ద మోసమని వ్యాఖ్య



న్యూయార్క్ : ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న యుద్ధాలను ఆపడానికి ఐక్యరాజ్య సమితిని ఏం చేసిందని అమెరికా అధ్యక్షులు ట్రంప్ ప్రశ్నించారు. తాను అధ్యక్షుడినైన తర్వాత కేవలం ఏడు మాసాల వ్యవధిలోనే భారత్-పాకిస్తాన్ మధ్య యద్ధంతో పాటు అడ్డూ అదుపు లేకుండా సాగుతున్న ఏడు యుద్ధాలను అంతమొందించానని పునరుద్ఘాటించారు. అలాగే, గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించే ప్రయత్నాలను కూడా ఆయన తీవ్రంగా నిరసించారు. వాతావరణ మార్పులపై పోరాటం ఈ భూగోళంపై జరిగే అతిపెద్ద మోసమని వ్యాఖ్యానించారు. ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ వార్షిక సమావేశాల్లో మంగళవారం ట్రంప్ ప్రసంగించారు. పలు అంశాలపై తన వైఖరిని స్పష్టం చేశారు. ముఖ్యంగా ప్రపంచంలో యుద్ధాలేవీ ముగియడం లేదని, అలా సాగుతూనే వున్నాయని, వాటిల్లో కొన్ని యుద్ధాలు 31, 36ఏళ్ళుగా సాగుతునే వున్నాయన్నారు. ఈ యుద్ధాలన్నింటిలో వేలాదిమంది ప్రజలు మరణించారని, ఏ అధ్యక్షుడూ లేదా నాయకుడు కూడా వీటిని అడ్డుకోవడానికి చర్యలు తీసుకోలేదని చెప్పారు. కనీసం యుద్ధాలను పరిష్కరించడానికి ఐక్యరాజ్య సమితి కూడా సాయం చేయడానికి ప్రయత్నించలేదని ఆయన విమర్శించారు. కేవలం మాటలు చెబితే సరిపోదని, ఆ మాటలేవీ కూడా యుద్ధాలను ఆపలేవని ట్రంప్ వ్యాఖ్యానించారు. తాను ఏడు యుద్ధాలను ఆపినా ఐక్యరాజ్య సమితి నుండి ఒక్క ప్రశంస కూడా లేదని ట్రంప్ విమర్శించారు. తాను ఆపిన యుద్ధాలు ఇజ్రాయిల్-ఇరాన్, భారత్-పాకిస్తాన్, ర్వాండా-కాంగో, థాయిలాండ్-కంబోడియా, ఆర్మేనియా-అజర్‌బైజాన్, ఈజిప్ట్-ఇథియోపియా, సెర్బియా-కొసావోల మధ్య యుద్ధాలని ఆయన వివరించారు. ఇన్ని యుద్ధాలను అంతమొందించినందుకు తనకు నోబెల్ శాంతి బహుమతి రావాలని మరోసారి చెప్పుకున్నారు. కేవలం ఏడు మాసాల్లో తాను ఇదంతా చేశానన్నారు. మరే దేశమూ కూడా ఇంతలా చేయలేదన్నారు. ప్రపంచీకరణ వ్యవస్థలే ప్రపంచ వ్యవస్థను లేదా క్రమాన్ని దారుణంగా దెబ్బతీశాయన్నారు. అలాగే, వాతావరణ మార్పులపై పోరాటం అనేది అతిపెద్ద మోసపూరితమైన పని అని ట్రంప్ విమర్శించారు. ఇదొక హరిత ఇంధన కుంభకోణమన్నారు. రాజకీయంగా సరిదిద్దుకోవడానికి ప్రతీ ఒక్కరూ ఇది చేస్తూనే వుంటారు. కానీ మన చర్యల వల్ల వాతావరణంలోకి విడుదలయ్యే కర్బన ఉద్గారాల భావన బూటకమైనదని వ్యాఖ్యానించారు. మాదకద్రవ్యాల అక్రమరవాణాను అంతమొందిస్తామని ప్రతిన చేశారు. వెనిజులాకు చెందినవిగా ఆరోపణలు చేస్తున్న మూడు బోట్లను అమెరికా బలగాలు ధ్వంసం చేసిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. మాదకద్రవ్యాలను అమెరికాలోకి అక్రమంగా సరఫరా చేసే ప్రతి తీవ్రవాదిని నిర్మూలిస్తామనిఆయన హెచ్చరించారు.

వలసలే పెద్ద సమస్య

అడ్డూ అదుపు లేని వలసలు పెద్ద సమస్యేనని ట్రంప్ స్పష్టం చేశారు. బైడెన్ ప్రభుత్వం అనుసరించిన ఓపెన్ సరిహద్దు విధానాన్ని ఆయన విమర్శించారు. క్రిమినల్స్ వస్తే వారిని వెనక్కి పంపడం ఖాయమన్నారు. సరిహద్దుల మధ్య అనియంత్రిత వలసలకు ఐక్యరాజ్య సమితి మద్దతునిస్తోందని, ఐక్యరాజ్య సమితి వెంటనే ఇటువంటి ఆలోచనలకు నిధులు అందచేయడాన్ని నిలిపివేయాలని సూచించారు. దేశంలోకి ప్రవేశించే వ్యక్తుల సంఖ్యను మనం పరిమితం చేయాల్సి వుందని అన్నారు. 'గర్వించదగ్గ దేశాలు తమ దేశాలను, ఆచారాలను, మతాన్ని తామెన్నడూ చూడని ప్రజల నుండి రక్షించుకోవడానికి అనుమతించాలి.'అని అన్నారు. బహిరంగ సరిహద్దులు అనే నేరాన్ని తక్షణమే అంతం చేయాలన్నారు. లండన్‌కు ప్రస్తుతం భయంకరమైన మేయర్ వున్నారని ఈ సందర్భంగా ఆయన వ్యాఖ్యానించారు. వలసల కారణంగానే ఇది జరిగిందని పేర్కొన్నారు. లండన్ మేయర్ సాదిక్ ఖాన్‌పై గతంలోనూ ట్రంప్ అనేక కారణాలతో విమర్శలు చేశారు.

జీవాయుధాల అభివృద్ధి ఆపాలి

జీవ ఆయుధాలను అభివృద్ధిపరచడాన్ని ఆపాలని ఆయా దేశాలను ట్రంప్ కోరారు. జీవ ఆయుధాల ఒప్పందం అమలుకు అంతర్జాతీయంగా జరిగే కృషికి తాను నేతృత్వం వహిస్తానని చెప్పారు. అణ్వాయుధాలు మానవాళికి తీవ్రమైన ముప్పుగా పరిణమించాయన్నారు. అటువంటి అణ్వాయుధాలను ఇరాన్ కలిగి వుండేందుకు ఎన్నడూ అనుమతించబోమన్నారు. గాజా, ఇజ్రాయిల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరేలా చూస్తామన్నారు. సహేతుకమైన శాంతి ప్రతిపాదనలు వచ్చినా హమాస్ వ్యతిరేకించిందని అన్నారు.

చైనా, భారత్‌లే ప్రధాన కారణం

రష్యా, ఉక్రెయిన్ మధ్య సుదీర్ఘంగా కొనసాగుతున్న యుద్ధానికి చైనా, భారత్‌లే ప్రధానంగా నిధులు సమకూర్చేదని ట్రంప్ వ్యాఖ్యానించారు. రష్యా చమురును వారు కొనుగోలు చేయడాన్ని కొనసాగిస్తున్నందువల్లే ఈ పరిస్థితి నెలకొందన్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపకపోతే రష్యాపై టారిఫ్‌లు తప్పవని హెచ్చరించారు. అలాగే యూరప్ దేశాలు కూడా రష్యా చమురును ఉపయోగించడాన్ని ఆపాలన్నారు. రష్యా నుండి చమురు కొనుగోలు చేస్తూ మరోపక్క విమర్శిస్తున్నారని, ఇది ఆపాల్సిన అవసరముందని అన్నారు. ఉక్రెయిన్ యుద్ధాన్ని ఆపేందుకు తాను నిరంతరతరంగా కృషి చేస్తూనే వున్నానని, అయినా దాన్ని అంతం చేయడం కష్టసాధ్యంగా మారిందని వ్యాఖ్యానించారు. రష్యాను చెడుగా చూసేందుకు ఈ యుద్ధం కారణమవుతోందన్నారు.

కృష్ణా జలాల్లో తెలంగాణకు 763 టిఎంసిలు కేటాయించండి

- కెడబ్ల్యుడిసి ముందు ఆ రాష్ట్ర ప్రభుత్వ వాదనలు
- ట్రిబ్యూనల్ విచారణనకు హాజరైన మంత్రి ఉత్తమ్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కృష్ణా నది జలాల్లో తెలంగాణకు 763 టిఎంసిలు కేటాయించాలని ఆ రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. క్యాచ్‌మెంట్ ఏరియా, బేసిన్‌లోని జనాభా, కరవు ప్రాంతం విస్తీర్ణం, సాగు భూములు వంటి అంశాల ఆధారంగా లెక్కలు వేసామన్నారు. తద్వారా 75 శాతం డిపెండబుల్ వాటర్‌లో 555 టిఎంసిలు, 65 శాతం డిపెండబుల్ వాటర్‌లో 43 టిఎంసిలు, సగటు ప్రవాహాల నుండి 120 టిఎంసిలు, గోదావరి డైవర్షన్ (మళ్లింపు) నుండి మొత్తం 45 టిఎంసిలు తెలంగాణకు రావాలని కోరుతున్నామన్నారు. ఈ విషయంలో తెలంగాణకు న్యాయమైన వాటా రావాలని కృష్ణా జలాల వివాదాల పరిష్కార ట్రిబ్యునల్ (కెడబ్ల్యుడి)-2 ముందు బలమైన వాదనలు వినిపిస్తున్నట్లు చెప్పారు. గత బిఆర్‌ఎస్ సర్కార్ హయాంలో నీటి కేటాయింపుల్లో తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఆ చారిత్రాత్మక తప్పిదాన్ని సరిచేస్తూ, నిబద్ధతతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు వెళ్తోందన్నారు. కృష్ణా జలాల్లో ఏపి, తెలంగాణ కేటాయింపుల వివాదంపై సోమవారం బ్రిజేష్ కుమార్ ట్రిబ్యూనల్ విచారణ ప్రారంభించింది. మూడు రోజులు (23, 24,25) పాటు సాగే ఈ విచారణలో తెలంగాణ ప్రభుత్వం వాదనలు వినిపిస్తోంది. ఈ విచారణకు నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులతో కలిసి ట్రిబ్యునల్ ముందు హాజరయ్యారు. తొలిరోజు విచారణ తరువాత ఆయన మీడియాతో మాట్లాడారు. తెలంగాణ నీటి వాటాలపై ఫిబ్రవరి నుండి రాష్ట్ర ప్రభుత్వం వాదనలు వినిపిస్తుందని చెప్పారు. ఇది తుది వాదనలుగా భావిస్తున్నామన్నారు. తెలంగాణకు న్యాయమైన వాటా రావాలని తెలంగాణ ప్రభుత్వం తరపున సీనియర్ న్యాయవాది వైద్య నాథన్ ట్రిబ్యునల్ ముందు వాదనలు వినిపిస్తున్నారని చెప్పారు. ఉమ్మడి ఏపికి మొత్తం 1,050 టిఎంసిలలో దాదాపు 70 శాతం అంటే.... 763 టిఎంసిలను తెలంగాణకు కేటాయించాలని కోరుతున్నట్లు చెప్పారు.

ప్రతిపక్ష హోదా ఇవ్వండి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతిపక్ష నేత హోదా ఇవ్వడం అసాధ్యం కాదని ప్రకటించారు. పది శాతం సీట్లు రానందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ప్రతిపక్ష నేత హోదా ఇవ్వబోమని బహిరంగంగానే అధికార పార్టీ నేతలు ప్రకటించారు. దీని బట్టి స్పీకర్ రూలింగ్ వెనక ఉన్నదెవ్వరో అర్థం అవుతోంది.' అని ఆయన పిటిషన్‌లో పేర్కొన్నారు. ప్రతిపక్ష నేత హోదా విషయంలో రాజ్యాంగంలోని 208 అధికరణ కింద నిర్దిష్టమైన నియమావళి ఉంది. దీని ప్రకారం. ప్రతిపక్ష హోదా ఇవ్వాలని ఆయన కోరారు.

గిరిజనులపై ప్రభుత్వ నిర్బంధం అన్యాయం : సిపిఎం

(మొదటి పేజీ తరువాయి)

గ్రామాలు, సారవంతమైన భూములను నాశనం చేస్తే ప్రజలు సహించరని, ప్రభుత్వం షెడ్యూల్డ్ ఏరియా చట్టాలను, గ్రామసభ, పీసా కమిటీ తీర్మానాలను గౌరవించి ఆయుధ ఫ్యాక్టరీ ఏర్పాటును ఉపసంహరించుకోవాలని గిరిజన గ్రామాలు, భూములకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. గిరిజనులపై తప్పుడు కేసులు బనాయించి నిర్బంధించడాన్ని మానుకోవాలని హెచ్చరించారు. ప్రభుత్వం మొండిగా ముందుకు వెళితే గిరిజనులు, రైతుల నుండి ప్రతిఘటన ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ ఉద్యమానికి మద్దతుగా త్వరలో వామపక్ష పార్టీల రాష్ట్ర నాయకులు పర్యటిస్తారని తెలిపారు.

మండలిలో ఉక్కు సెగలు

(మొదటి పేజీ తరువాయి)

మద్దతు ఇస్తున్నాం. కేంద్రంతో గొడవ పెట్టుకోం, మేం చర్చిస్తాం, మాట్లాడతాం.' అని లోకేష్ అన్నారు. తాను ప్రవేశపెట్టిన తీర్మానానికి వైసిపి సభ్యులు ఆమోదం తెలుపుతున్నారా, లేదా వ్యతిరేకిస్తున్నారా అని ఆయన ప్రశ్నించారు. అయితే, సభ ముగిసిన తరువాత వైసిపి తమ తీర్మానానికి మద్దతు పలికిందని పేర్కొంటూ లోకేష్ ఒక ప్రకటన విడుదల చేశారు.దీనికిగానూ, వైసిపికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో వైసిపి ప్రవేశపెట్టిన తీర్మానం అసందర్భంగా ఉందని అన్నారు. విశాఖ స్టీల్ ప్లాంట్ లో పెట్టుబడుల ఉపసంహరణ

పెట్టుబడుల ఉపసంహరణ వెనక్కి తీసుకోండి : బొత్స

బొత్సా సత్యనారాయణ మాట్లాడుతూ విశాఖ ఉక్కు పరిశ్రమను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగించాలని, పెట్టుబడులు ఉపసంహరణ వెనక్కి తీసుకోవాలని, సొంత గనులను కేటాయించాలని కోరారు. ఈమేరకు తీర్మానం కాపీని చైర్మన్‌కు అందచేశారు. కేంద్రం ఇచ్చిన రూ.11 వేల కోట్ల నిధులలో ఇప్పటి వరకు వచ్చిన సొమ్ములో జిఎస్‌టి బకాయిలు, బ్యాంకు రుణాలు ఇతర ఖర్చులకు వినియోగించారని బొత్స తెలిపారు. ఎమ్మెల్సీ వరుదు కల్యాణి మాట్లాడుతూ కేంద్రంలో బిజెపికి మద్ధతు ఇస్తున్న టిడిపి వత్తిడి తెచ్చి అవసరం అయితే మద్ధతు ఉపసంహరించుకుని ప్రైవేటీకరణ ఆపాలన్నారు. గతంలో వైసిపి హయంలో అప్పటి సిఎం జగన్ కేంద్రంపై వత్తిడి తెచ్చి నిలుపుదల చేశారన్నారు. ఇప్పుడు మళ్ళీ విభాగాల వారీగా ప్రైవేటీకరణ జరుగుతుందన్నారు.

అయోధ్యలో మసీదు నిర్మాణ ప్లాన్‌కు నో

నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు లేవంటున్న ఎడిఎ

లక్నో : అయోధ్యలోని ధనిపూర్ గ్రామంలో మసీదు నిర్మాణానికి అందచేసిన ప్లాన్‌ను అయోధ్య అభివృద్ధి సంస్థ (ఎడిఎ) తిరస్కరించింది. ఇందుకు ఆ యా ప్రభుత్వ విభాగాల నుండి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఏవీ అందకపోవడాన్ని కారణంగా పేర్కొంది.

ఒక జర్నలిస్టు ఆర్‌టిఐ కింద ఈ నెల 16న అడిగిన ప్రశ్నకు సమాధానంగా అయోధ్య అభివృద్ధి సంస్థ పై జవాబు ఇచ్చింది. పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్, కాలుష్యం, పౌర విమానయానం, ఇరిగేషన్, రెవిన్యూ, మున్సిపల్ కార్పొరేషన్, జిల్లా మేజిస్ట్రేట్, అగ్నిమాపక శాఖలతో సహా పలు ప్రభుత్వ విభాగాలేవీ కూడా నో అబ్జెక్షన్ సర్టిఫికెట్లు ఇవ్వలేదని పేర్కొంది. అలాగే దరఖాస్తు, స్క్రూటిని ఫీజులుగా మసీదు ట్రస్టు రూ.4,02,628 చెల్లించిందని పేర్కొంది. మసీదు ప్లాన్ తిరస్కరించడంపై మసీదు ట్రస్టు కార్యదర్శి అతర్‌హుస్సేన్ స్పందిస్తూ సుప్రీంకోర్టు చెప్పిన మేరకు యుపి ప్రభుత్వం ఇచ్చిన భూమికి ప్రభుత్వ విభాగాలేవీ ఎందుకు నో అబ్జెక్షన్ ఇవ్వలేదో తనకు అర్థం కావడం లేదని అన్నారు. 2019 నవంబరు 9న సుప్రీం కోర్టు అయోధ్యలో రామమందిరంపై తీర్పును వెలువరించింది. ఈ తీర్పుకు అనుగుణంగా అయోధ్య జిల్లాలోని సోహావాల్ తహసిల్‌లో ధనిపూర్ గ్రామంలో రాష్ట్ర సున్ని సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు ఐదు ఎకరాల భూమిని మసీదు నిర్మాణం కేటాయించింది. అయోధ్య పట్టణానికి 25కిలోమీటర్ల దూరంలో ఈ స్థలం వుంది. 2020 ఆగస్టు 3న జిల్లా మేజిస్ట్రేట్ అనుజ్ కుమార్ ఝా ఆ భూమిని సున్ని సెంట్రల్ వక్ఫ్ బోర్డుకు బదలాయించారు. ఆ తర్వాత మసీదు ప్లాన్ ఆమోదం కోసం ఇతర సదుపాయాల కల్పన కోసం మసీదు ట్రస్టు 2021 జూన్ 23న ఎడిఎకు దరఖాస్తు చేసుకుంది. అయితే అప్పటినుండి ఎలాంటి కార్యాచరణ జరగలేదు.

పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో మార్మోగిన ఇటలీ

- ప్రధాని మెలోనీపె వెల్లువెత్తిన ప్రజాగ్రహం
- సమ్మెతో స్తంభించిన ప్రజా రవాణా



రోమ్ : ఇటలీలోని పలు నగరాల్లోని వీధులు పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో మార్మోగిపోయాయి. పాలస్తీనా దేశాన్ని గుర్తించేందుకు ప్రధాని జియార్జియా మెలోనీ నిరాకరించడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది మంది ప్రజలు రోడ్లపై కదం తొక్కుతూ తమను అడ్డుకున్న పోలీసులతో ఘర్షణకు దిగారు. రహదారులు, ఓడరేవులను దిగ్బంధించారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని నిరసిస్తూ 'ప్రతి దానినీ అడ్డుకోండి' అంటూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మె జరిగింది. మిలన్ నగరంలో నల్ల దుస్తులు ధరించిన ప్రదర్శకులు పాలస్తీనా పతాకాలు చేతపట్టుకొని సెంట్రల్ స్టేషన్‌లో ప్రవేశించారు. కిటికీ అద్దాన్ని ధ్వంసం చేశారు. పోలీసులపై కుర్చీలు విసిరారు. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. మిలన్ స్టేషన్ వద్ద జరిగిన ఘర్షణలో 60 మంది పోలీస్ అధికారులు గాయపడ్డారని, పది మందిని అరెస్ట్ చేశారని ప్రభుత్వ మీడియా తెలిపింది.

పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ కార్మికులు ఓడరేవుల్లో కార్యకలాపాలను అడ్డుకున్నారు. గాజాపై ప్రధాని మెలోనీ అనుసరిస్తున్న వైఖరిని ఆయన రాజకీయ ప్రత్యర్థులు తీవ్రంగా నిరసించారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న హింస సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఐక్యరాజ్యసమితి సమావేశంలో పాలస్తీనా దేశానికి అనుకూలంగా ఇటలీ ఓటు వేసింది. అయితే ప్రధాని మెలోనీ మాత్రం పాలస్తీనాను గుర్తించడానికి నిరాకరిస్తున్నారు. కాగా వెనిస్ ఓడరేవులో కూడా ప్రదర్శకులను అడ్డుకోవడానికి పోలీసులు నీటి ఫిరంగులను ఉపయోగించారు. జెనోవా, లివోర్నో, త్రిస్టే నగరాల్లోని ఓడరేవుల్లో కార్మికులు నిరసన ప్రదర్శనలు జరిపారు. గాజాలో హమాస్‌కు వ్యతిరేకంగా జరుపుతున్న యుద్ధంలో ఉపయోగించడానికి తమ ఓడరేవుల ద్వారా ఆయుధాలు, ఇతర సరఫరాలు రవాణా అవుతుండడంపై మండిపడిన కార్మికులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేశారు.

బోలోగ్నాలో ప్రదర్శకులు హైవేని దిగ్బంధించారు. వాహనాలను అడ్డుకొని పోలీసులతో ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు నీటి ఫిరంగులను ప్రయోగించారు. రాజధాని రోమ్‌లో వేలాది మంది పాలస్తీనా అనుకూలవాదులు రైల్వే స్టేషన్ వద్దకు చేరుకొని ప్రదర్శన నిర్వహించారు. ప్రధాన రింగ్ రోడ్డును దిగ్బంధించారు. 'పాలస్తీనాకు విముక్తి కల్పించాలి', 'ప్రతి దానినీ అడ్డుకోండి' అంటూ నినాదాలు చేశారు. దక్షిణాన ఉన్న నాపుల్స్ నగరంలో ప్రదర్శకులు, పోలీసుల మధ్య ఘర్షణలు జరిగాయి. ప్రధాన రైల్వే స్టేషన్‌లోకి ప్రవేశించేందుకు నిరసనకారులు ప్రయత్నించగా పోలీసులు వారిని అడ్డుకున్నారు. అయినప్పటికీ కొందరు వారి కన్నుగప్పి రైల్వే పట్టాల పైకి చేరుకున్నారు. దీంతో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. జెనోవా నగరంలో వేలాది మంది ప్రజలు పాలస్తీనా పతాకాలతో ప్రదర్శన జరిపారు.

నిరసన ప్రదర్శనల కారణంగా దేశంలో ప్రజా రవాణా స్తంభించిపోయింది. మిలన్‌లోని కీలక మెట్రో లైనును మూసివేశారు. తురిన్, బోలోగ్నా నగరాలలో యూనివర్సిటీ విద్యార్థులు తరగతి గదులలోకి అధ్యాపకులు రాకుండా అడ్డుకున్నారు. ఒకవైపు ఐరాస సర్వసభ్య సమావేశంలో పలు దేశాలు పాలస్తీనాను గుర్తిస్తుండగా మరోవైపు అనుకూల ప్రదర్శనలతో ఇటలీ మార్మోగిపోయింది. ప్రదర్శనకారులు విధ్వంసానికి పాల్పడ్డారంటూ ప్రధాని మెలోని సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ఓ పోస్ట్ పెట్టారు. ఇలాంటి చర్యలతో గాజా ప్రజల జీవితాలలో ఒక్క మార్పు కూడా రాదని శాపనార్థాలు పెట్టారు.

జీవన సౌరభం


మనం గొప్పవాళ్లం అయిన తర్వాత చప్పట్లు కొట్టేవారి కంటే.. మన దగ్గర ఏమీ లేనప్పుడు వెన్ను తట్టేవాళ్లే నిజమైన స్నేహితులు.

మీ కోసం

జ్యూస్ జార్లు, గాజు పాత్రలను శుభ్రం చేసేటప్పుడు కొద్దిగా నీరు కలిపిన ఉప్పుతో రుద్ది కడిగితే గీతలు పడవు.



పిల్లి - ఎలుక స్నేహం



ఒక ఊరిలో ఒక వర్తకుడు ఉన్నాడు. అతని కిరాణా కొట్టులో ఒక ఎలుక ఉంది. అది సామానులున్న బస్తాలకు కన్నాలు చేసి సరుకులు తినేది. దాంతో సరుకులు నాశనం అయ్యేవి. అప్పుడు వర్తకుడు ఎలుకని చంపాలని, అది తినే ఆహారంలో మందు పెట్టాడు. చాలాసార్లు అలా చేసినా అది తప్పించుకుని తిరిగింది. ఇక చేసేది లేక వర్తకుడు ఎలుకని చంపేందుకు ఒక పిల్లిని తెచ్చాడు. పిల్లి స్వామి భక్తితో ఒక సారి తన కంట పడ్డ ఎలుకను చంపబోయింది. అప్పుడు ఎలుక దానితో 'ఆగు మిత్రమా! మనిద్దరికీ శతృత్వం వద్దు. వ్యాపారి పెద్ద పిసినారి. ఎవరికీ పైసా దానం చేయడు. అత్యాశపరుడు. వ్యాపారం న్యాయమార్గంలో చెయ్యట్లేదు. సరుకులు కల్తీ చేస్తున్నాడు. చవకకి సరుకుల కొని అధిక ధరలకు అమ్ముతున్నాడు. ప్రజలకు నష్టం కలిగిస్తున్న వ్యాపారికి నేను చేసే నష్టం పెద్దదేమీ కాదు. ఈమాత్రం దానికే నన్ను చంపాలని నిన్ను తెచ్చాడు. అంతేతప్ప నీ మీద ప్రేమతో కాదు. తెలుసుకో!' అని చెప్పింది. ఎలుక మాటలు పిల్లికి తెగ నచ్చాయి. దాంతో స్నేహం చేసింది.

పిల్లి వచ్చినా ఎలుక బెడద తప్పలేదని వ్యాపారి, పిల్లికి అన్నం పెట్టడం మానేసాడు. ఎలుక, పిల్లి కలిసి వ్యాపారికి ఎక్కువ మొత్తంలో నష్టం కలిగించటం మొదలెట్టాయి. ఒక రోజు వ్యాపారి పిల్లితో 'ఎలుకను ఎందుకు చంపలేదు?' అని అడిగాడు. అప్పుడు పిల్లి, వ్యాపారి చేస్తున్న దొంగ వ్యాపారం ఆపకపోతే మరింత నష్టం చేస్తామని చెప్పింది. తమ స్నేహితులని కూడా పిలిచి కోలుకోలేని నష్టం తెస్తామని బెదిరించింది. పిల్లి అన్నంత పని చేస్తుందని వ్యాపారి భయపడ్డాడు. అప్పటినుండి న్యాయమార్గంలో వ్యాపారం చేయడం ప్రారంభించాడు. వ్యాపారిలో వచ్చిన మార్పుకు సంతోషించిన ఎలుక ఆ కొట్టు వదిలి పొలాల్లోకి పోయింది. పిల్లి వ్యాపారి వద్దే ఉండిపోయింది.

– రాళ్లబండి సంగంనాయుడు,
94909 35258.

I R A C H ______
L C P I E N ______
E O R S H ______
U N E Q E ______
Y D R A I ______
N T O T C O ______
O M N A G ______
Y D I A S ______
E L P T A ______
S L S G A ______



సరిచేసి రాయండి

పిల్లలూ, ఇక్కడ ఇచ్చిన అక్షరాలు తికమకగా ఉన్నాయి. వాటిని సరిచేసి రాస్తే ఎదురుగా ఉన్న బొమ్మను ఆంగ్లంలో ఏమంటారో వస్తుంది. ట్రై చేయండి.

నేను గీసిన బొమ్మ





టి.కీర్తి వర్ధన్,
3వ తరగతి,
పారమిథ స్కూల్,
కరీంనగర్.

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

పిల్లల ఎదుగుదలా, ఆరోగ్యమూ కీలకమే...



అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి నాలుగైదేళ్ల వరకూ పిల్లల ఎదుగుదలా, వారి ఆరోగ్య సంరక్షణపై ప్రత్యేక శ్రద్ధ అవసరమే. ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా అనారోగ్యానికి గురవ్వటమే కాకుండా బిడ్డ ఎదుగుదలలో కొన్ని ఇబ్బందులు తలెత్తొచ్చు. అందుకే తల్లులు తమ ఆరోగ్యాన్ని మొదట కాపాడుకుంటూనే తమ పిల్లల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ చూపాలి. అమృతతుల్యమైన తల్లిపాలు బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు ఎంతో దోహదపడుతుంది. వాటిలో అవసరమైన కొవ్వులు, పిండి పదార్థాలు, ప్రొటీన్లు, విటమిన్లు వంటి పోషకాలెన్నో సమతూకంలో ఉంటాయి. కాన్పు తర్వాత మొదటి రెండు, మూడు రోజుల్లో వచ్చే ముర్రుపాలు పిల్లల భావి ఆరోగ్యానికి తొలి బీజం వేస్తాయి. ఒక రకంగా తొలి టీకా లాంటివే. ఇందులో ఉండే ఇమ్యునోగ్లోబులిన్లు బిడ్డ రోగనిరోధక శక్తి పెంపొందటానికి తోడ్పడతాయి. ఇన్‌ఫెక్షన్ల భారిన పడకుండా కాపాడతాయి. ఐదారు రోజులకు పాలు కాస్త పలుచబడినప్పటికీ వాటిలో కొవ్వులు, లాక్టోజ్ బాగా ఉంటాయి. అవి బిడ్డకు మరింత శక్తినిస్తాయి. రెండు వారాల తర్వాత తల్లిపాలలో 90 శాతం నీరు, 8 శాతం పిండి పదార్థాలు, కొవ్వులు, ప్రొటీన్లు.. 2శాతం ఖనిజాలు, విటమిన్లు ఉంటాయి. ఇలా బిడ్డ అవసరాలకు అనుగుణంగా మారిపోయే తల్లిపాలను మించిన ఆహారం మరొకటి ఉండదు.

సమతుల ఆహారం మేలు : పిల్లలకు ఆహారాన్ని అందించేటపుడు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వారికి ఉపయోగించే గిన్నె, స్పూన్లు, గ్లాసులు శుభ్రంగా ఉంచుకోవాలి. పిల్లలు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉండాలన్నా, వయసును బట్టి బరువు పెరగాలన్నా వారికి పౌష్టికాహారం ముఖ్యం. పిల్లల ఎదుగుదలకు వారికి సమతుల్య ఆహారం అందించాలి. రోజువారీ ఆహారంలో ఆకుకూరలు, కూరగాయలు పాలు, గుడ్లు సరైన మోతాదులో అందించాలి. వాటిలో పొటాషియం, విటమిన్ సి, విటమిన్ బి6, కార్బోహైడ్రేట్లు పుష్కలంగా లభిస్తాయి. ఇది శిశువు బరువు పెరగటంలో కీలకంగా పనిచేస్తుంది. చిలకడ దుంపలను ఉడకబెట్టడం, గుజ్జు చేసి ఇస్తే నోటికి రుచికరంగా ఉండి తినాలనిపిస్తాయి. పప్పులో ప్రొటీన్లు, మెగ్నీషియం, కాల్షియం, ఐరన్, ఫైబర్, పొటాషియం సమృద్ధిగా ఉంటాయి.

ఉడికించిన ఆహారం శ్రేష్టం : అరునెలల వయసున్న పిల్లలకు పప్పులను సూప్‌గా కానీ, దాల్ పాణి రూపంలో తయారు చేసి పిల్లలతో తినిపించాలి. మూంగ్ దాల్ సులభంగా జీర్ణమౌతుంది. బియ్యం, కూరగాయలతో పప్పును ఉడికించి పిల్లలకు తినిపించాలి. పప్పు, బియ్యం, మినుములు కడిగి ఎండలో ఆరబెట్టి, వాటిని వేయించి, మెత్తగా పొడి చేసి, పిల్లలకు ఆహారంగా ఉపయోగించటం ద్వారా మంచి ఫలితాలుంటాయి. రాగుల్లో డైటరి ఫైబర్, కాల్షియం, ఐరన్, ప్రొటీన్లు, విటమిన్లు, మినరల్స్ పుష్కలంగా ఉంటాయి. ఇది కూడా పిల్లలకు సులభంగా జీర్ణమౌతుంది. ఇడ్లీ, దోసె, మాల్ట్, లేదా గంజి రూపంలో పిల్లలకు అందించొచ్చు. పిల్లలకు ఇష్టమైన కేకులు, కుకీల రూపంలో అందిస్తే మరింత ఫలితం ఉంటుంది. నెయ్యి లేదా క్లియర్ చేయబడిన వెన్నలో అధిక పోషకాలు ఉంటాయి. ఎనిమిది నెలల వయసున్న చిన్నారులకు ఒకటి, రెండు టేబుల్ స్పూన్ల నెయ్యిని గంజిలో జోడించి ఇవ్వొచ్చు. కిచడి, దాల్ సూప్‌పై నెయ్యి వేసి పిల్లలకు తినిపించాలి.

వ్యాక్సినేషన్ : చిన్నారులు వ్యాధుల భారిన పడకుండా ఉండేందుకు, వారిలో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించేందుకు వ్యాక్సినేషన్ ఖచ్చితంగా పాటించాలి. ప్రస్తుతం అన్ని రకాల వ్యాక్సిన్లు అందుబాటులో ఉన్నాయి. పిల్లలు పుట్టిన నాటి నుంచి పదేళ్ళ వయసు వరకూ క్రమం తప్పకుండా వాక్సినేషన్లు ఇవ్వాలి. ఇలా క్రమం తప్పకుండా వ్యాక్సినేషన్ ప్రక్రియ పూర్తి చేస్తే పిల్లలు సంపూర్ణ ఆరోగ్య వంతులుగా ఉంటారు. వీటిలో కొన్ని టీకాలు ప్రభుత్వం ఉచితంగా అందించేవి కూడా ఉన్నాయి. టీకాలు జీవితకాలాన్ని పెంపొందిస్తాయి. టీకాలు తీసుకున్న వారిలో వ్యాధినిరోధక శక్తి అధికంగా ఉంటుంది. పిల్లల్లో ఎదుగుదల 18 సంవత్సరాల వయసు వరకూ ఉంటుంది. టీకాలు వేయించుకున్న వారిలో చురుకుదనం, ఎదుగుదల స్పష్టంగా కనిపిస్తుంది. టీకాలు చేయించుకోనివారిలో హుషారు ఉండదు. అన్ని విధాలుగా వెనుకబడి ఉంటారు.

రోగ నిరోధక శక్తి : పిల్లలను సీజనల్ వ్యాధుల నుంచి కాపాడుకునేందుకు తగు జాగ్రత్తలు పాటించాలి. వాటిలో ప్రధానంగా పిల్లలను తీపి, చల్లని పదార్థాలకు దూరంగా ఉంచాలి. జలుబు ఎక్కువగా ఉన్నా, దగ్గు, కఫం లక్షణాలుంటే నిర్లక్ష్యం చేయకుండా వైద్యులలను సంప్రదించటం మేలు. వ్యాధి నిరోదక శక్తి పెంపుకు సీజనల్‌గా లభించే పండ్లను తినిపించాలి.

ఎదుగుదులకు దోహదం : ఏడాది వయసున్న పిల్లలకు అందించే ఆహారంలో పాల ఉత్పత్తులను జోడించాలి. దీనిలో ముఖ్యమైంది పెరుగు. పెరుగుతో స్మూతిలు, షేక్‌ల తయారు చేసి, దానికి వివిధ రకాల పండ్ల ముక్కలు జోడించి పిల్లలకు తినిపించాలి. పెరుగుతో పిల్లల్లో ఆరోగ్యకరమైన కొవ్వు పెరిగి, బరువు పెరుగుతారు. వెన్న, జున్ను పిల్లలకు అందించాలి. గుడ్డులో కొవ్వులు, ప్రొటీన్లు, విటమిన్లు, ఖనిజాలు పుష్కలంగా లభిస్తాయి. బాదం, పిస్తా, జీడిపప్పు, ఎండు ద్రాక్ష, నువ్వులు, గుమ్మడి గింజలు, అవిశ గింజలు, నేరేడు పండ్లు పిల్లల బరువు పెరగటానికి ఎంతగానో ఉపకరిస్తాయి. వాటిని పౌడర్ రూపంలో పాలల్లో కలిపి తాగించటం ద్వారా మంచి ఫలితం ఉంటుంది.



డా॥ సయ్యద్ బాబ్‌జాన్ ఎండి
అమైరా చిల్డ్రన్ క్లినిక్, పురిటి, చిన్న పిల్లల వైద్యనిపుణులు, లాక్టేషన్ కౌన్సిలర్,
కళ్యాణదుర్గం,
అనంతపురం జిల్లా.

టీకాలు ఇవి మేలు

- బిడ్డ పుట్టిన వెంటనే పోలియో నిర్మూలకు ఓపివి–0
- టిబి నిర్మూలనకు బిసిజి
- లివర్ సంబధిత వ్యాధులు సోకకుండా హెచ్ఇపి బి1 వ్యాక్సిన్లు
- ఆరు వారాల తరువాత పోలియో చుక్కలు
- కోరింతదగ్గు వంటివి సోకకుండా డిపిటి, హెపటైటిస్ బి తొలి డోస్
- డయేరియా వంటివి రాకుండా రోటావైరస్
- రక్తంలో ఇన్‌ఫెక్షన్లు, సైనస్, ఊపిరితిత్తుల సమస్యలు రాకుండా పిసివి 10 వ్యాక్సిన్
- పదివారాలు నిండిన తరువాత ఓపివి డిపిటి, హెపటైటిస్ బి, రోటావైరస్, పిసివి 10 రెండో డోస్
- 14 వారాలు నిండిన తరువాత మూడో డోస్
- ఆరు నెలలు వయసు నిండిన తర్వాత టైఫాయిడ్ రాకుండా ఇన్‌ఫ్లూయాంజా మొదటి డోస్
- ఏడు నెలలు నిండిన తరువాత రెండో డోస్
- తొమ్మిది నెలల వయసులో గవద బిళ్ళల నిరోధానికి ఎంఎంఆర్
- సైనసైటిస్ నియంత్రణకు ఎంసివి మొదటి డోస్
- 12 నెలల వయసులో ఎంసివి సెకండ్ డోస్ హెపటైటిస్ ఎ ఫస్ట్‌డోస్
- మెదడువాపు వ్యాధి నియంత్రణకు జెఈ ఫస్ట్ డోస్
- 13 నెలలకు జెఈ సెకండ్‌డోస్
- 15 నెలలు నిండిన తరువాత చికెన్‌పాక్స్ నియంత్రణకు వెరిసెల్లా ఫస్ట్ డోస్, ఎంఎంఆర్ సెకండ్ డోస్
- 18 నెలల వయసులో ధనుర్వాతం రాకుండా డిపిటి బూస్టర్ డోస్
- రెండేళ్లకు టైఫాయిడ్ సోకకుండా, మూడేళ్ళకు వెరిసిల్లా సెకండ్ డోస్
- ఐదేళ్లకు ధనుర్వాతం రాకుండా డిట్యాస్ బూస్టర్ డోస్–2
- పదేళ్ళ వయసులో ఆడ పిల్లలకు గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ సోకకుండా హెచ్‌పివి వ్యాక్సిన్ చేయించాలి.

జాతీయ చలనచిత్ర అవార్డులు ప్రదానోత్సవం

- అందుకున్న పలువురు ప్రముఖులు
- దాదా సాహెబ్ ఫాల్కే అవార్డును స్వీకరించిన మోహన్‌లాల్

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశ రాజధాని ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో మంగళవారం 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమా నికి ముఖ్య అతిథిగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ హాజరయ్యారు. రాష్ట్రపతి చేతుల మీదుగా ఈ అవార్డులను ప్రదానం చేశారు. నటుడు మోహన్‌లాల్ దాదా సాహెబ్ ఫాల్కే అవార్డు అందుకున్నారు. అలాగే, షారూఖ్ ఖాన్ ఉత్తమ నటుడి అవార్డు అందుకున్నారు. ఉత్తమ నటి అవార్డును రాణి ముఖర్జీ అందుకున్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ చలన చిత్ర అవార్డుల్లో జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి నిలిచింది. బెస్ట్ యాక్షన్ డైరెక్షన్, స్టంట్ కొరియోగ్రఫీ – హనుమాన్, బెస్ట్ యానిమేషన్ విజువల్స్, గేమింగ్ అండ్ కామిక్ – హనుమాన్, బెస్ట్ లిరిక్స్ – బలగం (ఊరు పల్లెటూరు పాట), బెస్ట్ స్క్రీన్ ప్లే – సాయి రాజేష్ నీలం (బేబీ), బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ – రోహిత్ (బేబీ), బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ – డైరెక్టర్ సుకుమార్ కుమార్తె సుకృతి వేణి (గాంధీ తాత చెట్టు), ఉత్తమ నటులుగా షారుఖ్ ఖాన్ (జవాన్), విక్రాంత్ (12 ఫెయిల్), జాతీయ ఉత్తమ నటిగా రాణి ముఖర్జీ, జాతీయ ఉత్తమ చిత్రంగా 12 ఫెయిల్ నిలిచాయి. వీరందరికీ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము చేతులు మీదుగా అవార్డులను ప్రదానం చేశారు.



రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి అవార్డు అందుకుంటున్న అనిల్ రావిపూడి

అవార్డులు అందుకున్న ఇతర తెలుగు సినిమాలు

1. బెస్ట్ యానిమేషన్, విజువల్ ఎఫెక్ట్స్, గేమింగ్ అండ్ కామిక్ (హనుమాన్) అవార్డును దర్శకుడు ప్రశాంత్ వర్మ, యానిమేటర్ జెట్టి వెంకట్ కుమార్ అందుకున్నారు.
2. బెస్ట్ చైల్డ్ ఆర్టిస్ట్ (గాంధీ తాత చెట్టు) అవార్డును సుకృతి వేణి అందుకున్నారు.
3. బెస్ట్ ప్లే బ్యాక్ సింగర్ (బేబీ) అవార్డును పివిఎన్ఎస్ రోహిత్ అందుకున్నారు.
4. బెస్ట్ స్క్రీన్ ప్లే (బేబీ) అవార్డును సాయి రాజేష్ నీలం అందుకున్నారు.
5. బెస్ట్ లిరిక్స్ (బలగం, ఊరు పల్లెటూరు పాట) అవార్డును కాసర్ల శ్యామ్ అందుకున్నారు.
6. బెస్ట్ యాక్షన్ డైరెక్షన్, స్టంట్ కొరియోగ్రఫీ (హనుమాన్) అవార్డును నందు పృథ్వి అందుకున్నారు.
7. ఉత్తమ తెలుగు చిత్రం(భగవంత్ కేసరి) అవార్డును దర్శకుడు అనిల్ రావిపూడి అందుకున్నారు.

శ్రీవిష్ణు హీరోగా కొత్త సినిమా



కోన వెంకట్ సమర్పణలో శ్రీవిష్ణు హీరోగా ఓ సినిమా తెరకెక్కుతోంది. స్కంద వాహన మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై రూపుదిద్దుకుంటున్న ఈ సినిమాను జానకి రామ్ మారెళ్ళ డైరెక్ట్ చేస్తున్నారు. మహిమా నంబియార్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. రాధికా శరత్ కుమార్, షైన్ టామ్ చాకో, ఉపేంద్ర లిమాయే, శత్రు, సాయిచంద్, బ్రహ్మాజీ, తదితరులు కీలక పాత్రలను పోషిస్తున్నారు.

ఓవర్సీస్‌లో తమిళ 'ఓజీ' లేదు

పవన్ కళ్యాణ్ కథానాయకుడిగా, ప్రియాంక మోహన్ కథానాయికగా నటించిన చిత్రం 'ఓజీ'. సుజీత్ దర్శకత్వం వహించిన చిత్రం గురువారం విడుదల కానుంది. తమన్ సంగీతం అందించారు. ఇమ్రాన్ హష్మీ, ప్రకాష్‌రాజ్, శ్రియారెడ్డి తదితరులు కీలకపాత్రల్లో నటించారు. ఇటీవలే ఈ సినిమా ట్రైలర్ విడుదలయ్యింది. మాఫియా నేపథ్యంలో ఈ సినిమా తెరకెక్కింది. ఓజీ తమిళ వర్షన్ నార్త్ అమెరికాలో విడుదల చేయటం లేదని ప్రత్యంగిరా సినిమాస్ ప్రకటించింది. కేవలం తెలుగు, హిందీ వర్షన్ మాత్రమే విడుదలవుతుందని ట్వీట్ చేసింది. కంటెంట్ ఆలస్యం కారణంగానే ఓజీ తమిళ వెర్షన్ ఉత్తర అమెరికాలో విడుదల కావడం లేదని తెలిపింది.

కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై స్టే



రూ.200లకే సినిమా టికెట్ ధరలు ఉండాలనే విషయంలో కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై 'కాంతార' (హోంబలే ఫిలింస్) సినిమా నిర్మాతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. ఈ పిటీషన్ మంగళవారం విచారణకు రాగా తదుపరి విచారణ జరిపి తుది తీర్పు వచ్చేవరకూ టికెట్ ధరల పరిమితిని అమలు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో సినిమా టికెట్ ధర గరిష్టంగా రూ.200గా మాత్రమే ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై 'కాంతార' సినిమా నిర్మాతలు కోర్టుకెక్కారు. ప్రభుత్వం నిర్ణయించిన కొత్త నిబంధనల వలన కాంతర వంటి పెద్ద బడ్జెట్ సినిమాలతో పాటు, మల్టీప్లెక్స్‌లలో అధిక ధరలు ఉండే సినిమాలను విడుదల చేయడం కష్టమవుతుందని దానివల్ల ఆదాయం తగ్గి మొత్తం సినీ పరిశ్రమపై చెడు ప్రభావం పడుతుందని హోంబలే ఫిల్మ్స్ వాదించింది.

అవి ఫేక్ ప్రచారాలే : రిషబ్‌శెట్టి

'కాంతార: చాప్టర్ 1' కాంతారకు ప్రీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా అక్టోబర్ రెండోతేదీన విడుదల కానుంది. కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. రుక్మిణి వసంత్ కథానాయిక. 'నో స్మోకింగ్, నో ఆల్కహాల్, నో మీట్ అనే పోస్టర్‌ని చూసి నేను షాక్ అయ్యాను. వెంటనే మా నిర్మాణ సంస్థను సంప్రదించి ఆ పోస్టర్ నిజమా? కాదా? అని నిర్ధారించుకున్నాను. అది ఎవరో కావాలని సృష్టించిన ఫేక్ పోస్టర్ అని తేలింది. అలాంటి తప్పుడు ప్రచారాలపై మేం స్పందించాలని కూడా అనుకోవడం లేదు' అని రిషబ్‌శెట్టి ఒక ప్రకటనలో తెలిపారు.

ఫైనల్ బెర్త్‌పై టీమిండియా గురి

- నేడు బంగ్లాదేశ్‌తో కీలక పోరు
- రాత్రి 8.00గం॥లకు
- పాక్ చేతిలో ఓటమితో ఫైనల్ రేసుకు శ్రీలంక దూరం



దుబాయ్: డిఫెండింగ్ ఛాంపియన్ టీమిండియా ఫైనల్ బెర్త్‌పై గురిపెట్టింది. సూపర్-4 తొలి మ్యాచ్‌లో పాకిస్తాన్‌పై ఘన విజయం సాధించిన సూర్యకుమార్ సేన.. బంగ్లాదేశ్‌తో బుధవారం జరిగే రెండో మ్యాచ్‌లో గెలిస్తే ఫైనల్ బెర్త్ దక్కనుంది. ఈ టోర్నీలో ఓటమి ఎరుగని భారతజట్టు బంగ్లాదేశ్‌ను ఏమాత్రం తేలిగ్గా తీసుకోవడానికి వీల్లేదు. ఆ జట్టు సూపర్-4లో ఏకంగా శ్రీలంకను చిత్తు చేసింది. ఈ క్రమంలో బంగ్లాజట్టు టీమిండియాను ఓడించినా ఆ జట్టుకూ ఫైనల్ బెర్త్ దక్కనుంది. దీంతో టీమిండియా ఏ మాత్రం ప్రయోగాలకు తెరలేపకుండా బంగ్లాదేశ్‌ను ఓడిస్తే సరిపోతుంది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ ఇలా... అన్ని విభాగా ల్లోనూ భారతజట్టు పటిష్టంగా ఉంది. సూపర్-4 తొలి మ్యాచ్‌లో బంగ్లాదేశ్ 4వికెట్ల తేడాతో శ్రీలంకను, టీమిండియా 6వికెట్ల తేడాతో పాకిస్తాన్‌ను ఓడించాయి.


శ్రీలంకపై పాకిస్తాన్ గెలుపు

అబుదాబి వేదికగా మంగళవారం జరిగిన రెండో సూపర్-4 మ్యాచ్‌లో పాకిస్తాన్ చెలరేగి ఆడింది. శ్రీలంక నిర్దేశించిన 134 పరుగుల లక్ష్యాన్ని పాక్ జట్టు 18ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. మహ్మద్ నవాజ్(38 నాటౌట్), హుసైన్(32 నాటౌట్) పాకిస్తాన్ గెలుపులో కీలకపాత్ర పోషించారు. ఆ జట్టు 80పరుగులకే 5వికెట్లు కోల్పోయి కష్టాల్లో ఉన్న దశలో వీరిద్దరూ మరో వికెట్ పడకుండా మ్యాచ్‌ను ముగించారు. ఓపెనర్ ఫర్హాన్(24), ఫకర్ జమాన్(17) రాణించినా.. ఆయుబ్(2) కెప్టెన్ అఘా సల్మాన్(5) నిరాశపరిచారు. వికెట్ కీపర్ హ్యారీస్(13) కూడా త్వరగా పెవీలియన్‌కు చేరడంతో ఆ జట్టు కష్టాల్లో పడింది. ఆ దశలో నవాజ్, హుసైన్ స్ఫూర్తి దాయక ఇన్నింగ్స్ ఆడి మ్యాచ్‌ను ముగించారు. శ్రీలంక బౌలర్లు హసరంగ, తీక్షణకు రెండేసి, ఛమీరకు ఒక వికెట్ దక్కాయి.

టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన శ్రీలంకను పాక్ పేసర్ షాహిద్ అఫ్రిది ఆదిలోనే షాకిచ్చాడు. తొలి బంతికే డేంజరస్ ఓపెనర్ కుశాల్ మెండిస్(0)ను వెనక్కి పంపాడు. ఆ కాసేపటికే పథుమ్ నిశాంక(8)ను ఔట్ చేసి లంకను ఒత్తిడిలో పడేశాడు. 18 పరుగులకే రెండు వికెట్లు పడిన జట్టును కుశాల్ పెరీరా(15), చరిత్ అసలంక(20) ఆదుకునే ప్రయత్నం చేశారు. దీంతో లంక స్కోర్ వంద దాటడం గగనమే అనిపించింది. అయితే.. కమిందు మెండిస్(50 44 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్సర్లు) ఒంటరి పోరాటంతో ఆపద్బాంధవుడి పాత్ర పోషించాడు. వనిందు హసరంగ(15), కరుణరత్నే (17)తో కీలక భాగస్వామ్యం నెలకొల్పిన మెండిస్ 16వ ఓవర్ తర్వాత గేర్ మార్చాడు. రవుఫ్ వర్లో తొలి బంతినే బౌండరీకి పంపి జట్టు స్కోర్ 100 దాటించాడు. 19వ ఓవర్లో మెండిస్ ఎల్బీగా వెను దిరిగాడు. చివరి ఓవర్లో రన్స్ రావడంతో లంక 8 వికెట్ల నష్టానికి 133 పరుగులు చేయగలిగింది. పాకిస్తాన్ బౌలర్లు షాహిన్ షా అఫ్రిదికి మూడు, రవూఫ్, హుసైన్‌కు రెండేసి వికెట్లు దక్కాయి. వరుసగా రెండో ఓటమితో శ్రీలంక జట్టు ఫైనల్ రేసు నిష్క్రమించగా.. బంగ్లాపై నెగ్గితే పాక్ జట్టు ఫైనల్‌కు చేరుతుంది.

సత్తా చాటిన తెలుగు టైటాన్స్

టై బ్రేకర్‌లో జైపూర్ గెలుపు • ప్రొ కబడ్డీ సీజన్-12



జైపూర్: ప్రొ కబడ్డీ సీజన్-12 ఉత్కంఠభరితంగా సాగుతోంది. సవాయ్ మాన్‌సింగ్ స్టేడియంలో మంగళవారం జరిగిన పోటీల్లో తెలుగు టైటాన్స్ ఒక్క పాయింట్ తేడాతో గుజరాత్ జెయింట్స్‌ను చిత్తుచేయగా.. మరో మ్యాచ్ జైపూర్ పింక్‌ప్యాంథర్స్, యు ముంబ జట్ల మధ్య జరిగిన హోరాహోరీ పోరులో జైపూర్ జట్టు టై బ్రేకర్‌లో గెలిచింది. నిర్ణీత రెండు అర్ధభాగాల సమయం ముగిసేసరికి ఇరుజట్లు 38-38పాయింట్లతో సమంగా నిలిచాయి. టై బ్రేకర్‌లో జైపూర్ జట్టు 6-4పాయింట్ల తేడాతో యు ముంబను చిత్తుచేసింది. జైపూర్ రైడర్ నితిన్ ధన్‌ఖడ్(14పాయింట్లు)కి తోడు రేజా(4), డిఫెండర్ ఆశీశ్ కుమార్(3) రాణించారు. ఇక యు ముంబ జట్టులో సందీప్ కుమార్(14) రైడ్స్‌లో రాణించినా.. కెప్టెన్ సునీల్ కుమార్(1) నిరాశపరిచాడు. ఇక తెలుగు టైటాన్స్ జట్టు కెప్టెన్ వినయ్ మాలిక్(7), భరత్(9) రైడ్స్‌లో రాణించగా.. ట్యాకిల్స్‌లో శుభమ్ షిండే(4) మెరిసాడు. ఈ గెలుపుతో టైటాన్స్ 10 మ్యాచ్‌లు ముగిసేసరికి 5విజయాలు, 5ఓటములతో సహా 10పాయింట్లతో 4వ స్థానానికి ఎగబాకింది.

స్టోక్స్‌కు పగ్గాలు.. పోప్‌కు దక్కని చోటు

- యాషెస్ సిరీస్‌కు ఇంగ్లండ్ జట్టు ప్రకటన

లండన్: ప్రతిష్టాత్మక యాషెస్ సిరీస్‌కు ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్‌బోర్డు(ఇసిబి) జట్టును ప్రకటించింది. కెప్టెన్‌గా బెన్ స్టోక్స్‌కు పగ్గాలు అప్పగించిన ఇసిబి.. సీనియర్ బ్యాటర్ ఓలీ పోప్‌కు తుది 16మంది జట్టులో చోటు దక్కలేదు. భారత్‌తో ఐదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్‌లో భాగంగా చివరి టెస్ట్‌కు దూరమైన 34ఏళ్ల స్టోక్స్, వేలికి గాయంతో దూరమైన స్పిన్నర్ షోయబ్ బషీర్ ఫిట్‌నెస్ సాధించారు. స్పిన్నర్ కోటాలో షోయబ్ బషీర్ ఒక్కడికే చోటు లభించింది. వైస్ కెప్టెన్‌గా హారీ బ్రూక్ ఎంపికయ్యాడు. నవంబర్ 21 నుంచి పెర్త్ వేదికగా ఇంగ్లండ-ఆస్ట్రేలియా జట్ల మధ్య ఐదు టెస్ట్ మ్యాచ్‌ల యాషెస్ సిరీస్ ప్రారంభం కానుంది. మాథ్యూ పోట్స్, విల్ జాక్స్ తిరిగి టెస్ట్‌జట్టులో చోటు దక్కించుకోగా.. వైస్ కెప్టెన్ ఓలీ పోప్‌కు ఇసిబి మొండిచెయ్యి చూపడం విశేషం.

జట్టు: బేథెల్, బ్రూక్, క్రాలే, డకెట్, పోప్, రూట్ జేమీ స్మిత్(వికెట్ కీపర్), బెన్ స్టోక్స్, జాక్స్, బషీర్, ఆర్చర్, అట్కిన్సన్, కర్సే, పోట్, టంగ్, మార్క్‌వుడ్.

ఇంగ్లండ్ అంపైర్ డిక్కీ బర్డ్ కన్నుమూత



ఇంగ్లండ్ వెటరన్ అంపైర్ హెరాల్డ్ డిక్కీ బర్డ్(92) వయోభారంతో మంగళవారం కన్నుమూశారు. యార్క్‌షైర్ క్రికెట్ క్లబ్ ఒక ప్రకటనలో ఈ విషయాన్ని వెల్లడించింది. 'క్రికెట్ చరిత్రలో అత్యంత ప్రసిద్ధి గల, ప్రజల ఇష్టమైన అంపైర్'గా మన్ననలు అందుకున్న అంపైర్‌ను కోల్పోయినట్లు ప్రకటించింది. ఇంగ్లండ్-వేల్స్ క్రికెట్ బోర్డ్, యార్క్‌షైర్ కౌంటీ క్రికెట్ క్లబ్, లీసెస్టర్‌షైర్ క్లబ్ డిక్కీ బర్డ్ మరణంపై సంతాపం ప్రకటించాయి. భారత మాజీ క్రికెటర్ సునీల్ గవాస్కర్ 'గొప్ప వ్యక్తిత్వం, ఆటగాళ్ల ఒత్తిళ్లను అర్థం చేసుకునేవారు' అంటూ నివాళులు అర్పించారు. 1973 నుంచి 1996 వరకు 66టెస్ట్ మ్యాచులు, 69 వన్డేలకు అంపైర్‌గా సేవలందించారు. 1986లో, 2012లో ఐసిసి ఉత్తమ అంపైర్ అవార్డులు అందుకున్నారు.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68